సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 138

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'



రాణించిన ఫార్మా, ఐటీ షేర్లు

19,600 చేరువలో నిఫ్టీ. సెన్సెక్స్ లాభం 232 పాయింట్లు -13లో



సిరీస్ కాపాడుకునేందుకు...

నేడు వెస్టిండీస్‌తో భారత్ మూడో టి20. తీవ్ర ఒత్తిడిలో టీమిండియా. -12లో



ఎంపీగా లోక్‌సభలోకి రాహుల్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ దాదాపు నాలుగు నెలల తర్వాత మళ్లీ లోక్‌సభలో ఎంపీ హోదాలో అడుగుపెట్టారు.

- వివరాలు 6లో



కాంగ్రెస్ అర్థం చేసుకోలేదు..

పంచాయతీ రాజ్ వ్యవస్థ అవసరాన్ని స్వాతంత్య్రం వచ్చిన 4దశాబ్దాల తర్వాత కూడా కాంగ్రెస్ అర్థం చేసుకోలేదని మోదీ అన్నారు.


- వివరాలు 6లో



అక్టోబర్‌లో గ్రూప్‌-3 పరీక్షలు!

గ్రూప్‌-3 పరీక్షల నిర్వహణకు టీఎస్‌పీఎస్సీ కసరత్తు ముమ్మరం చేసింది. పరీక్షలను అక్టోబర్‌లో నిర్వహించాలని భావిస్తోంది.

- వివరాలు 3లో



గజం రూ.1,05,000

మోకిలాలోని హెచ్‌ఎండీఏ ప్లాట్లకు సోమవారం నిర్వహించిన ఆన్‌లైన్ వేలానికి అనూహ్యమైన స్పందన లభించింది.

- వివరాలు 14లో

న్యూస్‌రీల్

ప్రైవేటులో ఎంబీబీఎస్ ఫీజుల ఖరారు



ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్ల ఫీజులను సవరించారు. కొన్ని కాలేజీల్లో పెరగ్గా కొన్ని కాలేజీల్లో తగ్గాయి. కొన్ని కాలేజీల్లో యథాతథంగా ఉన్నాయి. టీఏఎఫ్‌ఆర్‌సీ సిఫార్సులను వైద్య శాఖ అనుమతించింది.

- వివరాలు 3లో

కేంద్రంలో వచ్చేది సంకీర్ణమే



రానున్న లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వమే ఏర్పడుతుందని మున్సిపల్, ఐటీ, చేనేత శాఖ మంత్రి కె. తారక రామారావు జోస్యం చెప్పారు. ఆ సంకీర్ణ సర్కారులో తమ పాత్ర తప్పకుండా ఉంటుందని స్పష్టం చేశారు.

- వివరాలు 5లో



గద్దర్ సతీమణిని ఓదారుస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్



హైదరాబాద్‌లో గన్‌పార్కు వద్ద గద్దర్ అంతిమయాత్రకు తరలివచ్చిన అభిమానులు..

గుండె బరువుతో పాటకు సెలవు..

- ఆట పాటలు, అశ్రునయనాలతో గద్దర్ అంతిమ యాత్ర
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- బౌద్ధమత ఆచారం ప్రకారం సమాధి
- ప్రజా గాయకుడి పార్థివదేహానికి నివాళులర్పించిన సీఎం కేసీఆర్
- గద్దర్ సతీమణి, కుటుంబసభ్యులకు పరామర్శ
- రాజకీయ, సినీరంగాల ప్రముఖులు, ప్రజా సంఘాల నేతల నివాళి - 2లో

అంతిమయాత్రలో విషాదం..



గద్దర్ అంతిమయాత్రలో గుండెపోటుతో మరణించిన ఆయన సన్నిహితుడు, సియాసత్ మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ ఖాన్. 2లో

యువ ఇంజనీర్లకు ఉపాధి ఎక్కడ?

కొలువుకు దూరంగా సగానికి పైగా కొత్త ఇంజనీర్లు

దేశవ్యాప్తంగా ఏటా సగటున 14 లక్షల మంది ఇంజనీరింగ్‌లో చేరిక

కానీ ఏటా కేవలం 6 లక్షల మంది ఇంజనీర్లకు మాత్రమే ఉపాధి

రాష్ట్రంలోనూ ఇదే తరహా పరిస్థితి

2021–22లో 87వేల మంది చేరిక.. 39 వేల మందికే ఉద్యోగాలు

చదువుకుతగ్గ ఉద్యోగాలు తక్కువ.. నాన్ స్కిల్డ్ జాబ్‌లు ఎక్కువ.. తాజా సాంకేతికతలను అందిపుచ్చుకోలేకే..

➤ నిజామాబాద్‌కు చెందిన సూర్యకిరణ్ కంప్యూటర్ సైన్స్ డిగ్రీ చేశాడు. ప్రస్తుతం డిమాండ్ ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అతని ప్రధాన సబ్జెక్టు. ఇతను ఓ ప్రముఖ కంపెనీ ఇంటర్వ్యూకి వెళ్ళాడు. మైక్రో లెవల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన ప్రశ్నలు వేశారు. ఇంత సూక్ష్మ స్థాయి టెక్నాలజీ గురించి అతను పుస్తకాల్లో చదవలేదు. ప్రాజెక్టు సమయంలోనూ దీని జోలికెళ్ళలేదు. దీంతో నైపుణ్యం లేదని కంపెనీ ఉద్యోగం ఇవ్వలేదు.



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోనే కాదు..దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ విద్యకున్న డిమాండ్ అంతా ఇంతా కాదు. ఆకర్షణీయమైన వేతనంతో ఏ బహుళజాతి కంపెనీలోనో తక్షణ ఉద్యోగం లేదా డిగ్రీ పూర్తి కాగానే ఎమ్మెస్ కోసం అమెరికా లాంటి దేశానికి వెళ్లి పోవచ్చు. డాలర్ డ్రీమ్స్ నెరవేర్చుకోవచ్చు. ఎక్కువ మంది విద్యార్థులు ప్రధానంగా ఇలాంటి కారణాలతోనే మిగతా 3వ పేజీలో ▶

మహారాష్ట్రలో గెలిపిస్తే కేంద్రం మెడలు వంచుతాం

- రైతు ప్రభుత్వం ఏర్పాటు మినహా వేరే కోరికలేవీ లేవు: సీఎం కేసీఆర్
- బీఆర్‌ఎస్ లేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు కాదు
- దేశంలో కొత్త పార్టీ అవసరముంది

10లో

ఢిల్లీ బిల్లు నెగ్గింది

- రాజ్యసభలో ప్రవేశపెట్టిన అమిత్ షా
- అనుకూలంగా 131 మంది, వ్యతిరేకంగా 102 మంది ఓటు
- బిల్లు రాజ్యాంగవిరుద్ధమన్న విపక్షాలు
- ఢిల్లీలో అవినీతిరహిత పాలన కోసమే బిల్లు తీసుకొచ్చామన్న అమిత్ షా - వివరాలు 6లో

మణిపూర్‌పై సుప్రీం కమిటీ

- మణిపూర్ అల్లర్ల బాధితులకు అందే సహాయ, పునరావాసం, పరిహారంపై పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు ముగ్గురు రిటైర్డు మహిళా జడ్జీలతో కమిటీ వేసింది. మణిపూర్ అల్లర్లకు సంబంధించి క్రిమినల్ కేసులపై దర్యాప్తు పర్యవేక్షణకు మహారాష్ట్ర పోలీస్ రిటైర్డు చీఫ్ దత్తాత్రేయ పద్సల్గికర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో చట్ట పాలనపై ప్రజలకు విశ్వాసం కల్పించడానికి యత్నిస్తున్నట్లు తెలిపింది. - 6లో


ఎల్బీ స్టేడియం నుంచి మొదలైన గద్దర్ అంతిమయాత్ర


గన్‌పార్క్ వద్ద..


మహాబోధి విద్యాలయం వద్దకు చేరుకున్న గద్దర్ పార్థివదేహం


అంత్యక్రియల క్రతువులో కుమారుడు

గద్దర్ మృతి పట్ల సోనియాగాంధీ సంతాపం

- కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ పక్షాన గద్దర్ భార్యకు లేఖ

సాక్షి, హైదరాబాద్: ప్రజాగాయకుడు గద్దర్ మృతి పట్ల సోనియాగాంధీ సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ హోదాలో సోమవారం గద్దర్ సతీమణి విమలారావుకు ఆమె సంతాపలేఖ రాశారు. 'సమాజంలోని అణగారిన వర్గాల పక్షాన వారి పోరాటాలకు ఊతమివ్వడంలో తన సాంస్కృతిక కళ ద్వారా గద్దర్ కీలకపాత్ర పోషించారు' అని లేఖలో సోనియాగాంధీ పేర్కొన్నారు. తన ఆశయాల సాధన దిశలో జీవితాంతం నిబద్ధతతో పాటలు పాడుతూ ప్రజలను చైతన్య పరిచారని కొనియాడారు. గద్దర్ ప్రస్థానంలో విమలారావు క్రియాశీల పాత్ర పోషించారని, కష్టకాలంలో ఆ కుటుంబానికి అండగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

గద్దర్ అంటే పేరు కాదు.. బ్రాండ్: సజ్జనార్



సాక్షి, హైదరాబాద్: ప్రజా గాయకుడు గద్దర్ భౌతికకాయానికి సీనియర్ ఐపీఎస్ అధికారి, టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ నివాళులర్పించారు. సోమవారం ఆయన ఎల్బీస్టేడియానికి వెళ్లి గద్దర్ పార్థివ దేహానికి నివాళులర్పించి, గద్దర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకు ముందు సజ్జనార్ గద్దర్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని వివరిస్తూ ఓ ట్వీట్ పెట్టారు. 'కన్నీటి సిరాను కలంలో నింపి హృదయ పలకం మీద రాస్తున్న చరాక్షర నివాళి! గద్దర్.. ఇది పేరు కాదు ఒక బ్రాండ్. విప్లవ ప్రయాణానికి రథ సారథి ఆయన. పేదల పక్షాన జరిగే పోరాటాలకు వెన్నెముక. ఎన్నో ప్రభుత్వాలను ప్రజల పక్షాన అడిగిన ప్రశ్న. 'పాట అంటే గుండెతో విని.. మెదడులో ఆలోచనలు రేపేది. పాటంటే మాటలతో తూటాలను ఎక్కుబెట్టి.. అన్యాయపు మర్మాన్ని రట్టు చేసేది' అని అర్థం చెప్పిన వారు గద్దర్ అని సజ్జనార్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. సమ సమాజ నిర్మాణానికి అలుపెరగని పోరాటం చేసిన గద్దర్‌కు టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం, టీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల పక్షాన నివాళులర్పిస్తున్నట్టు పేర్కొన్నారు. 'గద్దర్ గారితో నాకు సుమారు దశాబ్ద కాలంగా పరిచయం ఉంది. ప్రజా ఉద్యమంలో ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో తన పాత్ర గురించి ఎన్నో సందర్భాలలో నాతో పాలు పంచుకున్నారు. ఉద్యమం అంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిపే పోరాటం కాదని, ప్రజల హక్కులను కాపాడుకోవడం అని ఎన్నోసార్లు చెప్పేవారు. తాను రాసిన 'మల్లె తీగకు పందిరివోలె' పాటకు ప్రభుత్వం నంది అవార్డు ప్రకటించినా తిరస్కరించి పాటపై తనకున్న గౌరవాన్ని చాటారని, పాటంటే వ్యాపారం కాదని, పాటంటే ప్రజల నాడి అని చెప్పేవారని సజ్జనార్ గుర్తు చేసుకున్నారు. ఎందరో ఉద్యమకారులకు తన పాటలతో నివాళులర్పించిన గద్దర్‌కు నివాళులర్పించాల్సి రావడం బాధాకరమని సజ్జనార్ పేర్కొన్నారు.

'బలహీనవర్గాల హక్కుల కోసం పోరాడిన గద్దర్'

సాక్షి, హైదరాబాద్: సమాజంలోని బలహీన వర్గాలు, నిమ్నవర్గాలు, సంచార జాతులు, కులాలకు సమానంగా హక్కులు లభించాలని బతికున్నంతకాలం పాటను ఆయుధంగా మలచి ఉద్యమ జీవితం గడిపిన ప్రజా గాయకుడు గద్దర్ మరణం ఈ వర్గాలకు తీరని లోటని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. పాటకు ప్రాణ ప్రతిష్ట చేసిన గద్దరన్న మరణం తనను దిగ్భ్రాంతికి లోను చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు.

గుండె బరువుతో పాటకు సెలవు..

అధికారిక లాంఛనాలతో గద్దర్ అంత్యక్రియలు


గాల్లోకి కాల్పులు జరుపుతూ గద్దర్‌కు గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో/అల్వాల్/ గన్‌ఫౌండ్రి: ప్రజా యుద్ధనౌక ఇక సెలవంటూ తరలివెళ్లింది. తన పదునైన గళంతో, ఉర్రూతలూగించే పాటలతో అర్ధ శతాబ్దం పాటు యావత్ సమాజాన్ని ప్రభావితం చేసిన సాంస్కృతిక యోధుడు, ప్రజా గాయకుడు గద్దర్ అంత్యక్రియలు సోమవారం సాయంత్రం అల్వాల్ భూదేవినగర్‌లో ఆయన స్థాపించిన మహాబోధి పాఠశాలలో ముగిశాయి. వేలాదిమంది అభిమానులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, కవులు, కళాకారులు, ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, కుటుంబసభ్యులు, బంధువులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో క్రియాశీలమైన భూమికను పోషించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన వంతు కృషి చేసిన గద్దర్ అంత్యక్రియలను రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో నిర్వహించింది. బౌద్ధమత సాంప్రదాయం ప్రకారం గద్దర్ తనయుడు సూర్య అంత్యక్రియల క్రతువును నిర్వహించారు. బౌద్ధమత గురువులు పంచశీల సూత్రాలను పఠించారు. అనంతరం గద్దర్ పార్థివదేహాన్ని సమాధి చేశారు. ఈ సందర్భంగా పోలీసులు గౌరవ సూచకంగా గాల్లోకి కాల్పులు జరిపారు. అంతకు ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ భూదేవినగర్‌లోని గద్దర్ నివాసానికి వచ్చి ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. గద్దర్ భార్య విమలను, కుటుంబసభ్యులను పరామర్శించారు. మంత్రులు మహమూద్ అలీ, హరీశ్‌రావు, తలసాని తదితరులు సీఎం వెంట ఉన్నారు. పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు కూడా అల్వాల్‌లో గద్దర్ భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ, తెలంగాణ మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు దానం నాగేందర్, టి.రాజయ్య, జీవన్‌రెడ్డి, మంచు మోహన్‌బాబు, మనోజ్, అలీ, నాగబాబు, నిహారిక, పరుచూరి గోపాలకృష్ణ, ఆర్.నారాయణమూర్తి, ప్రొఫెసర్ కోదండరాం, జయప్రకాశ్ నారాయణ, తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు, జూలకంటి రంగారెడ్డి, అనగాని సత్యప్రసాద్, జనార్ధన్, పరిటాల శ్రీరామ్, వివేక్, మోత్కుపల్లి నరసింహులు తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. భూదేవినగర్, వెంకటాపురం ప్రజలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిమంది తరలివచ్చి కన్నీటి నివాళులర్పించారు.

అంత్యక్రియలకు ప్రముఖులు

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎమ్మెల్యే సీతక్క, మధుయాష్కీ గౌడ్, వి.హనుమంతరావు, మల్లు రవి ,శ్రీధర్‌బాబు, మాభూమి చిత్ర దర్శకులు నర్సింగ్ రావు, ప్రముఖ సినీనటుడు ఆర్.నారాయణమూర్తి, తెలంగాణ ఉద్యమ నేత గాదె ఇన్నయ్య, జనశక్తి నేతలు కూర రాజన్న, అమర్, విమలక్క, బీఆర్ఎస్ నేతలు మైనంపల్లి హనుమంతరావు, రసమయి బాలకిషన్, గోరటి వెంకన్న, బాల్క సుమన్, క్రాంతి, గెల్లు శ్రీనివాస్, పల్లె రవి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, జర్నలిస్టు పాశం యాదగిరి, వేదకుమార్, తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు.

దారంతా జన ప్రభంజనం

తెలుగు ప్రజల సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన గద్దర్ అంతిమయాత్ర మహాజన ప్రభంజనాన్ని తలపించింది. ఎల్బీ స్టేడియం నుంచి అల్వాల్ వరకు రహదారులు జనసందోహంతో పోటెత్తాయి. పోలీసుల గౌరవ వందనంతో అంతిమ యాత్ర ప్రారంభమైంది. అనారోగ్యంతో ఆదివారం కన్నుమూసిన గద్దర్ భౌతికకాయాన్ని ప్రజలు, అభిమానుల సందర్శనార్థం ఎల్బీ స్టేడియంలో ఉంచిన సంగతి తెలిసిందే. కాగా మధ్యాహ్నం 12 గంటలకు ఎల్బీ స్టేడియం నుంచి ప్రారంభమైన అంతిమ యాత్ర గన్‌పార్క్, ట్యాంక్‌బండ్ (అంబేద్కర్ విగ్రహం), సికింద్రాబాద్ మీదుగా సాయంత్రం 4 గంటలకు అల్వాల్‌కు చేరుకుంది. వాహనానికి జై భీం జెండాలతో పాటు బుద్ధుడి పంచశీల జెండాలను ఏర్పాటు చేశారు. గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద కళాకారులు పాటలతో శ్రద్ధాంజలి ఘటించారు. గద్దర్ పార్థివదేహాన్ని ఉంచిన వాహనానికి ముందు, వెనుక వేలాదిగా కదిలివచ్చిన అభిమానులు 'అమర్ రహే గద్దర్', 'జోహార్ గద్దరన్న' అంటూ ఇచ్చిన నినాదాలతో పరిసరాలు ప్రతిధ్వనించాయి.

ఎల్బీ స్టేడియంలో ఘన నివాళులు

ఎల్బీ స్టేడియంలో పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో గద్దర్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, మాజీ మంత్రి జానారెడ్డి, టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

ప్రత్యేక వేదికలు.. కటౌట్‌లు

గద్దర్‌ను చివరిసారి చూసేందుకు రోడ్డుకు ఇరువైపులా ప్రజలు బారులు తీరారు. ఎక్కడికక్కడ వాహనాన్ని నిలిపివేసి ఆయన భౌతికకాయానికి నమస్కరిస్తూ నివాళులర్పించారు. సికింద్రాబాద్, జేబీఎస్, కార్ఖానా, తిరుమలగిరి, తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి తలసాని పాల్గొన్నారు. దారి పొడవునా అక్కడక్కడా పెద్ద ఎత్తున గద్దర్ కటౌట్‌లను ఏర్పాటు చేశారు. ప్రజా నాట్యమండలి, జన నాట్యమండలి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యకు చెందిన కళాకారుల ఆట, పాటల నడుమ గద్దర్ అంతిమయాత్ర సాగింది.

అంతిమయాత్రలో విషాదం

సియాసత్ మేనేజింగ్ ఎడిటర్ కన్నుమూత



గద్దర్ అంతిమయాత్రలో జహీరుద్దీన్

గద్దర్ అంతిమయాత్ర సందర్భంగా విషాదం చోటుచేసుకుంది. వివిధ రంగాల ప్రముఖులతో పాటు అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలి రావడంతో అల్వాల్‌లో తొక్కిసలాట జరిగింది. తొక్కిసలాటలో చిక్కుకున్న సియాసత్ ఉర్దూ దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ (63) తీవ్రమైన నీరసంతో జనంమధ్యలో పడిపోయారు. స్థానికులు వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కార్డియాక్ అరెస్టుతో చనిపోయినట్లు చెప్పారు. గద్దర్‌కు సన్నిహితుడైన జహీరుద్దీన్ ఆదివారం నుంచి ఆయన భౌతికకాయం వద్దే ఉన్నారు.

సీఎం కేసీఆర్ సంతాపం

సియాసత్ ఉర్దూ దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ మృతి పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఆయన మరణం ఉర్దూ పత్రిక ప్రపంచానికి తీరనిలోటన్నారు. పత్రికా సంపాదకుడుగా తెలంగాణ ఉద్యమంలో అలీఖాన్ పోషించిన పాత్ర, ఆయన సేవలను సీఎం ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

- జహీరుద్దీన్ అలీఖాన్ మృతి పట్ల బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సంతాపం ప్రకటించారు. ఆయన ఉర్దూ పత్రికా రంగానికి ఎనలేని సేవలు చేశారన్నారు. జహీరుద్దీన్ కుటుంబసభ్యులకు కేటీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.
- జహీరుద్దీన్ మృతి పట్ల కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, షబ్బీర్ అలీ, పొన్నాల లక్ష్మయ్య సంతాపం తెలిపారు.
- జహీరుద్దీన్ అలీఖాన్ ఆకస్మిక మరణం పట్ల, మీడియా అకాడమీ చైర్మన్, అల్లం నారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాతబస్తీ రాజకీయాల్లో ప్రముఖపాత్ర వహించి చెరగని ముద్ర వేశారని, దేశంలోని ఉర్దూ జర్నలిజానికి ఆయన మరణం తీరని లోటు అన్నారు.
- వ్యక్తిగతంగా జహీరుద్దీన్ అలీఖాన్‌తో తమ కుటుంబానికి మంచి సంబంధాలు ఉండేవని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ గుర్తు చేసుకున్నారు. అతని కుటుంబసభ్యులకు మనోధైర్యాన్ని కల్పించాలని భగవంతుడిని కోరారు.
- జహీరుద్దీన్ మృతిపై ఇంకా ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర ఇన్‌చార్జి సీహెచ్.ప్రమీల, ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్‌రాజ్, ఏఐడీవైఓ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి వై.నాగరాజు సంతాపం తెలిపారు.

కలం.. గళం

24 గంటల్లోనే లోకాన్ని విడిచిన ఆప్తమిత్రులు ప్రజాయుద్ధనౌక గద్దర్, 'సియాసత్' జహీరుద్దీన్

సాక్షి, హైదరాబాద్: అవును వారిద్దరూ ఆప్తమిత్రులు... ఎన్నో ఆలోచనలు..మరెన్నో చర్చలు..ఇద్దరూ సమాజ శ్రేయస్సుకు కృషి చేసిన వారే.. 24 గంటల వ్యవధిలోనే ఈ లోకాన్ని విడిచివెళ్లారు. వారిలో ఒకరు తన ఆటాపాటతో విప్లవ, తెలంగాణ ఉద్యమాలకు ఊపిరిలూదితే.. మరొకరు పత్రిక ద్వారా మైనారిటీ, బడుగు బలహీనవర్గాల పక్షాన నిలిచారు. వారే ప్రజాయుద్ధనౌక గద్దర్ అలియాస్ గుమ్మడి విఠల్‌రావు.. మరొకరు సియాసత్ ఉర్దూ దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్. వారిద్దరూ సియాసత్ కార్యాలయంలో గంటల తరబడి చర్చల్లో మునిగితేలేవారు. గద్దర్ వారానికో సారైనా సియాసత్ కార్యాలయానికి వెళ్లడం అక్కడ సామాజిక, రాజకీయ అంశాలే కాకుండా ప్రజానీకం సమస్యలపై తరచు చర్చలు సాగించేవారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ వీరిద్దరూ కీలకభూమిక పోషించారు. సియాసత్ తరఫున నిర్వహించే సామాజిక కార్యక్రమాలకు సంబంధించి జహీరుద్దీన్‌అలీఖాన్ గద్దర్‌తో చర్చించేవారు. గద్దర్ మరణించిన వార్త తెలిసి జహీరుద్దీన్ చలించిపోయారు. ఎల్బీ స్టేడియం నుంచి గద్దర్ అంత్యక్రియలు జరిగే అల్వాల్‌లోని వెంకటాపూర్ వరకు పార్థివదేహం వెళ్లిన వాహనంలోనే ఆయన వెళ్లారు. అక్కడ దిగిన తర్వాత గద్దర్ భౌతికకాయాన్ని తీసుకెళుతున్న సమయంలో ఒక్కసారిగా జనం తోపులాట ఎక్కువ కావడం, ఆ మధ్యలోనే జహీరుద్దీన్ పడిపోవడం, తీవ్ర గుండెపోటు రావడంతో ఆయన అక్కడే కుప్పకూలిపోయారు. దగ్గర్లోని ఆస్పత్రికి ఆయన్ను తరలించినా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

అందరివాడు గద్దర్

అన్ని రంగాలు, వర్గాలతో సన్నిహితంగా మెలిగిన ప్రజాగాయకుడు

సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘ ఉద్యమ ప్రస్థానం..పీడిత వర్గాల తరఫున ప్రభుత్వాలను ప్రశ్నించిన గొంతు అది..పోలీసులు ఎక్కుపెట్టిన తుపాకులను సైతం లెక్క చేయక నిలబడి కొట్లాడిన గళం అది..అయినాసరే గద్దర్ అజాత శత్రువుగానే బతికారు. ఉద్యమం అంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిపే పోరాటం కాదని, ప్రజల హక్కులను కాపాడుకోవడం అని ఎన్నోసార్లు తన విధానాన్ని సుస్పష్టం చేశారు. తన వ్యవహార శైలితో సమాజంలోని అన్ని వర్గాలకు దగ్గరయ్యారు. రాజకీయ పార్టీలకతీతంగా ప్రముఖ నాయకులందరితోనూ సాన్నిహిత్యాన్ని సంపాదించారు. కళాకారుడిగా, రచయితగా సినీరంగంతోనూ ఆయన అనుబంధం కొనసాగింది. గద్దర్ మరణ వార్తతో అన్ని రంగాల ప్రముఖులు, సామాన్యుల నుంచి అన్ని వర్గాల వారు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఇక సోమవారం జరిగిన గద్దర్ అంతిమయాత్ర ఆసాంతం ఆయన వ్యక్తిత్వానికి అద్దం పట్టింది. 1972 నుంచి 2012 వరకు నాలుగు దశాబ్దాల విప్లవ ప్రస్థానంలో పీడిత ప్రజల పక్షాన నిలబడ్డ గద్దర్ తన పాటలతో ఎన్నో ఉద్యమాలకు ఊపిరి లూదారు. ఎప్పుడూ ప్రజల పక్షాన పోరాట గొంతుకగా నిలిచారు. నిక్కచ్చిగా మాట్లాడే తత్వమే గద్దర్‌కు ఎంతో మందిని దగ్గర చేసింది. మావోయిస్టు ఉద్యమాలకు దశాబ్దాలుగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయన అందించిన తోడ్పాటును గుర్తు చేస్తూ మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ ఓ లేఖ విడుదల చేసింది. గద్దర్ మృతి తమను తీవ్రంగా బాధించిందని పేర్కొంది. మరోవైపు ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ఎన్నో సందర్భాల్లో ప్రశ్నించిన ప్రజాయుద్ధ నౌక అంత్యక్రియలు రాష్ట్ర ప్రభుత్వమే అధికార లాంఛనాలతో నిర్వహించింది. ఉద్యమ సమయంలో, అనేక ఎన్‌కౌంటర్ల సమయంలో పోలీసులతో ఎన్నో అంశాలపై కొట్లాడిన గద్దర్‌కు నివాళులర్పించేందుకు ఒకప్పటి ఎస్‌ఐబీ చీఫ్ సజ్జనార్ సైతం వచ్చారు. గద్దర్‌తో తన అనుబంధాన్ని ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. సినీ ప్రముఖులు సైతం సంతాపం తెలిపారు. ఆయన అభిమానులు, తోటి రచయితలు, అంతిమయాత్రలో పాదం కలిపారు. మావోయిస్టు ఉద్యమంతో దశాబ్దాలు గడిపిన గద్దర్‌కు చివరి గడియల్లో పోలీసు తుపాకులు గౌరవ వందనం సమర్పించడం.. ఆయన అందరివాడన్న దానికి మరో నిదర్శనంగా నిలిచింది.








ఎల్బీ స్టేడియంలో గద్దర్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి తలసాని, స్పీకర్ పోచారం, ఏపీ మంత్రి బొత్స, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్


గద్దర్ అంత్యక్రియలకు హాజరైన ఆర్. నారాయణమూర్తి, గోరటి వెంకన్న, మధుయాష్కీ, కూర రాజన్న, రేవంత్‌రెడ్డి, వీహెచ్, మందకృష్ణ, భట్టి, సంపత్

ఇదండీ సంగతి


వెల్‌కం.. ఎన్నయినా ఆరోపణలు చేసుకోండి!

బాబు హయాంలో గద్దర్ హత్యకు కుట్ర

గద్దర్ మృతికి సంతాప ప్రకటనలో మావోయిస్టు పార్టీ వెల్లడి

- టీడీపీ అధికారంలో ఉండగా నల్లదండు ముఠాలతో పలువురు విప్లవకారులను క్రూరంగా హత్య చేయించారని ఆరోపణ
- 1997లో గద్దర్‌పైనా నల్లదండు ముఠా, పోలీసులు కలిసి కాల్పులు జరిపారు
- గతంలో గద్దర్ సైతం పలు వేదికలపై, ఇంటర్వ్యూల్లో బాబు ప్రభుత్వ కుట్రలు వెల్లడించిన వైనం

సాక్షి, హైదరాబాద్: ప్రజా యుద్ధ నౌక గద్దర్‌పై గతంలో ఐదు రౌండ్ల కాల్పులు జరిగిన ఘటన వెనుక అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హస్తం ఉందన్న విషయం మరోమారు చర్చనీయాంశంగా మారింది. నాటి టీడీపీ ప్రభుత్వం ఎంతోమంది విప్లవకారులను క్రూరంగా హత్య చేయించిందన్న ఆరోపణలు ఉన్నాయి. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ బాహాటంగా ఈ విషయాలు పేర్కొనడం ఆ వాదనలకు మరింత బలం చేకూర్చినట్లయింది. ప్రజాగాయకుడు గద్దర్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా గద్దర్ మృతికి సంతాపంగా మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ సోమవారం ఓ లేఖను విడుదల చేశారు. అందులో గద్దర్‌తో మావోయిస్టు పార్టీ ఉద్యమానికి ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూనే..ఆయనపై కాల్పులు జరపడం ద్వారా చేసిన హత్యాయత్నం గురించి స్పష్టంగా పేర్కొన్నారు. 'చంద్రబాబు నేతృత్వంలో దోపిడీ పాలకవర్గ తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉండగా విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి విప్లవ ప్రతిఘాతుక శక్తులతో నల్లదండు ముఠాలను పోలీసుల ద్వారా ఏర్పాటు చేశారు. ప్రజా సంఘాల్లో క్రియా శీలకంగా పనిచేస్తున్న అనేకమంది విప్లవ కారులను నల్లదండు ముఠాలతో క్రూరంగా హత్యలు చేయించారు. అందులో భాగంగా 1997లో గద్దర్‌పై కూడా నల్లదండు ముఠా, పోలీసులు కలిసి కాల్పులు జరిపారు. ఐదు తూటాలు శరీరంలోకి దూసుకెళ్లినా గద్దర్ ప్రాణాలతో బయటపడ్డారు..' అని వివరించారు. తనపై జరిగిన కాల్పులకు సంబంధించి విచారణ పూర్తి చేసి దోషులను గుర్తించాలంటూ గద్దర్ ఎన్నో ఏళ్లపాటు ప్రభుత్వాలకు వినతిపత్రాలు ఇస్తూ వచ్చారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఓసారి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చి పాత సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ కూడా.. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలోనే తనపై హత్యకు కుట్ర జరిగిందని గద్దర్ చెప్పారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఒక స్పెషల్ టీంను పెట్టి దోషులను అతి త్వరలో పట్టుకుంటామని ప్రకటించినా అది జరగలేదని తెలిపారు. అంతకు ముందు సైతం గద్దర్ పలు వేదికలపై, మీడియా ఇంటర్వ్యూల్లో తనపై కాల్పుల వెనుక చంద్రబాబునాయుడు ప్రభుత్వ కుట్ర ఉందని పేర్కొన్నారు.

గద్దర్ మృతి తీవ్ర బాధాకరం

మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ లేఖ విడుదల

సాక్షి, హైదరాబాద్/చర్ల: ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతి తమను తీవ్రంగా బాధించిందని మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఈ మేరకు మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ సోమవారం ఓ లేఖ విడుదల చేశారు. గద్దర్ అంటే దేశంలో, రాష్ట్రంలో తెలియని వారుండరని, గద్దర్ కుటుంబ సభ్యులకు తమపార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాల నేపథ్యంలో పాటలు, నాటికలు, బుర్రకథలు, ఒగ్గుకథల ద్వారా పీడిత ప్రజలను చైతన్య పర్చేందుకు 1972లో జన నాట్యమండలి ఏర్పాటులోనూ గద్దర్ కృషి ఎంతో ఉందన్నారు. 1972–2012 వరకువిప్లవ ప్రస్థానంలో పీడిత ప్రజల పక్షాన గద్దర్ నిలబడ్డారని వెల్లడించారు. బూటకపు ఎన్‌కౌంటర్లలో మరణించిన విప్లవ కారుల శవాలను వారి కుటుంబాలకు చేర్చేందుకు శవాల స్వాధీన ఉద్యమానికి గద్దర్ నాయకత్వం వహించారని గుర్తుచేశారు. 1980లో నాలుగేళ్ల దళం జీవితం కొనసాగించిన గద్దర్‌ను సాంస్కృతిక రంగం అవసరాన్ని పార్టీ గుర్తించి బయటకు పంపి జన నాట్యమండలిని అభివృద్ధి చేసినట్లు జగన్ తెలిపారు.

క్లుప్తంగా...

రెండు వారాల్లో 1,266 మందికి కారుణ్య నియామకాలు

కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కారుణ్య నియామకాల ప్రక్రియపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ మేరకు 1,266 మందికి రెండు వారాల్లో నియామకాలు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సీఎస్ జిల్లా కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం జీవో 79 విడుదల చేసినందని గుర్తుచేశారు. నెలన్నరలోగా హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలని, ప్రతీ మొక్కకు జియో టాగింగ్ చేయాలని, 85 శాతం మొక్కలు మనుగడ సాధించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దశాబ్ది సంపదవనాల ఏర్పాటులో లక్ష్యాలను పూర్తి చేయాలని, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి బోర్డులు పెట్టాలన్నారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాల సందర్భంగా కోటి మొక్కలను ఒకేరోజు నాటాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని, ఇందుకు అవసరమైన స్థలాల ఎంపిక, కందకం తవ్వకం పూర్తి చేసి ఉంచాలని ఆదేశించారు. ఈ కోటి మొక్కలు నాటే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. నోటరీ స్థలాల క్రమబద్ధీకరణకు జీవో 84 విడుదల చేశామని, 125 చదరపు అడుగుల లోపు స్థలాలను ఉచితంగాను, ఆపై విస్తీర్ణంలోని స్థలాలను స్టాంపు డ్యూటీ మొత్తంతోపాటు, చదరపు అడుగుకు రూ.5 అదనంగా చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. ఈ పథకాన్ని విస్తృత స్థాయిలో వినియోగించుకునేలా ప్రజలను చైతన్యపర్చాలని కోరారు. జీవో 59 కింద ఇప్పటికీ నోటీసులు అందుకున్నవారి నుంచి రెగ్యులరైజేషన్‌కు నిర్ణయించిన మొత్తాన్ని జమ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

స్టాఫ్‌నర్సు అభ్యర్థుల నుంచి 9 వరకు అభ్యంతరాల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: స్టాఫ్ నర్సు పోస్టుల కోసం ఈ నెల 2న నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)కు హాజరైన అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలుంటే ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్‌బీ) తెలిపింది. తమ అభ్యంతరాలను https:// mhsrb.telangana.gov.in లో ఈ నెల 9 సాయంత్రం 5 గంటల్లోపు సమర్పించాలని, దరఖాస్తుదారులు తమ లాగిన్ ద్వారా మాత్రమే దాఖలుచేయాలని, లేకపోతే వచ్చిన అభ్యంతరాలను స్వీకరించబోమని బోర్డు స్పష్టం చేసింది.


దళితబంధులో రాజకీయ ఒత్తిడితో అర్హులకు అన్యాయం: తమ్మినేని



సాక్షి, హైదరాబాద్: దళితబంధు పథకంలో ఎమ్మెల్యేల ఒత్తిడి, రాజకీయ కారణాలతో అనర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేస్తే నిజమైన అర్హులు అన్యాయానికి గురవుతారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. పైరవీలు, కమీషన్లకు చోటివ్వడం వల్ల అసలైన లబ్ధిదారుల ఎంపిక జరగడంలేదని సోమవారం ఆయన ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పైరవీకారులు ఒక్కో లబ్ధిదారుడి నుంచి రు.3 లక్షల వరకు కమీషన్లు తీసుకుని అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ పథకంలో అవినీతికి తావులేకుండా, లబ్ధిదారుల ఎంపిక కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి, రాజకీయాలకు అతీతంగా గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.

ధరణితో ప్రభుత్వమే దళారీగా మారింది

ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్ చైర్మన్ కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణిని ఎత్తేసి దళారుల రాజ్యం తెచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి ఖండించారు. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత ప్రభుత్వమే దళారీగా మారిపోయిందని ఆయన విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడారు. ధరణి పోర్టల్‌తో ధనార్జన ఉందన్న కారణంగానే రైతులకు భూములపై హక్కులు కల్పించేందుకు సర్వేలు చేయడం లేదని ఆరోపించారు. టైటిల్ గ్యారంటీ చట్టం చేయాలని కేంద్రం చెబుతున్నా రాష్ట్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పేదలకు ప్రభుత్వాలు పంపిణీ చేసిన భూములను గుంజుకుని కేసీఆర్ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతోందని, ఎకరం గుంజుకుని 300 గజాలు ఇచ్చి, ఎకరానికి రూ.100 కోట్లకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల సంభవించిన వరదల కారణంగా నష్టపోయిన రైతాంగానికి పరిహారంపై అసెంబ్లీ సమావేశాల్లోనూ ఎలాంటి హామీ ఇవ్వకపోవడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రైవేటులో ఎంబీబీఎస్ ఫీజుల ఖరారు

- కొన్ని కాలేజీల్లో రూ. 50 వేల దాకా పెంపు... కొన్నింటిలో తగ్గింపు లేదా యథాతథం
- బీ–కేటగిరీ సీట్ల ఫీజులకు రెట్టింపుతో సీ–కేటగిరీ ఫీజుల వసూలుకు అనుమతి
- మూడేళ్ల కాలానికి ఇవే ఫీజులు వర్తించేలా సర్కారు ఉత్తర్వులు
- తదుపరి సంవత్సర ఫీజుకు బ్యాంకు గ్యారంటీ నిబంధనపై విమర్శలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్ల ఫీజులను సవరించారు. కొన్ని కాలేజీల్లో పెరగ్గా కొన్ని కాలేజీల్లో తగ్గాయి. మరికొన్ని కాలేజీల్లో యథాతథంగా ఉన్నాయి. ఫీజుల సవరణకు సంబంధించి తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్‌సీ) ఇచ్చిన సిఫార్సులను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ అనుమతించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. 2023–26 మధ్య చేరిన విద్యార్థులకు కోర్సు పూర్తయ్యే వరకు ఇదే రుసుము కొనసాగుతుందని ఆయన తెలిపారు. బీ–కేటగిరీ ఎంబీబీఎస్ ఫీజులు కొన్ని కాలేజీల్లో రూ. 50 వేలు పెరగ్గా కొన్ని కాలేజీల్లో తగ్గాయని వివరించారు. ఉదాహరణకు అపోలో మెడికల్ కాలేజీలో బీ–కేటగిరీ ఎంబీబీఎస్‌కు గతంలో రూ. 12.50 లక్షలున్న ఫీజును ఈ ఏడాది నుంచి రూ. 13 లక్షలకు పెంచారు. అయాన్ మెడికల్ కాలేజీలో గతంలో రూ. 14 లక్షలున్న బీ–కేటగిరీ ఫీజును ఇప్పుడు రూ. 12 లక్షలకు తగ్గించారు. సీ–కేటగిరీ ఫీజులను బీ–కేటగిరీ ఫీజుకు రెట్టింపు చేశారు. అంటే బీ–కేటగిరీ ఫీజు రూ. 12 లక్షలున్న కాలేజీలో సీ–కేటగిరీ ఫీజు రూ. 24 లక్షల వరకు వసూలు చేసుకోవచ్చు. మొత్తంగా సరాసరి 5 శాతం ఫీజులు పెరిగినట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించింది. స్వల్పంగానే ఫీజులు పెరిగాయని.. కొన్నిచోట్ల తగ్గాయని అధికారులు చెబుతున్నారు.

ఒక్కో మెడికల్ కాలేజీలో ఒక్కో ఫీజు...

రాష్ట్రంలో 2023–24 విద్యా సంవత్సరంలో 56 ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో మొత్తం 8,490 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. 27 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 3,790 సీట్లున్నాయి. అలాగే 29 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 4,700 సీట్లున్నాయి. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 35 శాతం సీట్లు బీ–కేటగిరీ, 15 శాతం సీ–కేటగిరీ సీట్లుంటాయి. వాటిని మేనేజ్‌మెంట్ కేటగిరీ సీట్లుగా పరిగణిస్తారు. మిగిలిన 50 శాతం సీట్లు ఏ–కేటగిరీ (కన్వీనర్) కిందకు వస్తాయి. కాలేజీలవారీగా నిర్వహణ ఖర్చులు మొదలు, బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు, నిర్వహణ వ్యయం తదితర వివరాలతో కూడిన ఆడిట్ రిపోర్టులను పరిశీలించిన టీఏఎఫ్ఆర్‌సీ... వాటి ఆధారంగానే ఫీజుల సవరణకు సిఫార్సు చేసింది. అయితే ప్రైవేటు కాలేజీల్లో ప్రస్తుతం ఎంబీబీఎస్ సీట్ల ఏ–కేటగిరీ ఫీజు రూ. 60 వేలు ఉండగా అందులో ఎలాంటి మార్పు చేయలేదు.

అదనపు వసూళ్లు చేయరాదు...

కాలేజీలు నిర్వహణ ఖర్చుల నిమిత్తం విద్యార్థుల నుంచి ఎటువంటి క్యాపిటేషన్ రుసుము వసూలు చేయరాదని కాళోజీ వర్గాలు స్పష్టం చేశాయి. కమిటీ నిర్ణయించిన రుసుము మినహా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి ఇతర మొత్తాన్ని యాజమాన్యం అనధికారికంగా లేదా చట్టవిరుద్ధంగా వసూలు చేయకూడదని పేర్కొన్నాయి. ఒకవేళ విరాళం ముసుగులో వసూలు చేసినట్లయితే దాన్ని క్యాపిటేషన్ రుసుముగా పరిగణించనున్నాయి. అయితే తదుపరి సంవత్సరానికి సంబంధించిన ట్యూషన్ ఫీజు కోసం కాలేజీలు బ్యాంక్ గ్యారెంటీని విద్యార్థుల నుంచి తీసుకోవచ్చని స్పష్టం చేశాయి. దీనిపై గతం నుంచే విద్యార్థులు నిరసన తెలుపుతుండగా ఈ నిబంధనను ఇంకా కొనసాగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు పీజీ మెడికల్, డెంటల్ కోర్సుల ఫీజులను పెంచలేదని కాళోజీ వర్గాలు తెలిపాయి.

కొన్ని ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఫీజుల సవరణ ఇలా (రూ. లక్షల్లో)

కాలేజీ	పాత ఫీజు	కొత్త ఫీజు
అపోలో మెడికల్ కాలేజీ	12.50	13.00
రెండు కామినేని మెడికల్ కాలేజీలు	12.50	13.00
అయాన్ మెడికల్ కాలేజీ	14.00	12.00
డెక్కన్ మెడికల్ కాలేజీ	14.00	12.50
డాక్టర్ వీఆర్‌కే ఉమెన్స్ మెడికల్ కాలేజీ	14.00	12.00
మల్లారెడ్డి ఉమెన్స్ మెడికల్ కాలేజీ	12.50	12.00

ఎవరిదీ పాపం!

గుంత ఉందని పక్కకు వెళితే.. విద్యుత్ తీగ యమపాశమైంది



- దుండిగల్ పరిధిలో వ్యక్తి దుర్మరణం
- విశ్వనగరంలో ఆగని విషాద ఘంటికలు
- దారుణ ఉదంతాలకు ముగింపు ఎన్నడు?
- పాలకులను ప్రశ్నిస్తున్న నగర వాసులు



ఘటన స్థలంలో మృతుడు సత్యనారాయణరెడ్డి

దుండిగల్: బాలికను బలి తీసుకున్న నాలా.. కుక్కల దాడిలో మృత్యు పాలైన చిన్నారి.. రోడ్డుపై గుంత కారణంగా బైక్‌పై నుంచి కిందపడటంతో వెనక వచ్చిన వాహన చక్రాల కింద పడి కన్నుమూసిన 3వ తరగతి బాలిక.. ఇలా నగరంలో నిత్యం ఏదో ఒకచోట ఇలాంటి దారుణ ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. సోమవారం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో అమానుష ఘటన జరిగింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి గుంత ఉందని.. దాని పక్కనుంచి వెళ్తుండగా విద్యుత్ తీగ కాటేసింది. అమాయకుడి ప్రాణాలను బలిగొంది. హైదరాబాద్ విశ్వనగరం దిశగా అడుగులేస్తోందంటూ నిత్యం ఊదరగొట్టే ప్రసంగాలు చేసే మన ప్రజాప్రతినిధులు.. అధికారులు ఈ దారుణ మారణాలకు ఏం సమాధానం చెబుతారని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా అనంతగిరి ఇల్లంతకుంట గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి (57) కుటుంబం నగరానికి వలస వచ్చి మల్లంపేటలోని డ్రీమ్ వ్యాలీ కాలనీలో నివాసముంటోంది. సత్యనారాయణరెడ్డికి భార్య సులోచన, ఉదయ్, చందు ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్యనారాయణరెడ్డి స్థానికంగా ఉన్న కేవీఆర్ వ్యాలీలో వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్నారు. చిన్న కుమారుడు చందు దక్షిణాఫ్రికాలో ఉంటుండగా పెద్ద కుమారుడు తండ్రితో కలిసి వాటర్ ప్లాంట్ నిర్వహణ చూసుకుంటున్నారు. సత్యనారాయణరెడ్డి సోమవారం బైక్‌పై ఇంటి నుంచి వాటర్ ప్లాంట్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో రోడ్డుపై వర్షపు నీరు చేరి గుంతగా మారడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. అదే గుంత పక్కన ఉన్న చెట్టు, విద్యుత్ స్తంభం మధ్యలో నుంచి వెళ్తున్న క్రమంలో కరెంట్ వైరు తెగి అతనిపై పడటంతో విద్యుదాఘాతానికి గురై బైక్‌పై నుంచి గుంతలో పడి అక్కడికక్కడే మృతి చెందారు. అప్పటికే ఆ గుంతలోనే ఉన్న ఓ పందికి సైతం విద్యుత్ వైరు తగలడంతో అది కూడా మృతి చెందింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే సత్యనారాయణరెడ్డి మృతి చెందారని స్థానికులు ఆరోపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు దుండిగల్ పోలీసులు తెలిపారు.

రేపు మిగిలిన అగ్రి డిప్లొమా సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వివిధ డిప్లొమా కోర్సుల్లో సీట్ల భర్తీకి మూడు విడతల కౌన్సెలింగ్ నిర్వహించింది. ఇంకా మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 9న యూనివర్సిటీ ఆడిటోరియంలో వాక్ ఇన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అక్టోబర్ రెండో వారంలో గ్రూప్-3 పరీక్షలు!

- తేదీలను పరిశీలిస్తున్న టీఎస్‌పీఎస్సీ
- కేంద్ర, రాష్ట్ర స్థాయి ఇతర నియామక పరీక్షలకు ఆటంకం కలగకుండా చర్యలు
- అతి త్వరలో పరీక్షల తేదీలను ప్రకటించే అవకాశం



సాక్షి, హైదరాబాద్: గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కసరత్తు ముమ్మరం చేసింది. గతేడాది డిసెంబర్‌లో గ్రూప్-3 కేటగిరీలో 1,363 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన టీఎస్‌పీఎస్సీ, ఫిబ్రవరి 23వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించింది. రాష్ట్రవ్యాప్తంగా 5,36,477 మంది అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో ఉద్యోగానికి సగటున 390 మంది పోటీ పడుతున్నారు. తాజాగా ఈ పరీక్షల నిర్వహణపై దృష్టిపెట్టిన కమిషన్.. అక్టోబర్ రెండో వారంలో నిర్వహించాలని భావిస్తోంది. గ్రూప్-1 ప్రిలిమ్స్, గ్రూప్-4 పరీక్షలను పూర్తి చేసిన టీఎస్‌పీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలకు సంబంధించి ఇదివరకే తేదీని ప్రకటించింది. గ్రూప్-3 ఉద్యోగాలకు మూడు దశల్లో అర్హత పరీక్షలుంటాయి. పేపర్-1 జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్, పేపర్-2 హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ, పేపర్-3 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ ఇందులో భాగంగా ఉంటాయి. ఒక్కో పరీక్షను రెండున్నర గంటల పాటు నిర్వహిస్తారు. అలాగే ఒక్కో పరీక్షకు గరిష్టంగా 150 మార్కులుంటాయి. కాగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఇతర ఉద్యోగ పరీక్షలకు ఆటంకం లేకుండా గ్రూప్-3 తేదీలను నిర్ణయించే అంశాన్ని కమిషన్ పరిశీలిస్తోంది. ఈ కసరత్తు తర్వాత అతి త్వరలో పరీక్షల తేదీలను వెల్లడించే అవకాశం ఉందని తెలుస్తోంది.

సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం: కవిత



నిజామాబాద్(నాగారం): ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తున్నామని, కాంగ్రెస్ కుమ్ములాట వైఫల్యాలే తమ విజయసోపానాలని, మూడోసారి కేసీఆర్ సీఎం అవుతారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ఐటీ హబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. రైతుల ప్రయోజనాన్ని కూడా కాంగ్రెస్‌పార్టీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. రూ.19 వేల కోట్లతో 35 లక్షలమంది రైతులకు రుణమాఫీ చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం ఆర్టీసీ విలీనం చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ ఆరోపణలు అర్థం లేనివని, ఆస్తులు అమ్ముకునే సంస్కృతి కాంగ్రెస్‌దే అని విమర్శించారు. రాష్ట్ర సచివాలయ భవన నిర్మాణం ఆపడానికి కూడా విపక్షాల నేతలు ఇలాంటి వ్యాఖ్యలే చేశారని, గుప్తనిధుల కోసం నిర్మిస్తున్నారని పిచ్చి పిచ్చి ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. ఐటీ హబ్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయన్నారు. సమావేశంలో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, బీఆర్ఎస్ఎన్ఆర్ఐ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల, జడ్పీ చైర్మన్ విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలోనే 'పీఎంఏవై' వేగిరం

2.50 లక్షలు	2.24 లక్షలు
మంజూరైన ఇళ్లు	పూర్తయినవి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోనే ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో దేశంలో 2015 జూన్ 25న ఈ పథకం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా 1.19 కోట్ల ఇళ్లు మంజూరు కాగా, రాష్ట్రానికి 2.50 లక్షల ఇళ్లు కేటాయించారు. గత నెలాఖరున కేంద్రం వెల్లడించిన లెక్కల ప్రకారం..1.13 కోట్ల ఇళ్లగాను, 76.02 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. వీటి నిర్మాణానికి రూ.8.19లక్షల కోట్ల ఖర్చు అవుతుండగా, అందులో కేంద్రప్రభుత్వ సాయం రూ.2 లక్షల కోట్లు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో నిర్మిస్తున్న ఇళ్ల కోసం కేంద్ర ప్రభుత్వం తనవంతు సాయంగా రూ.1.48 లక్షల కోట్లు విడుదల చేసింది.

రాష్ట్రంలో 89శాతం ఇళ్లు పూర్తి: ఈ ఎనిమిదేళ్లలో రాష్ట్రంలో 2.44 లక్షల ఇళ్లు నిర్మించినట్టు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వివిధ జిల్లాల్లో ఇప్పటివరకు 2.44 లక్షల ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందులో 2.24 లక్షల ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అంటే రికార్డుస్థాయిలో 89.6 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తయిన రాష్ట్రం తెలంగాణే కావడం గమనార్హం. రాష్ట్రంలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణానికి రూ. 30,706.31 కోట్లు ఖర్చు అవుతుండగా, కేంద్ర ప్రభుత్వసాయం రూ.4,475.66 కోట్లు కాగా, అందులో రూ.3314.27 కోట్లు విడుదల చేసినట్టు కేంద్ర సమాచారశాఖ తెలిపింది. మోనోలిథక్ కాంక్రీట్ నిర్మాణం, సెల్యూలర్ లైట్ వెయిట్ కాంక్రీట్ బ్లాక్స్‌తో 27,858 ఇళ్లను వినూత్న తరహాలో నిర్మించారు.

యువ ఇంజనీర్లకు ఉపాధి ఎక్కడ?

▶ మొదటి పేజీ తరువాయి

ఇంజనీరింగ్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. మరి ముఖ్యంగా కంప్యూటర్ సంబంధిత కోర్సులపై క్రేజ్ విపరీతంగా పెరిగిపోయింది. మొత్తం మీద దేశవ్యాప్తంగా ఏటా సగటున 14 లక్షల మంది ఇంజనీరింగ్‌లో చేరుతున్నారు. కానీ ఏటా సగటున కేవలం 6 లక్షల మందికి మాత్రమే ఉపాధి లభిస్తుండటం గమనార్హం. ఇందులోనూ కేవలం 8 శాతం మందికి మాత్రమే వారు చదివిన విద్యకు తగిన ఉద్యోగాలు వస్తున్నాయి. మిగతా వారంతా ఏదో ఒక ఉద్యోగంతో సరిపుచ్చుకుంటున్నారని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) గణాంకాలు స్పష్టం చేస్తుండటం శోచనీయం. మన రాష్ట్రంలో 2021–22లో 87 వేల మంది ఇంజనీరింగ్‌లో చేరారు. వీరిలో 58 శాతం కంప్యూటర్ కోర్సుల్లో చేరారు. కానీ ఈ ఏడాదిలో కేవలం 39 వేల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు మాత్రమే ఉద్యోగాలు పొందారు. వీటిల్లో ఎక్కువగా నాన్-స్కిల్డ్ ఉద్యోగాలే ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న సాంకేతికతకు సరిపడ నైపుణ్యాలు కొరవడటం, సంబంధిత సబ్జెక్టుపై తగిన అవగాహన లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఏళ్ల నాటి టెక్నాలజీయే ఇప్పుడూ..!


ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్న సాంకేతికతను అన్ని రంగాలూ అందిపుచ్చుకుంటున్నాయి. మానవ వనరులతో సంబంధం లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి టెక్నాలజీ పారిశ్రామిక రంగాన్ని శాసిస్తోంది. అయితే వీటి నిర్వహణకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఇంజనీర్ల అవసరం ఉంది. కానీ బోధనలో ఎప్పటికప్పుడు మార్పు చెందే టెక్నాలజీని చేర్చడం లేదని, ఏళ్ల నాటి టెక్నాలజీతోనే ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు బయటికొస్తున్నారని విద్యావేత్తలు అంటున్నారు. గత కొన్నేళ్లుగా కంప్యూటర్ సైన్స్‌లో అనేక కొత్త కోర్సులు వస్తున్నాయి. ఇవన్నీ మూడేళ్ల క్రితమే డిజైన్ చేసినవి. కోవిడ్ తర్వాత అన్ని రంగాలు తక్కువ మానవ వనరులతో పనిచేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను అభివృద్ధి చేశాయి. ఇంటినుంచే బ్యాంకు లావాదేవీలు, ఢిల్లీలో ఉండి ఎక్కడో మారుమూల ఉన్న సోలార్ సిస్టమ్‌ను పరిశీలించే విధానాలు వచ్చాయి. కానీ ఈ టెక్నాలజీ విద్యార్థుల వరకూ వెళ్లడం లేదు. ఇలాంటి పరిస్థితులే యువ ఇంజనీర్ల ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తున్నాయని చెబుతున్నారు.

తూతూ మంత్రం ప్రాజెక్టులు: ఇంజనీరింగ్ విద్యలో ప్రాజెక్టులు కీలకం. ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ కోర్సులు చేసే వారు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉండే టెక్నాలజీపై ప్రాజెక్టులు చేయాలి. కానీ ఏదో ఒక ప్రాజెక్టును ఎవరితోనో చేయించుకుని వస్తున్నారని, విధిలేని పరిస్థితుల్లో వాటిని అనుమతించాల్సి వస్తోందని ఒక యూనివర్సిటీ వీసీ తెలిపారు. ఇక ప్రైవేటు కాలేజీలు వీటిపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. చాలా కాలేజీలకు నాణ్యమైన పరిశ్రమలతో ఎలాంటి సంబంధాలూ లేవు. దీంతో విద్యార్థులకు మంచి ప్రాజెక్టులను సూచించలేకపోతున్నారు. విద్యార్థులు కూడా ఏదో ఒక ప్రాజెక్టు చేశామనిపించుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. కొత్త విషయాలపై దృష్టి పెట్టాలనే ఆలోచనను విద్యార్థి దశలోనే విస్మరిస్తే, కంపెనీలు కోరుకునే కొత్త టెక్నాలజీ ఎక్కడి నుంచి వస్తుందని విద్యారంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యకే కాదు..ఉన్నత విద్య మొత్తానికీ ఇదేపరిస్థితి ఉందని, ఈ పరిస్థితిలో, విద్యా విధానంలో మార్పు రావాల్సిన ఆవశ్యకత ఉందని అంటున్నారు.

రాష్ట్రంలో 2017-22 మధ్య ఇంజనీరింగ్‌లో చేరిన వారు, ఉపాధి పొందిన వారి వివరాలు

సంవత్సరం	చేరిన వారు	ఉపాధి పొందిన వారు
2017–18	70,329	29,178
2018–19	70,585	34,522
2019–20	71,244	35,929
2020–21	71,244	32,842
2021–22	87,078	39,728

సాంకేతికతలో మార్పులు అందిపుచ్చుకోవడం లేదు



ఉన్నత విద్యకు వచ్చిన విద్యార్థి తరగతి గదిలోనే ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకోవాలి. అప్పుడే కొత్త విషయాలను రాబట్టే విధానం అభివృద్ధి చెందుతుంది. మెజారిటీ విద్యార్థుల్లో ఇది కన్పించడం లేదు. దీనివల్ల ప్రపంచ వ్యాప్తంగా సాంకేతికతలో వస్తున్న మార్పులను విద్యార్థులు అందిపుచ్చుకోలేక పోతున్నారు. ఇదే ఉపాధికి ప్రధాన అడ్డంకిగా మారింది.

– ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి (వీసీ, జేఎన్‌టీయూహెచ్)

నైపుణ్య సామర్థ్యాన్ని మూల్యాంకనం చేసే విధానం ఉండాలి



విద్యార్థికి మార్కులు కొలమానంగా ఉండే విద్యా విధానం మారాలి. అందుకే దీనిపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వమని ఓ సంస్థను కోరాం. విద్యార్థిలో ఉండే నైపుణ్య సామర్థ్యాన్ని మూల్యాంకనం చేసే పరీక్షా విధానం భావి ఇంజనీర్లకు ప్రయోజనం చేకూరుస్తుందని భావిస్తున్నాం. – ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి (చైర్మన్, ఉన్నత విద్యా మండలి)

నాణ్యమైన ప్రాజెక్టు వర్క్ పెంచాలి



సాంకేతిక విద్యే కాదు.. ఉన్నత విద్యలోనూ థియరీలోనే ముందుకెళ్తున్నాం. కానీ పుస్తకాల్లో ఉన్నదానికి నిజ జీవితంలోని అనుభవాలు జోడించడం లేదు. థియరీతో పాటు నాణ్యమైన ప్రాజెక్టు వర్క్ గ్రాడ్యుయేషన్ స్థాయిలోనే పెంచాలి. ఈ దిశగా ఏఐసీటీఈ నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం. ఏదో ఒక ఉపాధి అనుకోవడం కాదు.. ఉన్నత విద్య తర్వాత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాల్సిన అవసరం ఉంది.

– ప్రొఫెసర్ డి.రవీందర్ (వీసీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం)

ప్రయోగాత్మక విద్యను అభివృద్ధి చేయాలి



75 ఏళ్ళు గడిచినా భారత విద్యా విధానంపై స్పష్టమైన రోడ్ మ్యాప్ లేదు. అనేక కమిషన్లు వేసినా ఈ దిశగా ముందడుగు వేయలేదు. ఈ కారణంగానే మన అవసరాలకు కావాల్సిన విద్యా విధానాన్ని రూపొందించుకోలేకపోతున్నాం. పరిశోధనాత్మక విద్యకు బడ్జెట్ పెంచాల్సిన అవసరం ఉంది. థియరీ విద్యతో పాటు ప్రధానంగా ప్రయోగాత్మక విద్యను అభివృద్ధి చేయాలి.

ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ (వీసీ, కాకతీయ వర్సిటీ)

విద్యార్థి దశలోనే భాగస్వామ్యం ఉండాలి



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా అన్ని సంస్థలు యాంత్రిక విధానాలను అనుసరిస్తున్నాయి. వీటి నిర్వహణ నైపుణ్యాలు ఉన్న ఇంజనీర్లకే ఉపాధి అవకాశాలుంటాయి. ఉదాహరణకు ఆసుపత్రులు ఏఐ ద్వారా ముందుకెళ్తున్నాయి. ఈ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ తెలియాలంటే ఇంజనీరింగ్ చేసేటప్పుడే ఆ విద్యార్థికి సంస్థలు, కంపెనీలతో భాగస్వామ్యం అవసరం. అప్పుడే భవిష్యత్ అవసరాలకు ఇంజనీరింగ్ విద్యను ఎలా మలుచుకోవాలో తెలుస్తుంది. ఈ దిశగా ఉన్నత విద్యలో మార్పులు అవసరం. – ఎస్.నీలిమ (సీఈవో, అనురాగ్ యూనివర్సిటీ)

> వివేకవంతుడైన పాలకుడు తన మాటలను జాగ్రత్తగా ఎంచుకుంటాడు. తన చర్యలతో యోగ్యతను సాధించుకుంటాడు. అలాంటి పాలకుడి కింద ప్రజలు తమను తామే పాలించుకుంటున్నామని అనుకుంటారు.
> – తావోయిజం

సాక్షి
మంగళవారం, 8 ఆగస్టు 2023

పాక్‌లో మళ్ళీ పాత కథే!

నేతల పేర్లు మారవచ్చు... ఆరోపణలు మారవచ్చు... పాక్‌లో మాత్రం ఒకే కథ పునరావృతమవుతూ ఉంటుంది. ప్రధాని పీఠమెక్కినవారు సైన్యం అనుగ్రహం కోల్పోయాక ఏదోక ఆరోపణలో జైలుపాలవుతారు. అదృష్టం బాగుంటే బతికిబట్టకడతారు. లేదంటే శంకరగిరి మాన్యాలు పడతారు. జుల్ఫికర్ అలీ భుట్టో నుంచి బెనజీర్, నవాజ్ షరీఫ్‌ల దాకా ఇదే పరిస్థితి. ఇప్పుడు మాజీ ప్రధాని ఇమ్రాన్ వంతు. తీవ్రవాదానికి ప్రోత్సాహం, సైనిక స్థావరాలపై దాడులకు పథకరచన లాంటి తీవ్ర ఆరోపణల నుంచి వచ్చిన కానుకల్ని అక్రమంగా అమ్ముకున్నారనే 'తోషా ఖానా' కేసు దాకా 150 దాకా కేసులున్న ఇమ్రాన్‌ను ఊహించినట్టే జైలులో పెట్టారు. ఎప్పటిలానే మిగతా వ్యవస్థంతా పరోక్ష మద్దతు నివ్వగా, పాక్ కోర్టు మరో పాపులర్ నేత రాజకీయ జీవితానికి తెరదించేందుకు తెగించింది.

తోషాఖానా కేసులో పాకిస్తానీ కోర్ట్ ఆగస్ట్ 5న ఇమ్రాన్‌కు మూడేళ్ళ గరిష్ఠ శిక్ష వేసింది. రాజ్యాంగం ప్రకారం శిక్షపడ్డవారు అయిదేళ్ళ పాటు ఎన్నికల్లో పాల్గొనరాదు గనక, ఈ మాజీ ప్రధానిని అలా బరిలో లేకుండా చేసింది. చివరకు సొంత పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ (పీటీఐ)కి అధినేతగానూ ఇమ్రాన్ కొనసాగరాదు. వెరసి, షరీఫ్‌లు, జర్దారీలు, మౌలానా ఫజల్ ఉర్ రెహ్మాన్ లాంటి సైన్యం ఆశీస్సులున్న వారికి ఎన్నికల బరిలో మార్గం సుగమం చేసింది. ఇమ్రాన్ జైలు పాలయ్యీ కాగానే, ఈ క్షణం కోసమే ఆగినట్టున్న ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆగస్ట్ 9న పార్లమెంట్‌ను రద్దు చేయనున్నారు. నవంబర్ మధ్యలో జరగాల్సిన ఎన్నికలు ఓటర్ల జాబితా సవరణ, నియోజకవర్గ విభజన సాకులతో ఆరు నెలల దాకా వాయిదా పడతాయని అంచనా. ప్రస్తుతం ప్రజాభిప్రాయ సేకరణల్లో అగ్రస్థానంలో ఉన్న ఇమ్రాన్ జైలులో ఉంటారు గనక ఆ లోగా ఓటర్లలో తాము పట్టు సంపాదించాలన్నది షెహబాజ్ సారథ్యంలోని అధికార పార్టీ, మిత్రపక్షాల వ్యూహం.

ఇమ్రాన్‌పై మోపింది పెద్దగా పసలేని అభియోగమైనా, విధించినది మాత్రం కఠిన శిక్షే! చరిత్ర చూస్తే పాకిస్తాన్ మాజీ ప్రధానులు షాహిద్ ఖకాన్ అబ్బాసీ, నవాజ్ షరీఫ్, బెనజీర్ భుట్టో, జుల్ఫికర్ అలీ భుట్టో, హుస్సేన్ షహీద్ సుహ్రావర్దీలకు కూడా రాజ్యవ్యవస్థ చేతిలో ఇదే పరిస్థితే ఎదురైంది. వారంతా ఊచలు లెక్కపెట్టాల్సి వచ్చింది. అయితే, చివరకు వారిపైన మోపిన అభియోగాలేవీ కాల పరీక్షకు నిలబడలేదు. గతంలో జీతం విషయంలో నేరం మోపి, నవాజ్ షరీఫ్ రాజకీయ ఆకాంక్షలకు గండి కొట్టారు. ఇప్పుడు ఇమ్రాన్‌కూ సరిగ్గా అలాగే చేశారు. ప్రధానిగా ఉన్నప్పుడు అందుకున్న కానుకల వివరాలను ఇమ్రాన్ సరిగ్గా వెల్లడించలేదనే మిష చూపారు. షరీఫ్, ఇమ్రాన్‌ల ఇద్దరి విషయంలోనూ చేసిన నేరానికీ, వేసిన శిక్ష తాలూకు తీవ్రతకూ పొంతన లేదన్నది బహిరంగ రహస్యం.

వచ్చిన కానుకల రికార్డులు, ఆస్తుల ప్రకటన విషయంలో నిబంధనల్ని పాటించకుండా ఇమ్రాన్ తప్పు చేసిన మాట నిజమే. కానీ, తోషాఖానా రికార్డుల్ని నిశితంగా పరిశీలించి, అధికారిక హోదాలో కానుకలు అందుకున్న ఎవరెవరు సరిగ్గా ఆ వివరాలు అందించారనే లెక్కలను గనక ఇంతే కఠినంగా బయటకు తీస్తే మునుపున్న ఎవరూ నిర్దోషులుగా మిగలకపోవచ్చు. అలాంటప్పుడు ఇమ్రాన్‌కు మాత్రం అదే నేరానికి కోర్టు గరిష్ఠ శిక్ష విధించడమేమిటి? అసలీ మొత్తం వ్యవహారంలో విచారణ జరిగిన తీరు, ఎక్కడ లేని హడావిడితో కోర్టు తీర్పు ప్రకటించిన వైనం ప్రశ్నలకు తావిస్తోంది. విధించిన కఠినశిక్షపై ఇమ్రాన్ పై కోర్టుకు వెళ్ళే వీలు, అక్కడ ఊరట దక్కే అవకాశం లేకపోలేదు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. తీవ్రనేరాలను సైతం నిత్యం ఉపేక్షించే రాజ్యవ్యవస్థ ప్రజానేతలపై మాత్రం మామూలు అంశాలపైనా అభియోగాలతో, శిక్షలు విధించడమే గమనార్హం.

ఇమ్రాన్ తన ముందువారిలా ఆర్మీ ఆదేశాలకు తలాడించకపోవడం తప్పయింది. 2022 ఏప్రిల్‌లో పార్లమెంట్‌లో మెజారిటీ కోల్పోయినప్పటి నుంచి సైనిక నాయకత్వాన్ని సవాలు చేశారు. ర్యాలీలు చేశారు. మొన్న మేలో ఆయనను అరెస్టు చేసినప్పుడు జరిగిన భారీ కల్లోలాల్లో సైనిక స్థావరాలపై దాడులు జరిగాయి. దీన్ని అందిపుచ్చుకున్న ఆర్మీ ఛీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్ నిరసనకారుల్ని అణచివేశారు. మీడియా నోరునొక్కారు. ఇమ్రాన్ సొంత పార్టీ నుంచి ఫిరాయింపులు చేయించారు. ఇప్పుడు ఇమ్రాన్ జైలు పాలయ్యేలా చూశారు. ఎన్నడూ పెద్దగా ప్రజాస్వామ్యం పరిఢవిల్లని పాక్‌లో అంతకంతకూ సైనిక జోక్యం పెరుగుతున్న తీరుకు ఇది తాజా ఉదాహరణ. నిజానికి, 2017లో నవాజ్ షరీఫ్‌ను దించి, ఇమ్రాన్‌ను గద్దెనెక్కించిందీ సైన్యమే. 2018 జనరల్ ఎన్నికల్లో ఫలితాల్ని అనుకూలంగా మలిచి, ఆనక పార్లమెంట్‌లో ఇమ్రాన్‌కు మెజారిటీ వచ్చేలా చేసిందీ సైన్యమే.

అధికారంలో ఉండగా ప్రజాస్వామ్యంపై గౌరవమే చూపని ఈ మాజీ క్రికెటర్ ఇప్పుడు ఫలితం అనుభవిస్తున్నారు. కొత్త ఆర్మీ ఛీఫ్ మునీర్ పట్టు బిగిస్తున్నారు. అయితే సాంకేతిక కారణాలతో పోటీకి అనర్హులుగా ప్రకటించినంతనే జనాకర్షక నేతల కథకు తెరపడుతుందనుకోలేం. నవాజ్, బెనజీర్‌ల విషయంలో ఇదే జరిగింది. రేపు ఇమ్రానైనా అంతే! సైన్యమేమో తన స్వార్థం కోసం రాజకీయ నాయకత్వాన్ని అదిలించి, బెదిరించి పబ్బం గడుపుకుంటూ ఉంటే, కోర్టులేమో పక్షపాత ధోరణితో ప్రవర్తిస్తున్నాయి. రెంటి మధ్య పాకిస్తాన్ రాజకీయాలు చిక్కుకుపోయాయి. ప్రతీకారాలతో నిలువునా చీలిపోయాయి. దేశంలో ఆర్థిక సంక్షోభానికి తోడు రాజకీయ అలక్ష్యంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కావాల్సింది – దేశాన్ని ఆర్థిక పురోగతి పథంలో నడిపించే దీర్ఘదృష్టి. పాలకులు, వ్యవస్థలు అది మర్చిపోయి, ప్రత్యర్థుల్ని వేటాడే పనిలో మునిగిపోవడమే విచారకరం. వ్యవస్థలు రాజకీయమయమైతే ఇలాంటి దురవస్థలే దాపురిస్తాయి.


గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.సప్తమి ఉ.9.42 వరకు తదుపరి అష్టమి, **నక్షత్రం:** అశ్వని ఉ.7.23 వరకు తదుపరి భరణి, **వర్జ్యం:** సా.4.46 నుండి 6.23 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.44 వరకు, **అమృతఘడియలు:** రా.8.12 నుండి 9.34 వరకు.

సూర్యోదయం : 5.44
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

జవ సత్వాలున్న జన గళం

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ప్రజా గాయకుడిగా, ప్రజా ఉద్యమ గేయ రచయితగా దశాబ్దాల పాటు శ్రామిక, ఉత్పాదక రంగాలలోని పీడితుల్ని, అధికార వర్గాల పీడనల్ని ప్రతిబింబించిన నెత్తుటి, నిలువెత్తు మట్టి మనిషి గద్దర్. ఆయన ఆలోచన, రచనలు... ఆధునాతనంగానూ, గ్రామీణంగానూ రెండు విధాలుగా సాగాయి. గద్దర్ అంబేడ్కరిజంలోకి మారాక కుల వ్యవస్థ, అంటరానితనాలకు వ్యతిరేకంగా అనేక జానపద గేయాలు రాశారు. స్త్రీ జీవితం, ఆమె పడుతున్న శ్రమ, మానవత్వాలపై లోతైన తాత్వికతతో పాటలు కూర్చారు. ఆయన భౌతికకాయం, అందులో మిగిలి ఉన్న తుపాకీ తూటా సహా 'మహాబోధి' ప్రాంగణంలో ఖననం అయినప్పటికీ... విముక్తి పోరాటానికి ఆయన రాసిన పాటలు ఎప్పటికీ సజీవంగా జనంలో ఉండిపోతాయి.

న్యాయం కోసం తనకు తానుగా ఒక ప్రజా గీతంగా, ఒక ప్రజాయుద్ధ నౌకగా అవతరించిన గద్దర్ (75) – గుమ్మడి విఠల్ – ఆగస్టు 6న కన్నుమూశారు. ప్రజా గాయకుడిగా, ప్రజా ఉద్యమ గేయ రచయితగా దశాబ్దాల పాటు శ్రామిక, ఉత్పాదక రంగాలలోని పీడితుల్ని, అధికార వర్గాల పీడనల్ని ప్రతిబింబించిన నెత్తుటి, నిలువెత్తు మట్టి మనిషి గద్దర్. ప్రజా గేయ రచయితగా ఎదుగుతున్న క్రమంలో 1970లలో గద్దర్ రాసిన పాట తెలుగునాట మోతెత్తిపోయింది.

సిరిమల్లె సెట్టు కింద లచ్చుమమ్మో లచ్చుమమ్మా /
నీవు సినబోయి గూసున్న వెందుకమ్మో ఎందుకమ్మా

రాడికల్ విద్యార్థి ఉద్యమం వైపు మళ్లి, తర్వాత ఒక జాతీయ బ్యాంకులో క్లర్కుగా చేసి, కొంతకాలానికే ఆ ఉద్యోగాన్ని వదిలి, తిరిగి ఉద్యమంలోకి వెళ్లిపోయారు. ఆ తర్వాత, నక్సలైట్ ఉద్యమంగా ప్రసిద్ధి చెందిన కమ్యూనిస్టు విప్లవోద్యమంలో పూర్తి సమయం గాయకుడిగా మారారు. చిన్న చిన్న సభల్లో, కొన్నిసార్లు వీధుల్లో పాటలు పడుతూ, జనాన్ని సమీకరిస్తూ సీపీఐ-ఎంఎల్ (పీపుల్స్ వార్)లో అందరికీ తెలిసిన వ్యక్తి అయ్యారు. పీడిత వ్యవసాయ ఉత్పాదక రంగ ప్రజానీకం మీద; భూస్వాముల దోపిడీలు, దౌర్జన్యాల మీద తనదైన శైలిలో పాటలు రాసి, పాడి, భారతదేశ సాంస్కృతిక రంగాన్ని కదం తొక్కించారు. సాయుధ విప్లవం మాత్రమే ప్రస్తుత వ్యవస్థకు ప్రత్యామ్నాయాన్ని నిర్మించగలదని చాలాకాలం పాటు నమ్మికతో ఉన్నారు.

గద్దర్ అనే తన పేరును ఆయన అమెరికా గదర్ ఉద్యమం నుంచి తీసుకున్నారు. చివరికి ఆ పేరు మావోయిస్టు పోరాటాలకు భారతీయ చిహ్నంగా మారింది. 1997లో గద్దర్ అజ్ఞాతం నుంచి జన జీవన స్రవంతిలోకి వచ్చినప్పుడు ఆయనపై జరిగిన కాల్పులలో ఐదు తూటాలు ఆయన శరీరంలోకి దిగబడ్డాయి. వైద్యులు నాలుగు తూటాలను బయటికి తీయగలిగారు. మిగతా ఒక తూటా మొన్నటి రోజున ఆయన అంతిమ శ్వాస తీసుకునే వరకు పాతికేళ్లకు పైగా ఆయన శరీరం లోపలే ఉండిపోయింది.

ధైర్యం, దృఢచిత్తం, వివేకం, వినయం... అదే సమయంలో చిన్న పిల్లవాడి మనస్తత్వం. ఇవీ గద్దర్‌లోని గుణాలు. క్రమంగా ఆయనకు తెలిసి వచ్చినదేమంటే... మావోయిస్టు విప్లవం ఎక్కడికీ దారి తీయడం లేదని. దాంతో దళిత ఉద్యమం వైపు మళ్లి, ప్రజాదరణ పొందే విధంగా పాటలు రాయడం, పాడటం మొదలుపెట్టాడు. 1985లో కారంచేడు కమ్మ భూస్వాములు ఎనిమిది మంది దళితులను దారుణంగా హత్య చేసినప్పుడు ఆయన రాసిన పాట ఇది:

కారంచెడు భూస్వాముల మీద
కలబడి నిలబడి పోరుచేసిన దళిత పులులమ్మా

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని యావత్ దళితులను ఏకం చేసేందుకు ఈ పాట ఆయుధంగా మారింది. అక్కడి నుంచి ఆయన అంటరానితనం, అంబేడ్కరిజం, రాజ్యాంగవాదంపై పాటలు రాయడం ప్రారంభించారు.



1990లో మండల్ వ్యతిరేక ఉద్యమం దేశమంతటా వ్యాపించింది. సామాజిక న్యాయం, ప్రతిభ అన్నవి మండల్ అనుకూల, మండల్ వ్యతిరేక శక్తుల సైద్ధాంతిక లంగర్లు అయ్యాయి. కమ్యూనిస్టు విప్లవకారులు కూడా తమ అగ్రవర్ణ నాయకుల నేతృత్వంలో స్పష్టమైన వైఖరిని తీసుకోడానికి వెనుకంజ వేస్తున్నారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' అప్పటి ఎడిటర్ అరుణ్‌శౌరీ మేధోపరమైన మండల్ వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఆ సమయంలో గద్దర్ రాసిన పాట మండల్ అనుకూల శక్తులకు ఆయుధంగా మారింది.

అరుణ్‌శౌరిగో నీకు ఆకలి బాధేమెరుక
నెయ్యి కాడ నువ్వుంటే పియ్యికాడ మేముంటం

ఈ పాట చాలామంది అగ్రవర్ణ విప్లవకారులకు నచ్చలేదు. కానీ మండల్ రిజర్వేషన్లు అమలు చేయాలని పోరాడుతున్న ఓబీసీ/ ఎస్సీ/ ఎస్టీలకు స్ఫూర్తినిచ్చేందుకు గద్దర్ ఆ పాటను బహిరంగ సభలలో పాడుతూనే ఉన్నారు.

1990వ దశకం చివరిలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని మావోయిస్టులు నిర్ణయించుకున్నారు. మెల్లిగా గద్దర్ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మూల శక్తిగా మారారు.

పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా
పోరు తెలంగాణమా... బలే.. బలే.. బలే...

ఈ పాట తెలంగాణ ఉద్యమానికి ప్రతీకగా నిలిచింది. గద్దర్ ఎప్పుడూ టీఆర్ఎస్‌కు బహిరంగ మద్దతుదారు కానప్పటికీ మావోయిస్టుల మద్దతుతో సమాంతర రాడికల్ తెలంగాణ అనుకూల గ్రూపులను నడిపించారు.

ఈ క్రమంలో మావోయిస్టు భావజాలంతో గద్దర్ వ్యతిరేకించారు. వర్గపోరు మాత్రమే సరిపోదు, కులపోరాటాన్ని చేపట్టాలని భావించారు. అనేక విముక్తి బలాలను కలిగి ఉన్న భారత రాజ్యాంగాన్ని గుర్తించడం ప్రారంభించారు. భారత రాజ్యాంగం పట్ల, అంబేడ్కర్ పట్ల తమ దృక్పథాన్ని మార్చుకోవాలని మావోయిస్టులను ఒప్పించేందుకు పార్టీతో అంతర్గతపోరును సాగించారు. అయితే సహజంగానే వారు తమ పాత వర్గ పోరాట పంథాను మార్చుకోడానికి నిరాకరించారు. దాంతో పార్టీ నుంచి బయటికి వచ్చి నేటి భారత రాజ్యాంగాన్ని సమర్థించిన, సమర్థిస్తున్న అనేక ఇతర శక్తులతో కలిసి పని చేశారు.

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విభిన్న రాజకీయ, సైద్ధాంతిక శక్తులతో సన్నిహితంగా మెలిగారు. అప్పటికే గద్దర్‌పై ఆయన మావోయిస్టుగా ఉన్నప్పటి కేసులు అనేకం ఉన్నాయి. ఆరోగ్యం కూడా క్షీణించడం మొదలైంది. ఆ సమయంలోనే కొంత కాలం గద్దర్, నేను... సీపీఎం మద్దతు ఉన్న బహుజన్ లెఫ్ట్ ఫ్రంట్‌లో కలిసి పని చేశాం. మరోవైపు ఆయన కాంగ్రెస్‌తోనూ సత్సంబంధాలు కొనసాగించారు. తెలంగాణలో రాహుల్ గాంధీ ప్రసంగించిన కొన్ని బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఢిల్లీలో రాహుల్‌ను, సోనియాగాంధీని కలిశారు.

గద్దర్ జీవితం వీరోచిత పోరాటాల అవిశ్రాంత గాథ. ఒక్క రెండు పాటలు తప్ప మిగతా ముఖ్యమైన పాటలన్నీ తనే రాసి, పాడినవి. గద్దర్ పాడటంతో ప్రాచుర్యం పొందిన **'బండెనక బండి కట్టి'** పాట 1940లలో నిజాంకు, రజాకర్లకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా పోరాటంలో యాదగిరి రాసినది. రెండో పాట: **ఈ ఊరు మనదిర, ఈ వాడ మనదిర / దొర ఏందిరో, వాని పీకుడేందిరో.** ఈ పాటను మరో ప్రముఖ దళిత గాయకుడు, రచయిత గూడ అంజయ్య రాశారు. గద్దర్ తన గళంతో ఆ పాటను ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపు ప్రతి పల్లెకు తీసుకెళ్లారు.

గద్దర్ ఆలోచన, రచన... ఆధునాతనంగానూ, గ్రామీణంగానూ రెండు విధాలుగా సాగాయి. గద్దర్ అంబేడ్కరిజంలోకి మారాక కుల వ్యవస్థ, అంటరానితనాలకు వ్యతిరేకంగా అనేక జానపద గేయాలు రాశారు. స్త్రీ జీవితం, ఆమె పడుతున్న శ్రమ, మానవత్వాలపై లోతైన తాత్వికతతో పాటలు కూర్చారు. వంటపని, వీధుల పారిశుధ్యం, ఇంటిని శుభ్రంగా ఉంచే హింసాత్మక శ్రమలలోని నొప్పిని పాటలుగా మలిచారు. ఇంటికి చీపురు చేసే సేవలోని గొప్పతనంపై ఆయన రాసి, పాడిన పాట అత్యంత తాత్వికమైనది.

అంబేడ్కర్ అడుగుజాడల్లో గద్దర్ తన పూర్వపు కమ్యూనిస్టు నాస్తికత్వాన్ని పక్కనపెట్టి సరైన బౌద్ధేయుడు అయ్యారు. గద్దర్ భౌతికకాయం, అందులో మిగిలి ఉన్న తూటా సహా 'మహాబోధి' (పేద పిల్లల కోసం ఆయనే స్థాపించిన పాఠశాల) ప్రాంగణంలో ఖననం అయినప్పటికీ, మానవ సమానత్వంపై ఆయన ప్రేమ, విముక్తి పోరాటానికి ఆయన రాసిన పాటలు ఎప్పటికీ సజీవంగా జనం జీవనంలో ఉండిపోతాయి.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అదే ధైర్యం



సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్‌కు పాల్పడేవాళ్లలో చాలామంది ముఖ రహితంగా, నామరహితంగా ఉంటారు. నిజమైన పేర్లు, నిజమైన ఫొటోలతో ఉన్నవాళ్లు సిగ్గులేకుండా ట్రోల్ చేయడానికి సంశయిస్తారు. – అనూ సెహగల్, ఇమేజ్ కన్సల్టెంట్

ఒకటి ఒకసారి



ఒకేసారి చాలా పనులు చేస్తూ, తమ శాయశక్తులా ఒకసారి ఒక్కపనినే చేస్తున్న వారిని ఓడించగలం అనుకోవడం అహంకారం అవుతుంది. దానికి బదులుగా ఒకటే ఎంపిక చేసుకోండి. దానిలోకి సర్వశక్తులూ ఒడ్డండి. అప్పుడు మాత్రమే మీరు అజేయులు కాగలరు. – అలెక్స్ హార్మోజీ, రచయిత

భాషల నెలవు



నిన్న ఒక రెండేళ్ల చిన్నారిని కలిశాను. కన్నడ, జర్మన్‌తోపాటు కొంచెం హిందీ కూడా మాట్లాడుతోంది. ఇంగ్లీష్ గురించి పేరెంట్స్ కొంచెం ఆందోళన చెందుతున్నారు. నాకు ఆరేళ్లప్పుడు మొదటిసారి ఆంగ్లంతో పరిచయం కలిగింది. అప్పటికే నాకు మరాఠీ, కన్నడం, కొంకణీ వచ్చు. హిందీ, ఇంగ్లీష్ తర్వాత వచ్చాయి. దక్షిణాదిలో పెరిగినందుకు నేను గర్వపడతాను. – సమర్ హలరంకర్, జర్నలిస్ట్

మూలానికి చికిత్స



అధిక రక్తపోటు అనేది ఒక లక్షణం. డిప్రెషన్ అనేది ఒక లక్షణం. ఆందోళన అనేది ఒక లక్షణం. మీరు అనారోగ్యంతో సతమతం అవుతుంటే వాళ్లు మీ మీద మాత్రల్ని ఎగజల్లుతారు. అంతేగానీ సమస్య మూలకారణాన్ని రూపు మాపే జీవన విధాన సూత్రాలను బోధించరు. అంతా తల్లకిందుల వ్యవహారం. – జాన్ కాన్‌స్టాస్, వైద్యరంగ యాక్టివిస్ట్

గొప్ప న్యాయమూర్తి



జస్టిస్ మురళీధర్ ఇవ్వాళ (ఆగస్ట్ 7) పదవీ విరమణ చేస్తున్నారు. ప్రస్తుతం మనకున్న అత్యుత్తమ న్యాయమూర్తుల్లో ఆయనొకరు. కానీ బాధాకరంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి కానివారి క్లబ్బులో ఆయన కూడా చేరుతున్నారు. అయినప్పటికీ ఆయన తన సాహసోపేత తీర్పులకు గుర్తుండిపోతారు. – అరీబ్ ఉద్దీన్, న్యాయవాది

ప్రజాకవి



విప్లవ కవి గద్దర్ పోయారని తెలిసింది. కులవ్యతిరేక, కమ్యూనిస్టు ఉద్యమంలో గద్దర్‌ది ప్రముఖ గొంతుక. తర్వాత ఆయన తెలంగాణ ఆకాంక్షలను బలంగా సమర్థించారు. ఆయన నిజమైన ప్రజాకవి. వసంత కన్నాబిరన్ అనువదించిన 'మై లైఫ్ ఈజ్ ఎ సాంగ్' ద్వారా నాకు గద్దర్ పాటలు పరిచయం అయ్యాయి. – సబహ్ గుర్మత్, జర్నలిస్ట్

విషాదకర వాస్తవం



ఇండియాలో మీరు నెలకు 25,000 రూపాయల కంటే ఎక్కువ సంపాదిస్తున్నట్టయితే, మీరు మధ్యతరగతికి చెందిన వాళ్లు కాదు. పైనున్న పది శాతం భారతీయుల్లోకి మీరు కూడా వస్తారు. విషాదం, కానీ వాస్తవం. ఎందుకంటే కేవలం 10 శాతం భారతీయులు మాత్రమే నెలకు 25,000 కంటే ఎక్కువ సంపాదించగలుగుతున్నారు. – అమితభ బంద్యోపాధ్యాయ, ప్రొఫెసర్

అగ్గినౌక

సముద్రం గుండెల్లో
వేలెడంత తూటా.
ఎవరు వీడు?
ఆకాశాన్ని, భూమిని
గజ్జెలు చేసిన వీరబాహుడు.
నేత్రం సూర్యునిలో
దుమ్ము కొట్టానన్న చంద్రిగాడ్ని
మడంతో మట్టేశాడు
ఎవడు వీడు?
అడవి సింహనాదాన్ని
భాగమతి గుండెల్లో నినదించిన
బెబ్బులికి
విభూది కుక్కల కొరుకుళ్ళా?
ఒరేయ్! గద్దరంటే
ఈ యుగం నల్లసముద్రంలో
నడుస్తున్న అగ్గి నౌక.
గుంపు పాటల్లో పుట్టిన
యుగ గీతిక.
అది సంస్కృతి – అది సంఘర్షణ.
గుండె పొరల్నిండా
మంటలు మంటలు.
మూడు రోజులే కాదు
మూడు గంటలకే లేచి
నేను రెండోసారి వచ్చాను కాచుకోండి
ఇక ముద్దాయిలందరూ
బారులు తీరండి.
శిలువనెక్కిన వానిదే
అంతిమ తీర్పు.

– డాక్టర్ కత్తి పద్మారావు
('దళిత రాజ్యం' 1997 మే సంచికలో ప్రచురితం)

నీవు లేకున్నా...

మరణం చక్రబంధంలో
యుద్ధనౌక తునాతునకలై పోయింది
తూప్రాన్ లక్ష్మమ్మ కన్న కొడుకు
పోరాట పాటలు ఎగిరే జెండాలై
గాలిలో రెపరెపలాడినై
వెన్నులో తూటా గన్నులా పేలే పాట
అడవి ప్రవచించిన మాట
పేద ప్రజలే ఆయన జీవం
జనం బాధల గాధలు
సవరించిన గొంతు రావం
సమస్తాన్ని కదిలించిన పల్లవి
ఇవ్వాళ పిడికిలెత్తి
వేలాదిగా గొంతు ఎత్తిన నీ చరణం
రేలా దూలా ఒక్కటై
అలాయ్ బలాయ్ తీసుకుంటున్నై
మాట పాట గజ్జె కట్టి ప్రదర్శన ఇస్తున్నై
దిగులు జ్వరం కమ్మినప్పుడల్లా
నీ పాట జీవం పోస్తుంది
తలవంచుకున్నప్పుడల్లా
నీ ఆట పాట ధైర్యం శిరస్సు ఎత్తుకుంటుంది
ఎవరన్నారు నువ్వు చనిపోయావని
భౌతికంగా బోధి నీడలో విశ్రాంతిలోకి వెళ్లావు
ఎవరన్నారు ఇది అంతిమయాత్రని
భూమి ఉన్నంతవరకు మనుషులు ఉన్నంతవరకు
అడవి ఉన్నంతవరకు
నదీనదాలు ఉన్నంతవరకు
ప్రజల నాలుకల మీద
గొంతు సవరించుకొని రాగమై
పాటగా ప్రవహిస్తూ యాత్రిస్తూనే ఉంటుంది

– జూకంటి జగన్నాథం



గద్దర్... ఆకాశాన్ని శిక్షిస్తున్నావా?

తుపాకులు తూట్లు తొలుచుకుంటూ పోతున్నా
పాటల హృదయాన్ని రంధ్రాల డ్రిల్ చేస్తున్నా
ఇరవై ఒక్క బులెట్లను నిష్కారణంగా నిర్దయతో,
న్యాయం చేత లేని, చేవలేని, నిర్దోషియైన ఆకాశాన్ని
పేల్చుకుంటూ, మరణశిక్ష విధించి నిశ్శబ్దంగా ఉన్నావా?
దేశం కోసం పాడుకుంటూ ఆడుకుంటూ
శరీరంలో జీర్ణించుకున్న
రవిస్తూ రహిస్తూ స్తుతిస్తూ
దశాబ్దాల నుంచి నివసిస్తున్న
తూటాల్ని మరిచి జపిస్తున్నావా గద్దర్?

– మాడభూషి శ్రీధర్
(నిన్న పోలీసులు 21 తుపాకులను గాలిలోకి పేల్చి గద్దర్‌కు శ్రద్ధాంజలి ఘటించిన సందర్భంగా)

పాటతీపి..

బతుకంతా భుజంపై చీకటిని మోసిన
అతడు చేతికర్రతో వెలుతురు కాపలా కాసాడు
పొత్తిళ్లలో నెత్తుటి బిడ్డలను కాసిన
అతడు సంధ్యార్ణవంలో లీనమైపోయాడు
గొంగళిపురుగులెన్నో అడవుల్లోకి ఎగిరాయి
అతడి గొంతు విని సీతాకోకచిలుకలై
అంతకుముందు నెత్తురు ఉత్త నెత్తురే
అతడి స్వరం విన్నాకే మరిగింది
కుప్పించి, లంఘించి, ఎగసి దూకిన
అతడే ఒక వీరుడు, శూరుడు
వెళ్లిపోయాడని బెంగటిల్లకండి
పెరటి వాకిలి ఓరగా తెరిచి ఉంచండి
అతడు కాకమ్మయ్యి వచ్చిపోతాడు
కడుపు తీపి చేసిపోతాడు

– దేశరాజు


రెడ్ సెల్యూట్

1974 ప్రాంతంలో కెనరా బ్యాంకులో క్లర్క్‌గా పని చేస్తున్న గుమ్మడి విఠల్... నరసింగరావుతో కలిసి 'జననాట్య మండలి' స్థాపించి కర్నూల్‌లో మమ్మల్ని కలిసి 'విప్లవ రచయితల సంఘం'(విరసం)లో సభ్యుడుగా చేరారు. నా మిత్రుడు, క్లాస్‌మేట్ అయిన రవీంద్రనాథ్ తీసిన 'మా భూమి' సినిమాలో ఒక పాటలో నటించారు. అనంతపురం జిల్లాకు గద్దర్‌కు చాలా అనుబంధం ఉంది. ఆ జిల్లాలో చాలా చోట్ల జననాట్యమండలి తరఫున పాటలు పాడారు. పీపుల్స్‌వార్ ఉద్యమకారుడిగా ఈ జిల్లాలో 'చెన్నారెడ్డి' పేరుతో నివసించారు. గద్దర్ మీద పాలకవర్గం నల్లత్రాచులు తుపాకీ కాల్పులు జరిపినప్పుడు 'తూటా నుండి తప్పించుకున్న పాట'ను రాశాను. దానినే అనంతపురంలో కరపత్రంగా పంచాము. అద్భుతమైన రాగయుక్తమైన గొంతుతో మా దగ్గర ఉన్నంత వరకు సిద్ధాంత నిబద్ధుడుగా ఉన్న గద్దర్ నిర్యాణం బాధాకరం. ఎగువపల్లిలో పరిటాల శ్రీరాములు విగ్రహావిష్కరణకు హాజరైనాడు. ఈ జిల్లాలో కొన్ని చోట్ల రాత్రి ఒంటి గంట దాకా పాటలు పాడాడు. సాహిత్య చరిత్రలో అమర గాయకుడైన గద్దర్‌కు 'రెడ్ సెల్యూట్.'

– జెట్టి జైరామ్, 'విరసం' వ్యవస్థాపక సభ్యుడు

హస్త మస్తక సంయోగం

చేసే పని ఏదైనప్పటికీ అందులో రెండింటి పాత్ర తప్పనిసరిగా ఉండాలి. ఆ పనికి సంబంధించిన ఆలోచన ఆ రెండింటిలో మొదటిది. ఆ తరువాతిది చేతితో చేసే శ్రమ. ఈ రెండింటి సంయోగ సంయమనాల ఫలితంగానే ఏ సఫలీకృతమైన పనియైనా ఉంటుంది. అలా చేయని ఏ పనికైనా ఫలితం, దాని అంతిమ రూపం అనుకున్న విధంగా రావు. కొన్ని సందర్భాలలో పూర్తిగా విఫలం కూడా అవుతుంది. అందుకోసమే ఒక పని చేయడానికి పూనుకునే ముందు, ఆ పని గురించిన అనుపానులను పూర్తిగా తెలుసుకుని దిగాలి. ఒకసారి చేయడానికి నిర్ణయించుకున్న తరువాత, ముందుగా ఆలోచించి పెట్టుకున్న మార్గంలోనే ఆ పనికి సంబంధించిన అన్ని కార్యక్రమాలనూ నిర్వహించుకోవాలి. ఇది ఇప్పటి మాట మాత్రమే కాదు. శతాబ్దాల క్రితమే మన ఆలోచనలలో ఉండి, మట్ల అనంతరాయని (16వ శతాబ్ది) 'కకుత్స్థ విజయము' కావ్యంలో ప్రస్తావించ బడింది.



జ్యోతిర్మయం

ఆ కావ్యంలోని ప్రథమాశ్వాసంలో 'హస్త మస్తక సంయోగ మాచరించి/ తెన్ని విఘ్నంబులును నన్ను నేమి సేయు' అని మొదలయ్యే ఒక పద్యంలో, ఈ మొత్తం ఆలోచనను కేవలం రెండు మాటలలో ఒదిగిపోయే విధంగా, 'హస్తమస్తక సంయోగం' అనే చక్కని పదబంధంలో ఇమిడ్చి చెప్పాడు కవి. 'బుద్ధి చేసే ఆలోచనకు, చేయి చేసే పనికి సయోధ్యను, సంయోగాన్ని కుదిర్చి పనికి పూనుకున్నాను. ఇక నన్ను ఏ విఘ్నాలైనా ఏమి చేయగలవు?' అని నిస్సంశయంగా, ధైర్యంగా ప్రశ్నించడం పై పద్యభాగం భావం.

చెయ్యి శారీరకంగా పని చేస్తుంది. మస్తకం అనగా బుద్ధి తగిన విధంగా ఆలోచనను సమకూర్చుతుంది. ఈ రెండూ ఒకదానికొకటి సమానంగా తోడై, జోడు గుర్రాల వలె పరుగెడితే, బండి ఎంత దూరమైనా అవలీలగా ప్రయాణాన్ని సాగిస్తుంది. ఏ అడ్డంకులూ మధ్యలో రావు. వచ్చినా నిలవవు. అవిఘ్నంగా ప్రయత్నం కొనసాగి, చివరకు విజయం తప్పక సిద్ధిస్తుంది.

– భట్టు వెంకటరావు

వరద బాధితులకు ఆధార్, రేషన్‌కార్డులు


వరద బాధితులకు ఆధార్, రేషన్‌కార్డులు ఇస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

ఏటూరునాగారం: వరద బాధితులకు ధ్రువీకరణపత్రాలు ఒక్కొక్కటిగా అందుతున్నాయి. ములుగు జిల్లా కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాల్లో వరదల వల్ల అన్ని రకాల ధ్రువీకరణపత్రాలు కోల్పోయిన వారికి సోమవారం ఏటూరునాగారంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా ఆధార్, రేషన్‌కార్డులను కలెక్టర్ ఇలా త్రిపాఠి అందజేశారు. వరదలతో అన్ని రకాల పత్రాలు కోల్పోయిన బాధితుల ఆవేదనపై ఈనెల 4న 'సాక్షి'ప్రధాన సంచికలో 'ధ్రువీకరణ వరదపాలు'శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎవరు ఏ పత్రాలు కోల్పోయారో వివరాలు సేకరించి వాటిని అందించడంపై దృష్టి పెట్టారు. ప్రస్తుతానికి ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు అందాయి. ఇంకా భూమి పట్టాదారు పాసుపుస్తకాలు, ఓటర్ కార్డులు, బ్యాంక్ ఖాతా పుస్తకాలను అందించాల్సి ఉంది. వాటిని కూడా త్వరలో అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

భద్రాచలం, రామప్పకు 'నిధులు శూన్యం'

లోక్‌సభలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: 'ప్రసాద్'పథకంలో భాగంగా 2022–23లో ఎంపిక చేసిన తెలంగాణలోని రామప్ప, భద్రాచలం దేవాలయాలకు నిధులు విడుదల చేయలేదని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. రామప్ప దేవాలయానికి రూ.62 కోట్లు, భద్రాచలం దేవాలయానికి రూ.41.38 కోట్లకు ఆమోదం తెలిపినప్పటికీ, ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి బదులిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని సింహాచలం ఆలయ అభివృద్ధికి రూ.54.04 కోట్లకు ఆమోదం తెలిపినప్పటికీ నిధులు విడుదల కాలేదని కేంద్రమంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా వచ్చిన ప్రతిపాదనల్లో ప్రసాద్ పథకంలో భాగంగా 46 ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో 3 చొప్పున ప్రాజెక్టులు ఉన్నాయని, ఏపీలో అమరావతి పట్టణ అభివృద్ధి, శ్రీశైలం ఆలయ అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తికాగా, తెలంగాణలో ఆలంపూర్ జోగులాంబ దేవస్థాన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం రూ.36.73 కోట్లు ఆమోదం తెలపగా, ఇప్పటివరకు రూ.13.76 కోట్లు విడుదలయ్యాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

కేంద్రంలో వచ్చేది సంకీర్ణమే

- ఆ ప్రభుత్వంలో మా పాత్ర ఉంటుంది: మంత్రి కేటీఆర్
- చేనేత కార్మికుల గురించి మోదీ ప్రభుత్వానికి ఏమీ తెలియదని ఎద్దేవా
- చేనేత వద్దు–అన్నీ రద్దు నినాదంతో ముందుకు సాగుతోందని మండిపాటు
- సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోనే నేత కార్మికుల బతుకుల్లో వెలుగులని వెల్లడి
- వచ్చే నెల నుంచి చేనేత మిత్ర కింద రూ. 3 వేలు ఇస్తామని హామీ
- 75 ఏళ్లలోపు చేనేత కార్మికులందరికీ బీమా అందిస్తామని ప్రకటన
- మన్నెగూడలో జరిగిన జాతీయ చేనేత దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరు


ఉప్పల్ భగాయత్‌లో చేనేత భవన్ నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్న మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు

తుర్కయాంజాల్: రానున్న లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వమే ఏర్పడుతుందని మున్సిపల్, ఐటీ, చేనేత శాఖ మంత్రి కె. తారక రామారావు జోస్యం చెప్పారు. ఆ సంకీర్ణ సర్కారులో తమ పాత్ర తప్పకుండా ఉంటుందని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో సోమవారం నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చేనేత గురించి, నేత కార్మికుల గురించి ఏమీ తెలియదని ఎద్దేవా చేశారు. నేతన్నల కష్టాలను స్వయంగా చూసిన కేసీఆర్.. తెలంగాణ ఉద్యమ సమయంలో వారికి ఇచ్చిన ప్రతి హామీనీ నిలబెట్టుకున్నారని గుర్తుచేశారు. చేనేత కార్మికులకు ఇప్పటివరకు అందిస్తున్న పథకాల్లో ఏవైనా లోటుపాట్లు ఉంటే వాటిని సవరించే దిశగా ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. చేనేతపై 5 శాతం జీఎస్టీ విధించిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందని ఎద్దేవా చేశారు. హ్యాండ్లూమ్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డు, మహాత్మాగాంధీ బీమా బంకర్ యోజన, ఐసీఐసీఐ లాంబార్డ్ వంటి పథకాలను రద్దు చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికులను అంధకారంలోకి నెట్టిందని మండిపడ్డారు. చేనేత వద్దు–అన్నీ రద్దు అనే నినాదంతో కేంద్రం ముందుకు సాగుతోందని విమర్శించారు.

సంకీర్ణంలో ఉంటే రాష్ట్రానికి సంస్థలు, అదనపు నిధులు..

కేంద్రంలో ఏర్పడనున్న సంకీర్ణ ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ ఉంటేనే రాష్ట్రంలో ఇంటీరియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ, నేషనల్ టెక్స్‌టైల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వంటి సంస్థల ఏర్పాటు ద్వారా చేనేతకు మంచి రోజులు సాధ్యమని మంత్రి కేటీఆర్ తెలిపారు. అలాగే కేంద్రం నుంచి తెలంగాణకు అదనంగా నిధులు తెచ్చుకోవచ్చన్నారు. ఉప్పల్ భగాయత్‌లో నిర్మించనున్న కన్వెన్షన్, ఎక్స్‌పోలో ఏడాదంతా చేనేత ఉత్పత్తులను అమ్ముకోవచ్చని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో చేనేత స్టాల్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కష్టకాలంలో చేనేత కార్మికులను ఆదుకుంటున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోనే నేత కార్మికుల బతుకుల్లో వెలుగులు వచ్చాయని చెప్పారు.

నేత కార్మికులకు వరాలు...

చేనేత మిత్ర పథకంలో భాగంగా వచ్చే నెల నుంచి ప్రతి మగ్గానికీ రూ. 3 వేలు అందిస్తామని, 75 ఏళ్లలోపున్న చేనేత కార్మికులందరికీ బీమా సౌకర్యం కల్పిస్తామని, రూ. 25 వేల పరిమితితో హెల్త్ కార్డులు అందిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. గుంట మగ్గాల స్థానంలో 10,652 ఫ్రేమ్‌లూమ్స్ మగ్గాలు తెస్తామని, ఇందుకోసం ప్రభుత్వం నుంచి రూ. 40.50 కోట్లు ఖర్చు చేస్తామని వివరించారు. చేనేత, అనుబంధ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతోపాటు కార్మికులు చనిపోతే అంత్యక్రియలకు ఇస్తున్న రూ. 12,500 మొత్తాన్ని రూ. 25 వేలకు పెంచుతామని చెప్పారు. డీసీసీబీల సహకారంతో పెట్టుబడి సాయం అందిస్తామని, ఇంటి వెనక మగ్గాల షెడ్ ఏర్పాటు చేసుకొనేందుకు గృహలక్ష్మి పథకంలో అవకాశం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

కులవృత్తులకు జీవం...

నేతన్నకు, గీతన్నకు అవినాభావ సంబంధం ఉందని ఆబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో కులవృత్తులు పూర్తిగా నష్టపోయాయని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ జీవం పోసుకుంటున్నాయని తెలిపారు. చేనేత కార్మికులను ఆదుకొనేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని శాసనమండలి సభ్యుడు ఎల్.రమణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్‌తోపాటు పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ఉప్పల్ భగాయత్‌లో చేనేత భవన్‌కు భూమిపూజ

ఉప్పల్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉప్పల్ భగాయత్‌లో చేనేత భవన్ నిర్మాణంతోపాటు హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ మ్యూజియం నిర్మాణానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో కలసి మంత్రి కేటీఆర్ సోమవారం భూమిపూజ చేశారు. 2,576 చదరపు గజాల్లో నిర్మించనున్న చేనేత భవన్‌కు దాదాపు రూ. 50 కోట్ల వ్యయం కానుండగా 500 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మించనున్న మ్యూజియానికి రూ. 15 కోట్లు ఖర్చు కానుంది. కాగా, ఉప్పల్–వరంగల్ జాతీయ రహదారి కారిడార్ పనులు త్వరలో పూర్తి చేయాలని, ఉప్పల్ భగాయత్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు రెండు ఎకరాలు కేటాయించాలని, 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని మంత్రి కేటీఆర్‌కు బేతి సుభాష్‌రెడ్డి వినతిపత్రం అందించారు.

చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయాలి

- చేనేత డిక్లరేషన్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయాలని, చేనేత కారుల అభివృద్ధి కోసం జాతీయ చేనేత విధానాన్ని ప్రకటించాలని అఖిల భారత పద్మశాలీ సంఘం చేనేత విభాగం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు ఏకగ్రీవంగా గళమెత్తారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో చేనేత డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా చేనేత ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం విధించిన 5 శాతం జీఎస్టీని ఎత్తి వేయాలని కోరడంతో పాటు చేనేత రంగం ఎదుర్కొంటున్న ఇతర సమస్యల గురించి వక్తలు చర్చించారు. చేనేత కార్మికుల సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలను పునరుద్ధరించాలని, చేనేతకారులకు సహకార సంఘాలకు రుణమాఫీ చేయాలని కోరారు. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ ఎంపీలు శశిథరూర్, కార్తీ చిదంబరం, వివేక్ తన్ఖా, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, బిజూ జనతా దళ్ ఎంపీ అమర్ పట్నాయక్, బీఆర్‌ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు, అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, చేనేత విభాగం అధ్యక్షుడు యర్రమాద వెంకన్న నేత, యువజన విభాగం ఇన్‌చార్జి అవ్వారి భాస్కర్, ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, మహిళా విభాగం అధ్యక్షురాలు వనం దుష్యంతల, సినీ నటి, సామాజిక కార్యకర్త పూనమ్‌కౌర్, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఇరవర్తి అనిల్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జనార్దన్‌తో పాటు 14 రాష్ట్రాల నుంచి పద్మశాలీ సంఘాల నేతలు, చేనేత కార్మికులు హాజరయ్యారు. కాగా, సోమవారం ఉదయం 8 గంటలకు అఖిల భారత పద్మశాలీ సంఘం చేనేత విభాగం ఆధ్వర్యంలో ఎర్రకోట నుంచి రాజ్‌ఘాట్ వరకు హ్యాండ్లూమ్ మార్చ్ నిర్వహించారు.

ప్రగతి రథచక్రాలు ఎన్నటికీ ఆగవు: పువ్వాడ


ఆర్టీసీ ఉద్యోగులకు స్వీట్ తినిపిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్

ఖమ్మం మయూరిసెంటర్: సీఎం కేసీఆర్ సారథ్యాన టీఎస్ ఆర్టీసీని బతికించుకునేందుకు అనేక చర్యలు తీసుకున్నామని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ప్రగతి రథచక్రాలు ఇక ఎన్నటికీ ఆగవని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఖమ్మం చేరుకున్న మంత్రి పువ్వాడకు ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, మున్నేరు పరీవాహక ప్రాంతాల ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. అసెంబ్లీలో ఆర్టీసీ విలీనం బిల్లు ప్రవేశపెట్టడమే కాక మున్నేరుకు ఇరువైపులా రూ.150 కోట్లతో ఆర్‌సీసీ వాల్ నిర్మాణానికి కేబినెట్‌లో ఆమోదం పొందేలా కృషి చేసినందుకు మంత్రిని సత్కరించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులను కడుపులో పెట్టుకుని చూసుకున్నామని, 43 వేలమంది ఆర్టీసీ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు అందరూ రుణపడి ఉండాలని అన్నారు. ఇక నుంచి ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత ఉంటుందని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు తీసుకునే అవకాశం ఉందని చెప్పారు. రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా అధికారంలోకి రాబోతున్నారని పువ్వాడ ధీమా వ్యక్తం చేశారు.

ఐఐటీ విద్యార్థిని ఆత్మహత్య

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా కందిలోని హైదరాబాద్ ఐఐటీలో బీటెక్ ఫస్టియర్ విద్యార్థిని మమైత (20) ఆత్మహత్యకు పాల్పడింది. హాస్టల్‌లోని తన గదిలో ఫ్యానుకు ఉరివేసుకుంది. ఒడిశా రాష్ట్రానికి చెందిన మమైత జూలై 26న క్యాంపస్‌కు వచ్చినట్లు చెబుతున్నారు. ఒరియా భాషలో రాసిన సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు తెలియజేశారు. సంగారెడ్డి డీఎస్పీ పి రమేశ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మమైత ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చదువు విషయంలో ఒత్తిడికి గురి కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కష్టాల కడలిలో 'గోదావరి' రైతులు

అన్నదాతలను నిండా ముంచిన భారీ వర్షాలు, వరదలు


ఈ ఫొటోలోని యువరైతు పేరు కూతురు భూపాల్‌రెడ్డి. హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన ఈయనకు చలివాగు వంతెన సమీపంలో 2.26 ఎకరాల పొలం ఉంది. ఈసారి సన్నరకం నారు అలికి సాగుకు సిద్ధపడుతున్న సమయంలో చలివాగు ప్రవాహానికి కొట్టుకుపోయి పొలమంతా ఇసుకమేటలు వేసింది. దీంతో రూ. లక్ష నష్టం వాటిల్లిందని ఆవేదన చెందుతున్నాడు.


భూపాలపల్లి జిల్లా మోరంచపల్లికి చెందిన ఈ రైతు పేరు శ్రీపతి తిరుపతి. రెండెకరాల సాగుభూమిలో భారీగా ఇసుక మేటలు వేసింది. ఇసుక మేటను తీయాలంటే కనీసం రూ. 20 వేల అదనపు ఖర్చయ్యేలా ఉంది. తన చేతిలో చిల్లిగవ్వ కూడా లేనందున పంట వదిలేయడం తప్ప వేరే మార్గం లేదంటున్నాడు.


ఈయన పేరు చల్ల రవీందర్. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచెర్ల గ్రామానికి చెందిన రైతు. మానేరు వరద ఉధృతికి ఆయన మూడెకరాల పొలంలో పూర్తిగా ఇసుక మేటలు వేసింది. ఇప్పటికే పొలం దున్నడానికి రూ.10 వేల వరకు ఖర్చు చేశాడు. ప్రభుత్వం తక్షణమే పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

- భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అపార నష్టం
- వరినార్లను తుడిచిపెట్టేసిన ఇసుక మేటలు
- గోదావరి బెల్టులో సుమారు 2 లక్షల ఎకరాల్లో పంట నష్టం

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు రాష్ట్రంలోని గోదావరి పరీవాహక ప్రాంత రైతులను నిండా ముంచాయి. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల్లో వరి పైర్లు వరదల తీవ్రతకు కొట్టుకుపోవడంతోపాటు పొలాలు కోతకు గురై ఇసుక మేటలు వేశాయి. చాలాచోట్ల పొలాల్లోనే విద్యుత్ తీగలు, స్తంభాలు పడిపోగా ట్రాన్స్‌ఫార్మర్లు వరదలో మునిగాయి. సుమారు లక్షన్నర ఎకరాల్లో పంటలు దెబ్బతినగా ఇసుక మేటలు తొలగించలేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వరదలకు ములుగు, జేఎస్ భూపాలపల్లి జిల్లాల్లో 22 మంది గల్లంతవగా ఇంకా ముగ్గురి ఆచూకీ లభించలేదు.

తేలని నష్టపరిహారం లెక్కలు...

వరదల్లో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ. 10 వేల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించినా ఆ ప్రకియ ఇంకా కార్యరూపం దాల్చలేదు. కేంద్ర, రాష్ట్ర బృందాలు ఐదు రోజులపాటు క్షేత్రస్థాయిలో పర్యటించినా అధికారికంగా నష్టాలను తేల్చలేదు. పంట నష్టం 33 శాతంపైన ఉంటేనే వరద నష్టం అంచనా వేస్తామని మండలస్థాయి అధికారులు చెబుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. దీంతో నాట్ల దశలో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం వర్తించదన్న ప్రచారం జరుగుతోంది. తెలంగాణవ్యాప్తంగా సుమారు రూ. 2,400 కోట్ల మేర నష్టం ఉంటుందని ప్రాథమిక అంచనా కాగా.. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోనే రూ. 1,000 కోట్లపైన నష్టం ఉంటుందని చెబుతున్నారు. ఇంత నష్టం జరిగినా అధికారులు మార్గదర్శకాలతో మల్లగుల్లాలు పడుతుండగా ఏం చేయాలో తెలియక రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.



వరదలతో ఆగమయ్యాం..

నాలుగు ఎకరాల్లో ఇసుకమేటలు వేసినా ఇప్పటివరకు ఒక్క అధికారి కూడా మా ముఖం చూడలేదు. వరదలతో ఆగమయ్యాం. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.
- కొక్కిరాల తిరుపతిరావు, రైతు, పరకాల

అయినోళ్ల కోసం కళ్లలో వత్తులు వేసుకొని...

బండ్ల సారయ్య–సారమ్మ... సారయ్య తల్లి రాజమ్మ... ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం బూరుగుపేటకు చెందిన ఈ ముగ్గురిని వరద మింగేసింది. జూలై 27న కురిసిన అతిభారీ వర్షంతో మారేడుగొండ చెరువుకు గండిపడి వరద ప్రవాహానికి సారయ్య ఇల్లు కొట్టుకుపోయింది. ఇంట్లో ఉన్న సారయ్య, సారమ్మ, రాజమ్మ గల్లంతయ్యారు. వారికి కొంతదూరంలో నివసించే సారయ్య కొడుకు, కోడలు ఇద్దరు పిల్లలు ప్రాణాలతో బయటపడ్డారు. వరద తగ్గాక సారయ్య మృతదేహం లభించినప్పటికీ అత్తా కోడళ్లయిన రాజమ్మ, సారమ్మల ఆచూకీ ఇంకా లభించలేదు. దీంతో ఆ కుటుంబం పుట్టెడు దుఃఖంలో ఉంది.

వర్షాలు, సాగునష్టాలతో రైతు ఆత్మహత్య


వెంకటయ్య

చిల్పూరు: జనగామ జిల్లాలో అప్పులబాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. చిల్పూరు మండలం కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన ముడిక వెంకటయ్య(56) తన 5 ఎకరాలతోపాటు మరో 3 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గత వానాకాలం, యాసంగిలో వరి సాగు చేయగా వర్షాల వల్ల ఒకసారి, నీరు సరిగా అందక మరోసారి తీవ్రంగా నష్టపోయాడు. మొత్తంగా రూ.6 లక్షల మేర అప్పులయ్యాయి. ఇటీవల పోసిన నారు వర్షాల కారణంగా పనికిరాకుండా పోయింది. ఈ క్రమంలో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురై సోమవారం వ్యవసాయబావి వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

అప్పులబాధతో సర్పంచ్ భర్త బలవన్మరణం


వెంకటేశ్వర్లు

చెన్నారావుపేట: వరంగల్ జిల్లాలో అప్పులబాధతో ఓ సర్పంచ్ భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నారావుపేట మండలం పాపయ్యపేట సర్పంచ్ ఉప్పరి లక్ష్మి భర్త వెంకటేశ్వర్లు(52) ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు. కొంతకాలం నుంచి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఆయనకు రూ.50 లక్షల అప్పు అయింది. దీంతో తరచూ తీవ్రంగా మథనపడేవాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాగులో మునిగిన పీజీ వైద్య విద్యార్థి మృతి



ప్రవీణ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మెడికోలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని సాత్నాల వాగులో ఆదివారం గల్లంతైన మెడికో మృతదేహం సోమవారం లభ్యమైంది. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో పీజీ ప్రథమ సంవత్సరం చదువుతున్న భూక్యా ప్రవీణ్‌కుమార్ తోటి స్నేహితులతో కలిసి ఆదివారం కోటిలింగాలకు వెళ్లిన క్రమంలో సాత్నాల వాగులో గల్లంతైన విషయం తెలిసిందే. ఆదివారం రాత్రి 10 గంటల వరకు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం దక్కలేదు. సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో వాగులోని గుండంలో నుంచి జాలర్లు మృతదేహాన్ని బయటకు తీశారు. కళ్లకు గంతలు కట్టినట్లు ఉండటంతో కుటుంబ సభ్యులు ప్రవీణ్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. విచారణ చేపట్టాలని పోలీసులను కోరారు. అనంతరం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం డైరెక్టర్ చాంబర్ ఎదుట మృతదేహాన్ని ఉంచి మెడికోలు నివాళులర్పించారు. కాగా, మృతుడి స్వగ్రామమైన రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలోని రంగపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఢిల్లీ బిల్లు నెగ్గింది

రాజ్యసభలో ప్రవేశపెట్టిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా

- అనుకూలంగా 131 మంది, వ్యతిరేకంగా 102 మంది ఓటు
- బిల్లు రాజ్యాంగవిరుద్ధమని ప్రతిపక్షాల ఆగ్రహం
- ఢిల్లీలో అవినీతిరహిత పాలన కోసమే బిల్లు తీసుకొచ్చామన్న అమిత్ షా



రాజ్యసభలో మాట్లాడుతున్న అమిత్ షా



వీల్ చైర్లో ఓటింగ్‌కు హాజరైన మన్మోహన్ సింగ్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వ సీనియర్ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై నియంత్రణ కోసం ఉద్దేశించిన 'గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ(అమెండ్‌మెంట్) బిల్లు–2023' సోమవారం రాజ్యసభలో ఆమోదం పొందింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బిల్లును సభలో ప్రవేశపెట్టారు. సుదీర్ఘ చర్చ అనంతరం సభాపతి ఓటింగ్ నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా 131 మంది ఎంపీలు, వ్యతిరేకంగా 102 మంది ఎంపీలు ఓటువేశారు. ఢిల్లీ బిల్లు గత వారమే లోక్‌సభలో ఆమోదం పొందిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఎగువ సభ సైతం ఆమోద ముద్ర వేయడంతో ఇక రాష్ట్రపతి సంతకంతో బిల్లు చట్టరూపం దాల్చనుంది. ప్రస్తుతం రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 238. అధికార ఎన్డీయేతో పాటు ఈ బిల్లు విషయంలో ఆ కూటమికి అనుకూలంగా ఉన్న సభ్యుల సంఖ్య 131. వారంతా బిల్లుకు మద్దతు పలికారు. ఇక విపక్ష 'ఇండియా' కూటమితోపాటు ఇతర విపక్ష సభ్యుల సంఖ్య 104 ఉండగా, బిల్లుకు వ్యతిరకంగా 102 ఓట్లు మాత్రమే వచ్చాయి. మరో ముగ్గురు సభ్యులు ఎటూ తేల్చుకోలేదు. ఓటింగ్‌లో పాల్గొనలేదు.

సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తారా?: విపక్షాలు

ఢిల్లీ బిల్లును రాజ్యసభలో ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీనిపై తొలుత సభలో చర్చను కాంగ్రెస్ సభ్యుడు అభిషేక్ సింఘ్వీ ప్రారంభించారు. బిల్లు రాజ్యాంగవిరుద్ధమని, ప్రజాస్వామ్య వ్యతిరేకమని చెప్పారు. మనమంతా కచ్చితంగా వ్యతిరేకించాలని విపక్షాలకు పిలుపునిచ్చారు. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉన్న ఈ చర్య ఏదో ఒక రోజు మీ దాకా వస్తుంది అంటూ హెచ్చరించారు. సుప్రీంకోర్టు రాజ్యాంగం ధర్మాసనం ఇచ్చిన రెండు తీర్పులకు వ్యతిరేకంగా బిల్లును తీసుకొచ్చారని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. కాంగ్రెస్ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం మాట్లాడుతూ.. ఢిల్లీ బిల్లు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. అలాగే బిల్లుపై చర్చలో ఆమ్ ఆద్మీ పార్టీ, డీఎండీకే, సమాజ్‌వాదీ పార్టీ, భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్), ఆర్జేడీ, సీపీఎం, జేడీ(యూ), కేరళ కాంగ్రెస్(ఎం), సీపీఐ తదితర పార్టీల సభ్యులు మాట్లాడారు. ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను బలవంతంగా లాక్కోవడానికే బిల్లును తీసుకొచ్చారని దుయ్యబట్టారు.

అధికారాలు లాక్కోవడానికి కాదు: అమిత్ షా

బిల్లును తీసుకొచ్చింది కేవలం ఢిల్లీ ప్రజల హక్కులను కాపాడడం కోసమేనని, అంతేతప్ప ఆప్ ప్రభుత్వ అధికారాలను లాక్కోవడానికి కాదని అమిత్ షా తేల్చిచెప్పారు. ఢిల్లీ బిల్లుపై రాజ్యసభలో జరిగిన చర్చకు సమాధానమిచ్చారు. ఇది పూర్తిగా చట్టబద్ధమేనని, సుప్రీంకోర్టు తీర్పును ఏ కోణంలోనూ ఉల్లంఘించడం లేదని వ్యాఖ్యానించారు. ఇతర రాష్ట్రాల కంటే ఢిల్లీ చాలా భిన్నమని తెలియజేశారు. పార్లమెంట్, వివిధ దేశాల రాయబార కార్యాలయాలు, సుప్రీంకోర్టు ఇక్కడే ఉన్నాయని, వివిధ దేశాల అధినేతలు ఢిల్లీని తరచుగా సందర్శిస్తుంటారని, అందుకే ఈ నగరాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా చేసినట్లు పేర్కొన్నారు. పరిమిత అధికారాలున్న అసెంబ్లీతో కూడిన కేంద్ర పాలిత ప్రాంతం ఢిల్లీ అని అన్నారు.

ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి దినం: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ: 'దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చీకటి రోజు. ఢిల్లీ సర్వీసెస్ బిల్లు విషయంలో ఆప్‌నకు తోడుగా నిలిచిన రాజకీయ పార్టీలకు నా కృతజ్ఞతలు. ఢిల్లీలో నాలుగు పర్యాయాలు ఆప్ చేతిలో ఘోరంగా ఓటమిపాలైన బీజేపీ, దొడ్డిదారిన అధికారంలోకి వచ్చేందుకే ఈ బిల్లును తీసుకువచ్చింది. ఆప్ చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో బీజేపీ పోటీ పడలేకపోతోంది. నన్ను ముందుకు వెళ్లకుండా చేయడమే వారి ఏకైక లక్ష్యం. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో ఒక్క సీటును కూడా ప్రజలు బీజేపీకి దక్కనివ్వరు. ఢిల్లీ వ్యవహారాల్లో ప్రధాని మోదీ జోక్యం ఎందుకు చేసుకుంటున్నారు?' అంటూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఒక వీడియో విడుదల చేశారు.

క్లుప్తంగా...

'నీట్' ఏడాదికి రెండుసార్లు నిర్వహించే ప్రతిపాదన లేదు

సాక్షి, న్యూఢిల్లీ: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే నీట్ యూజీని ఏడాదికి రెండుసార్లు నిర్వహించాలన్న ప్రతిపాదనేదీ పరిశీలనలో లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. 2023లో నీట్ యూజీకి 20,38,597 మంది అభ్యర్థులు హాజరయ్యారని సోమవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ లిఖిత పూర్వక సమాధానమిచ్చారు.

కేవీల్లో ఎంపీల కోటా పునరుద్ధరణ యోచన లేదు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు పార్లమెంట్ సభ్యుల కోటాను పునరుద్ధరించే ప్రతిపాదనేదీ లేదని కేంద్రం తెలిపింది. రాజ్యసభలో సోమవారం కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి అన్నపూర్ణాదేవి ఒక ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు. ఈ విద్యా సంస్థలను ప్రాథమికంగా రక్షణ, పారా మిలటరీ, కేంద్ర అటానమస్ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల పిల్లల కోసం ఏర్పాటు చేసినవని వివరించారు. ఎంపీలకు కోటా ఇవ్వడం వల్ల ఒక్కో సెక్షన్‌లో 40 మంది విద్యార్థుల పరిమితి దాటిపోతోందన్నారు. ఇది బోధనపై ప్రభావం చూపుతోందని వివరించారు. గతంలో ఒక్కో ఎంపీ ఒక కేవీలో 10 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించాలని సిఫారసు చేసేందుకు వీలుండేది. మొత్తం 543 మంది లోక్‌సభ, 245 మంది రాజ్యసభ సభ్యులు కలిపి కేవీల్లో ఏటా తమ కోటా కింద 7,880 మంది విద్యార్థుల ప్రవేశాలకు సిఫారసు చేసేవారు.

'బిల్కిస్ బానో' కేసులో దోషులను వదలొద్దు

న్యూఢిల్లీ: బిల్కిస్ బానో గ్యాంగ్‌రేప్ కేసులో దోషులు ఓ వర్గం ప్రజలను వెంటాడి, హత్య చేయడమే లక్ష్యంగా రక్తదాహం ప్రదర్శించారని బాధితురాలి తరఫు న్యాయవాది సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టొద్దని కోరారు. 2002 నాటి గుజరాత్ అల్లర్ల సమయంలో బిల్కిస్ బానో అనే గర్భిణిపై దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అంతేకాకుండా ఆమె కుటుంబంలోని ఏడుగురిని హత్య చేశారు. ఈ కేసులో మొత్తం 11 మంది దోషులకు యావజ్జీవ శిక్షపడగా, గత ఏడాది గుజరాత్ ప్రభుత్వం వారికి క్షమాభిక్ష ప్రసాదించింది. దోషులను జైలు నుంచి విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ బాధితురాలు బిల్కిస్ బానో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

మణిపూర్‌పై సుప్రీంకోర్టు కమిటీ



న్యూఢిల్లీ: మణిపూర్ అల్లర్ల బాధితులకు అందే సహాయం, పునరావాసం, పరిహారంపై పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు ముగ్గురు రిటైర్డు మహిళా న్యాయమూర్తులతో కమిటీ వేసింది. మణిపూర్ అల్లర్లకు సంబంధించి క్రిమినల్ కేసులపై దర్యాప్తు పర్యవేక్షణకు మహారాష్ట్ర పోలీస్ రిటైర్డు చీఫ్ దత్తాత్రేయ పద్సల్గికర్‌ను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో చట్టపాలనపై ప్రజలకు విశ్వాసం కల్పించడానికి ప్రయత్నిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. అక్కడి పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించాలని కూడా అత్యున్నత న్యాయస్థానం నిర్ణయించింది. జమ్మూకశ్మీర్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గీతా మిట్టల్, బాంబే హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ షాలిని పి.జోషి, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆషాలతో కూడిన కమిటీ నేరుగా తనకు నివేదిక సమర్పిస్తుందని తెలిపింది. బాధితులకు సహాయం, పునరావాసం, పరిహారం, దెబ్బతిన్న నివాసాలు, ప్రార్థనా స్థలాలను పునరుద్ధరించడ వంటి వాటిని వీరు సహాయక శిబిరాలకు వెళ్లి, స్వయంగా తెలుసుకుంటారని వివరించింది. మణిపూర్‌లో పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం పేర్కొంది. 'అల్లర్లకు సంబంధించిన 11 కేసులు సీబీఐకి బదిలీ అవుతాయి. మిగతా వాటిని రాష్ట్ర పోలీసులే చూసుకుంటారు.11కే సుల దర్యాప్తులో సీబీఐకి అవసరమైన డిప్యూటీ ఎస్పీ ర్యాంకు అయిదుగురు అధికారులను వివిధ రాష్ట్రాల నుంచి డెప్యుటేషన్‌పై తీసుకుంటారు. వారిని సీబీఐ జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారి మహారాష్ట్ర డీజీపీ దత్తాత్రేయ పద్సల్గికర్ పర్యవేక్షిస్తారు'అని ధర్మాసనం తెలిపింది. సీబీఐకి ఇవ్వగా మిగిలిన కేసులను రాష్ట్ర పోలీసులతో కూడిన 42 సిట్‌లు దర్యాప్తు చేస్తాయని పేర్కొంది. ఈ సిట్‌లకు వేరే రాష్ట్రాలకు చెందిన ఆరుగురు డీఐజీ స్థాయి అధికారులు సారథ్యం వహిస్తారని వివరించింది. విచారణకు మణిపూర్ చీఫ్ సెక్రటరీ వినీత్ జోషి, రాష్ట్ర డీజీపీ రాజీవ్ సింగ్ హాజరయ్యారు. మణిపూర్‌లో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, యంత్రాంగం విఫలమైందని ఈనెల ఒకటిన కోర్టు వ్యాఖ్యానించింది. మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై ఆలస్యంగా స్పందించిన రాష్ట్ర డీజీపీ 7న స్వయంగా హాజరై సమాధానం ఇవ్వాలంటూ ఆదేశించిన విషయం తెలిసిందే.

ఎంపీగా లోక్‌సభలోకి రాహుల్

సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫికేషన్

రాహుల్‌కు స్వాగతం పలికిన 'ఇండియా' కూటమి ఎంపీలు • కాంగ్రెస్ పార్టీలో నూతనోత్సాహం



లోక్‌సభలో ఆసీనులైన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ దాదాపు నాలుగు నెలల తర్వాత లోక్‌సభలో ఎంపీ హోదాలో అడుగుపెట్టారు. పరువు నష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్ష పడడం వల్ల కోల్పోయిన లోక్‌సభ సభ్యత్వం సుప్రీంకోర్టు ఉత్తర్వులతో తిరిగి వచ్చింది. రాహుల్ సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ సమాచారం తెలిసిన అనంతరం రాహుల్ పార్లమెంట్‌కు చేరుకున్నారు. తొలుత గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పించి మధ్యాహ్నం ఎంపీగా లోక్‌సభలోకి అడుగుపెట్టారు. ఆయన వచ్చిన కొద్దిసేపటికే సభ వాయిదా పడింది. పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్‌కు కాంగ్రెస్, ఇతర విపక్షాల ఎంపీలు సాదర స్వాగతం పలికారు. మిఠాయిలు పంచుకున్నారు. మొత్తానికి రాహుల్ రాక సందర్భంగా పార్లమెంట్ ఆవరణలో పండుగ వాతావరణం కనిపించింది. కేంద్ర ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై త్వరలో పార్లమెంట్‌లో చర్చ, ఓటింగ్ జరుగనున్న నేపథ్యంలో రాహుల్ మళ్లీ ఎంపీగా సభకు రావడం తమకు లాభిస్తుందని కాంగ్రెస్‌తోపాటు విపక్ష 'ఇండియా' కూటమి ఆశాభావం వ్యక్తం చేసింది. రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది.

'ఇండియా' కూటమిలో హర్షం

రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించడాన్ని స్వాగతిస్తున్నామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. కేరళలోని వయనాడ్ నియోజకవర్గంతోపాటు దేశ ప్రజలకు ఇదొక ఊరట అని పేర్కొన్నారు. బీజేపీ, మోదీ ప్రభుత్వం పరిపాలనపై దృష్టి పెట్టకుండా ప్రతతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకొని వేధిస్తున్నాయని మండిపడ్డారు. రాహుల్ రాక పట్ల విపక్ష 'ఇండియా' కూటమిలోని పలు పార్టీల అగ్రనేతలు హర్షం వ్యక్తం చేశారు.

రాహుల్ దోష విముక్తుడు కాలేదు: బీజేపీ

రాహుల్ గాంధీ దోషం నుంచి ఇంకా పూర్తిగా విముక్తుడు కాలేదని బీజేపీ ఎంపీ సుశీల్ కుమార్ మోదీ పేర్కొన్నారు. పరువు నష్టం కేసులో రాహుల్‌కు విధించిన రెండేళ్ల జైలు శిక్షపై సుప్రీంకోర్టు కేవలం స్టే మాత్రమే ఇచ్చిందని గుర్తుచేశారు. కేసు గుజరాత్ కోర్టులో పెండింగ్‌లో ఉందని చెప్పారు. రాహుల్ వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పుపట్టిందని సుశీల్ కుమార్ మోదీ వివరించారు. ఆయన మళ్లీ లోక్‌సభకు వచ్చినప్పటికీ ప్రజలకు గానీ, కాంగ్రెస్ పార్టీకి గానీ ఒరిగేదేమీ లేదని ఎద్దేవా చేశారు.

అవిశ్వాసంపై నేడు చర్చ

కేంద్రంపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం లోక్‌సభలో చర్చ ప్రారంభం కానుంది. రెండు రోజులపాటు చర్చ జరుగుతుందని అంచనా. అనంతరం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చర్చకు సమాధానమిస్తారు.

పంచాయతీ రాజ్ ప్రాముఖ్యాన్ని కాంగ్రెస్ అర్థం చేసుకోలేదు

అందుకే గ్రామాల్లో వెనుకబాటు: మోదీ



ఢిల్లీలో చేనేత ఎగ్జిబిషన్‌లో వస్త్రాన్ని పరిశీలిస్తున్న ప్రధాని మోదీ

చండీగఢ్: దేశానికి పంచాయతీ రాజ్ వ్యవస్థ ఎంత అవసరమైందో స్వాతంత్ర్యం వచ్చిన నాలుగు దశాబ్దాల తర్వాత కూడా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అర్థం చేసుకోలేకపోయిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థల బలోపేతానికి అప్పటి ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లా పంచాయతీ వ్యవస్థను సైతం కాంగ్రెస్ పాలకులు గాలికి వదిలేశారని మండిపడ్డారు. 'ఫలితంగా దేశ జనాభాలో గ్రామాల్లో నివసించే మూడింట రెండొంతుల మంది కనీస సౌకర్యాలైన రహదారులు, విద్యుత్, మంచినీరు, పక్కా ఇళ్ల వంటి వాటికి కూడా నోచుకోలేకపోయారు. ఈ నిర్లక్ష్యం ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించిన ఏడు దశాబ్దాలకు కూడా దేశంలోని సుమారు 18 వేల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం సమకూరలేదు' అని ఆయన అన్నారు. ఇందుకు జమ్మూకశ్మీరే ప్రత్యక్ష సాక్ష్యమని చెప్పారు. ఫరీదాబాద్‌లోని సూరజ్‌కుండ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న 'హరియాణా క్షేత్రీయ పంచాయతీ రాజ్ పరిషత్' రెండు రోజుల వర్క్‌షాప్‌ను సోమవారం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించి ప్రసంగించారు. అమృత్ కాల్ తీర్మానాల సాధనకు, అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యం దిశగా నేడు భారత్ ఐక్యంగా ముందుకు సాగుతోందని ప్రధాని చెప్పారు. ఆగస్టు 9వ తేదీన క్విట్ ఇండియా ఉద్యమ వార్షికోత్సవం రోజున యావత్ దేశం 'అవినీతి..ఆశ్రిత పక్షపాతం.. బుజ్జగింపు రాజకీయాలు క్విట్ ఇండియా' అని ఐక్యంగా నినదించాలన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రతి ఇంటికీ చేరేందుకు జిల్లా పరిషత్ సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతిపక్ష కూటమిపై ప్రధాని విసుర్లు

ప్రతిపక్ష 'ఇండియా'కూటమి భారత్ ప్రగతికి ప్రతిబంధకంగా, ప్రమాదకరంగా మారిందని ప్రధాని అన్నారు. ఢిల్లీ ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో సోమవారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవాలనుద్దేశించి ప్రధాని మాట్లాడారు.

ట్రాఫిక్‌తో ఏటా బెంగళూరుకు రూ.20 వేల కోట్ల నష్టం

అధ్యయనం వెల్లడి



బెంగళూరు: తీవ్రమైన ట్రాఫిక్ సమస్యల కారణంగా బెంగళూరు నగరం ఏటా రూ.20 వేల కోట్ల మేర నష్టపోతోందని ఓ అధ్యయనంలో తేలింది. 'నగర ఉత్పాదకత, ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫలితంగా ఉత్పాదకత గణనీయంగా తగ్గి, చిన్న, మధ్య తరహా సంస్థల రవాణా అవసరాలు ఆలస్యమవుతున్నాయి. ఇందుకు కాలుష్య సమస్య కూడా తోడవుతోంది'అని ఆ అధ్యయనం తెలిపింది.చాలా ఏళ్లగా బెంగళూరు నగరం తీవ్ర ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతోంది. నగర ప్రణాళిక, మౌలిక సదుపాయాలు సరిగ్గానే ఉన్నప్పటికీ నష్టాలను చవిచూస్తోందని ట్రాఫిక్ నిపుణుడొకరు చేపట్టిన ఈ అధ్యయనం పేర్కొంది. ట్రాఫిక్ జామ్ సమస్య కారణంగా ఎక్కువగా నష్టపోయేది బెంగళూరుకు ఆర్థిక దన్నుగా నిలుస్తున్న ఐటీ రంగమేనని తేల్చింది. ఉద్యోగులు తమ విలువైన సమయాన్ని ట్రాఫిక్ సమస్యలతోనే గడుపుతున్నారని కూడా వివరించింది. ట్రాఫిక్ సంబంధ కారణంగా ఒక్క ఐటీ రంగమే సుమారు రూ.7 వేల కోట్ల మేర ఏటా నష్టపోతోందని తెలిపింది. పౌరులు కూడా నాణ్యమైన జీవితాన్ని గడపలేకపోతున్నారని పేర్కొంది. అధ్యయనంలో భాగంగా రోడ్ ప్లానింగ్, ఫ్లై ఓవర్లు, ట్రాఫిక్ నిర్వహణ, మౌలిక సదుపాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు నిపుణులు పలు సూచనలు చేశారు. ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచడం, కొన్ని ప్రాంతాల్లో ప్రయాణించేందుకు ఎక్కువ చార్జీలు వసూలు చేయడం(కంజెషన్ ప్రైసింగ్), కార్‌పూలింగ్ వంటివి ఇందులో ఉన్నాయి. కెమెరాలు, సెన్సార్ వ్యవస్థలను నెలకొల్పి, ఎక్కువ మంది ట్రాఫిక్ సిబ్బందిని నియమించి నిబంధనలను అమలు చేయడం, మెట్రోలు, ప్రభుత్వ బస్సు సర్వీసులు నడిపేందుకు భూగర్భమార్గాల ఏర్పాటు కూడా ఇందులో ఉన్నాయి. ప్రభుత్వం, పౌర సంస్థలు, పౌరులు కలిసి కట్టుగా పనిచేసి రహదారులపై భారం తగ్గించొచ్చని తెలిపింది.

'డిజిటల్ వ్యక్తిగత డేటా బిల్లు'కు లోక్‌సభ ఓకే

న్యూఢిల్లీ: మణిపూర్ అంశంపై ప్రతిపక్షాలు లోక్‌సభలో సోమవారం సైతం ఆందోళన కొనసాగించాయి. ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాయి. విపక్షాల నినదాలు, నిరసనల కారణంగా సభను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. కీలకమైన 'డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ బిల్లు'ను కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మణిపూర్ అంశంపై ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళన మధ్యే మూజువాణి ఓటుతో ఈ బిల్లును సభలో ఆమోదించారు. భారత పౌరుల వ్యక్తిగత గోప్యతను కాపాడేందుకు బిల్లును తీసుకొచ్చినట్లు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పౌరుల వ్యక్తిగత డేటాను దుర్వినియోగం చేస్తే సంబంధిత సంస్థలకు రూ.250 కోట్ల వరకు జరిమానా విధించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ బిల్లుపై జరిగిన చర్చలో ప్రతిపక్షాలు పాల్గొనకపోవడం విచారకరమని అన్నారు. గోప్యత హక్కు అనేది ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు ఆరేళ్ల క్రితం తేల్చిచెప్పింది. వ్యక్తిగత డేటా దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

చంద్రయాన్-3 కక్ష్య తగ్గింపు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) గత నెల 14న ప్రయోగించిన చంద్రయాన్–3 మిషన్ ప్రస్తుతం లూనార్ ఆర్బిట్ (చంద్రుడి కక్ష్య)లో చంద్రుడికి దగ్గరగా 170 కిలోమీటర్లు, దూరంగా 4,313 కి.మీ. దీర్ఘ వృత్తాకార కక్ష్యలో పరిభ్రమిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానంతో ఏకంగా చంద్రుడ్ని అత్యంత దగ్గరగా వీడియో తీసి భూ నియంత్రిత కేంద్రానికి పంపింది. ఆదివారం రాత్రి చంద్రునిపై మొదటి అర్బిట్ రైజింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఆర్బిట్ రైజింగ్ చేసే క్రమంలో చంద్రయాన్–3 మిషన్ చంద్రుడి చుట్టూ తిరుగుతూ ప్రొపల్షన్ మాడ్యూల్‌లో అమర్చిన కెమెరాలు చంద్రుడికి దగ్గరగా వెళ్లినపుడు 45 సెకండ్లపాటు తీసిన వీడియోను ఇస్రో సోమవారం విడుదల చేసింది. లూనార్ ఆర్బిట్‌లో కక్ష్య దూరాన్ని తగ్గిస్తూ 23వ తేదీ నాటికి చంద్రుడికి 100 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలోకి చంద్రుడి చెంతకు తీసుకొస్తారు.

చైనా తొలి చక్రవర్తి సమాధికి పాదరస రక్షణ!

బీజింగ్: చైనాను పాలించిన మొట్టమొదటి చక్రవరి కిన్ షీ హువాంగ్. ఆయన సమాధికి పాదరసం(మెర్క్యూరీ)తో రక్షణ కల్పించినట్లు తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. ద్రవ రూపంలో ఉండే లోహమే పాదరసం. ఇది విషపూరితమైంది. కిన్ క్రీస్తుపూర్వం 221 నుంచి 210 దాకా.. పదేళ్లపాటు డ్రాగన్ దేశాన్ని శాసించాడు. కిన్ సమాధిని కట్టుదిట్టంగా నిర్మించారు. షాన్‌షీ ప్రావిన్స్‌లో 1974లో రైతులు పొలం దున్నుతుండగా కిన్ షీ హువాంగ్ సమాధి బయటపడింది. చక్రవర్తి సమాధిని తెరిచే చూస్తే వినాశనం తప్పదన్న ప్రచారం బాగా వ్యాప్తిలో ఉంది. దీంతో, తెరిచే సాహసం చేయలేకపోయారు. సమాధికి సమీపంలో మట్టితో తయారు చేసిన సైనికులు, ఆయుధాలు, గుర్రాల విగ్రహాలు భారీగా బయటపడ్డాయి. మరణానంతరం కూడా చక్రవర్తిని కాపాడడానికి ఈ 'టెర్రకోట ఆర్మీ'ని ఏర్పాటుచేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, చక్రవరి సమాధి చుట్టూ మెర్క్యూరీ లోహం స్వేచ్ఛగా కదులుతున్నట్లు పరిశోధకులు ఇటీవలే తేల్చారు. సమాధిని ఎవరూ తాకకుండా ఇలాంటి ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు.

గ్రహ శకలాలతో భూమికి సౌర కవచం!


వాషింగ్టన్: భూగోళంపై ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. భూమిపై జీవులు భద్రంగా మనుగడ సాగించే పరిస్థితులు కనుమరుగవుతున్నాయి. దీని పరిష్కారానికి నడుం బిగించారు. అధిక ఉష్ణోగ్రతల నుంచి సౌర కవచం(సోలార్ షీల్డ్)తో పుడమికి రక్షణ కల్పించవచ్చంటున్నారు. దీనికి స్పేస్ బేస్డ్ సోలార్ రేడియేషన్ మేనేజ్‌మెంట్ షీల్డ్ (ఎస్ఆర్ఎం) అని పేరుపెట్టారు. అమెరికాలోని 'యూనివర్సిటీ ఆఫ్ హవాయ్' ఈ ప్రయోగాన్ని తెరపైకి తెచ్చింది. భూమికి, సూర్యుడికి మధ్య భారీ పరిమాణంలోని గ్రహ శకలాలను గొడుగులా వాడి సూర్యకాంతి నేరుగా భూమిని తాకకుండా నిరోధించవచ్చని తేల్చారు. అయితే, సౌర కవచం కోసం గ్రహ శకలాలను (ఆస్టరాయిడ్లు) ఒకచోటుకి చేర్చడం పెద్ద సవాలేనని సైంటిస్టులు అంటున్నారు. ఈ పరిశోధన ఫలితాలను 'ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (పీఎన్ఏఎస్)'లో ఇటీవలే ప్రచురించారు.

కేంద్రం ప్రయత్నాలను ప్రశ్నించలేం

చీతాల మృతిపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కులో ఈ ఏడాది 9 చీతాల మృతి విషయంలో కేంద్రం ఇచ్చిన వివరణపై సుప్రీంకోర్టు సంతృప్తి వ్యక్తం చేసింది. దేశంలో చీతాల సంతతిని అభివృద్ధి చేసేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలపై అనుమానాలకు అవకాశం లేదని పేర్కొంది. 1952 తర్వాత దేశంలో చీతాల సంతతి అంతరించిపోయింది. దీంతో, తిరిగి వాటి సంతతిని పెంచే ఉద్దేశంతో గత ఏడాది సెప్టెంబర్, ఈ ఏడాది ఫిబ్రవరిల్లో నమీబియా, దక్షిణాఫ్రికాల నుంచి 20 చీతాలను కునోకు తీసుకువచ్చింది. ఇక్కడ మరో నాలుగు కూనలు జన్మించాయి. వీటిలో మొత్తం 9 మృత్యువాతపడ్డాయి. దీనిపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం పిటిషన్ వేసింది. విదేశాల నుంచి తీసుకువచ్చిన చీతాలను ఇక్కడి వాతావరణ పరిస్థితుల్లో మనుగడ సాగించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపింది.

ప్రియుడిపై కోపంతో హైటెన్షన్ టవరెక్కిన బాలిక



రాయ్‌పూర్: ప్రియుడిపై కోపంతో ఓ బాలిక 80 అడుగుల ఎత్తయిన హై టెన్షన్ విద్యుత్ టవరెక్కింది. బుజ్జగించేందుకు ఆ బాయ్‌ఫ్రెండ్ కూడా ఆమె వెనుకే టవర్‌పైకి చేరుకున్నాడు. అయితే, వారిద్దరూ ఒకరి వెనుక మరొకరు టవర్ చివరిదాకా వెళ్లడం ఉద్రిక్తతకు దారితీసింది. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గౌరెలా పెండ్రా మార్వాహి జిల్లా పెండ్రా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఫోన్ కాల్ విషయమై ఓ బాలిక తన ప్రియుడితో గొడవపడింది. కోపంతో దగ్గర్లోని 80 అడుగుల ఎత్తున్న హైటెన్షన్ విద్యుత్ టవరెక్కింది. ఆమె ప్రియుడు కూడా ఆమె వెనుకే టవరెక్కాడు. బుజ్జగించి కిందికి దించే ప్రయత్నం చేశాడు. వినకుండా ఆమె చివరిదాకా ఎక్కింది. అతడు కూడా ఆమెను అనుసరించాడు. వీరి విషయం కుటుంబసభ్యులకు, గ్రామస్తులకు చేరింది. వారంతా టవర్ చుట్టూ పెద్ద సంఖ్యలో చేరి ఇద్దరికీ నచ్చజెప్పే ప్రయత్నాల్లో ఉండగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. వారితో మాట్లాడి అతికష్టమ్మీద సురక్షితంగా ఇద్దరూ కిందికి దిగేలా చేయగలిగారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ఢిల్లీ ఎయిమ్స్‌లో అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ప్రఖ్యాత ఎయిమ్స్ (ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో విభాగంలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రధాన భవనంలోని రెండో ఫ్లోర్‌లో ఓల్డ్ ఓపీడీ విభాగంలో ఉదయం మంటలు చెలరేగాయి. మంటలను ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ సిబ్బంది వెంటనే అదుపు చేశారు. మంటలు చెలరేగిన ఎండోస్కోపీ విభాగంలో 80 మందిని నుంచి ఖాళీ చేయించారు. ఏబీ 2 వార్డులోని ఐసీయూలో ఉన్న ఆరుగురు సహా 31 మందిని ఇతర భవనాల్లోకి తరలించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని పీడియాట్రిక్, ఎమర్జెన్సీ వార్డుల్లో 70 మందిని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో జాయిన్ చేశారు. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. కారణాలపై దర్యాప్తు జరుగుతోంది.



ఇండోనేసియా సంప్రదాయక వెదురు వాద్యపరికరం 'ఆంగ్లాంగ్'ను ఒకేసారి 15,110 మంది వాయించి నూతన గిన్నిస్ ప్రపంచ రికార్డును సృష్టిస్తున్న దృశ్యం. జకార్తా నగరంలోని గెలోరా బంగ్ స్టేడియంలో తీసిందీ ఫొటో.

నూహ్‌లో కూల్చివేతలు ఆపండి

అధికారులకు పంజాబ్–హరియాణా హైకోర్టు ఆదేశం

చండీగఢ్/గురుగ్రామ్: హరియాణాలోని నూహ్ జిల్లాలో మూడు రోజులుగా కొనసాగుతున్న అక్రమ కట్టడాల కూల్చివేతలను వెంటనే ఆపేయాలని పంజాబ్ హరియాణా హైకోర్టు అధికారులను ఆదేశించింది. కూల్చివేతలపై కోర్టు సుమోటోగా విచారణ చేపట్టి ఈ మేరకు సోమవారం ఉత్తర్వులిచ్చింది. గత వారం జరిగిన మత కలహాలకు ముందు దుండగులు రాళ్లు రువ్వినట్లుగా అనుమానిస్తున్న హోటల్ సహా కొన్ని భవనాలను అధికారులు బుల్‌డోజర్లతో కూల్చి వేశారు. జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల్లోగా 37 ప్రాంతాల్లోని 57.5 ఎకరాల్లోని ప్రభుత్వ జాగాల్లో ఉన్న 162 శాశ్వత, 591 తాత్కాలిక నిర్మాణాలను నేలమట్టం చేశామన్నారు. ఇలా ఉండగా, గురుగ్రామ్‌లోని ఖండ్సాలో ఉన్న ప్రార్థనాస్థలానికి గుర్తు తెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి నిప్పుపెట్టారు. స్థానికులు వెంటనే మంటలను ఆర్పివేశారు. పూజా సామగ్రి కాలిందని పూజారి తెలిపారు. ఈ మేరకు గుర్తు తెలియని వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోహ్నాలో ఘటనలకు కారకులుగా అనుమానిస్తున్న 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు గురుగ్రామ్ పోలీసులు చెప్పారు.

సాక్షి
కరీంనగర్
మంగళవారం । 8 । ఆగస్టు । 2023

కేటీఆర్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా నేతలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు చాలాకాలం తర్వాత ఒకేవేదిక మీదికి వచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో ఐటీ మినిస్టర్ కేటీఆర్‌ను కలిశారు. అభివృద్ధి పనులు, వివిధ అంశాలపై చర్చించారు. చిత్రంలో మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు సతీశ్ బాబు, సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, రమేశ్ బాబు, దాసరి మనోహర్‌రెడ్డి, సంజయ్ కుమార్, కోరుకంటి చందర్, ఎమ్మెల్సీలు పాడి కౌశిక్ రెడ్డి, భానుప్రసాద్, రమణ తదితరులు ఉన్నారు.

– సాక్షి ప్రతినిధి, కరీంనగర్



న్యూస్‌రీల్

పంద్రాగస్టు కోసం ఏర్పాట్లు



కరీంనగర్ అర్బన్: భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాన్ఫరెన్స్‌హాల్‌లో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని పోలీస్‌పరేడ్‌గ్రౌండ్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చేవారికి సీటింగ్ అరెంజ్‌మెంట్లు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారిని, అర్బన్ తహసీల్దార్‌ను ఆదేశించారు. సంక్షేమ పథకాలతో కూడినస్టాళ్లు, శకటాలను ఏర్పాటు చేయాలని సూచించారు. డీఆర్డీవో శ్రీలత, డీపీవో వీరబుచ్చయ్య, సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు నేతానియల్, జిల్లా పౌరసరఫరాల అధికారి సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలో గడీలపాలనకు చరమగీతం పాడడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఏఐసీసీ కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రిస్టోఫర్ తిలక్ అన్నారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశమంతా కర్ణాటక తరహా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం ప్రారంభం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ కుటుంబం కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా మార్చుకున్నారని అన్నారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వం పునరుద్ధరించడం ప్రజాస్వామ్య విజయంగా భావిస్తూ... నియంతృత్వంగా పనిచేస్తే ఇలాంటి జవాబు వస్తుందని బీజేపీ గమనించాలన్నారు. కరీంనగర్, సిరిసిల్ల డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్, నాయకులు దొమ్మాటి సాంబయ్య, అలిగి రెడ్డి ప్రవీణ్‌రెడ్డి, మేడిపల్లి సత్యం, బల్మూరు వెంకట్, కేకే మహేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మేనేని రోహిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ ఇంద్రధనుష్' వ్యాక్సినేషన్



కరీంనగర్‌టౌన్: మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్యారోగ్యశాఖ అధికారులు వ్యాక్సినేషన్ నిర్వహించారు. గతంలో టీకాలు వేసుకోని లేదా డ్రాప్ అవుట్ గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలందరికీ టీకాలు వేశారు. ఇందులో ప్రతీరౌండులో ఆరు రోజులు చొప్పున మూడు రౌండ్లుగా రెగ్యులర్‌గా ఇవ్వబడే వాక్సినేషన్‌తో సహా మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం ద్వారా ఆగస్టు 7నుంచి 12 వరకు మొదటి రౌండు, సెప్టెంబరు 11 నుంచి 16 వరకు రెండో రౌండ్, అక్టోబర్ 9 నుంచి 14 మూడవరౌండ్‌గా వ్యాక్సిన్ వేయనున్నారు.

ఇంటివద్దకే జాతీయ జెండాలు

విద్యానగర్(కరీంనగర్): 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం స్ఫూర్తితో ఈ ఏడాది కూడా పోస్టల్‌శాఖ అధ్వర్యంలో ఇంటివద్దకే జాతీయజెండాలు అందించనున్నట్లు కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయజెండాను రూ.25కే అందించనున్నట్లు తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు బుక్‌చేసుకునే అవకాశం కల్పించామని, జెండాల డెలివరీలో ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా సూచించిన చిరునామాలో ఈ నెల 13వ తేదీలోగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో ఈనెల 14 వరకు పోస్టాఫీసుల్లో అమ్ముతారని సూచించారు.

మద్యం దుకాణాలకు 13 దరఖాస్తులు

కరీంనగర్‌క్రైం: జిల్లావ్యాప్తంగా కొత్త మద్యం దుకాణాల టెండర్లకు సోమవారం వరకు 13దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు కరీంనగర్ అర్బన్‌లో 08, రూరల్‌లో 01, తిమ్మాపూర్‌లో 03, జమ్మికుంటకు 01 దరఖాస్తు వచ్చినట్లు పేర్కొన్నారు.

దెబ్బతిన్న పల్లెరోడ్లు

- భారీ వర్షాలకు ఉమ్మడి జిల్లాలో రహదారులు ధ్వంసం
- కరీంనగర్ జిల్లాలోనే ఎక్కువ
- నష్టం అంచనాలు రెడీచేసిన పీఆర్ విభాగం
- మరమ్మతులకు దాదాపు రూ.188 కోట్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు ధ్వంసమయ్యాయి. మునుపెన్నడూ లేనిరీతిలో కురిసిన వర్షాలకు చాలాచోట్ల రోడ్లు కొట్టుకుపోయాయి. కల్వర్టులు ధ్వంసమయ్యాయి. వరద ఉధృతికి అనేక ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురయ్యాయి. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్లలో పంచాయతీరాజ్ రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. పెద్దపల్లి జిల్లాలో రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈమేరకు పంచాయతీరాజ్ అధికారులు నష్టతీవ్రతను అంచనా వేసేందుకు సబ్ డివిజన్లలో రోడ్ల పరిస్థితిపై సర్వే నిర్వహించారు. జూలై నెలాఖరు నాటికి ఈ రోడ్ల దయనీయ పరిస్థితిపై అధికారులు ఒక అంచనాకు వచ్చారు.

కరీంనగర్‌లో ఎక్కువ..

కరీంనగర్ రీజియన్‌లో పంచాయతీరాజ్ అధికారులు రోడ్ల నష్టంపై ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. దీని ప్రకారం.. కరీంనగర్‌లో గరిష్ఠంగా 406.77 కి.మీల రోడ్లు, జగిత్యాలలో 298.36 కి.మీల మేర, రాజన్న సిరిసిల్ల 124.43 కి.మీ, పెద్దపల్లిలో కనిష్ఠంగా 42.46 కి.మీ మేర రోడ్లు ఉన్నాయి. ఇందులో కరీంనగర్‌లో 163 కి.మీ, జగిత్యాలలో 1.90 కి.మీ మేర, పెద్దపల్లిలో 0.41 కిమీ పాటు, రాజన్నసిరిసిల్లలో 7.43 కి.మీ మేర దెబ్బతిన్నాయి. ఇందులో కొన్ని రోడ్లు రోడ్ల ఉపరితలం కొట్టుకుపోగా, కొన్నిచోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయి. మరికొన్ని చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. వీటికి వెంటనే మరమ్మతులు నిర్వహించాలని, అందుకు ఎంతమేరకు ఖర్చవుతుందన్న వివరాలపై అధికారులు తాత్కాలిక నివేదికను రూపొందించారని సమాచారం. దీని ప్రకారం.. జిల్లాలో మొత్తం మీద సుమారు 869 కి.మీలకు గాను 173.70 కి.మీ మేర రహదారులు దెబ్బతిన్నాయి.

రూ.188 కోట్లు కావాలి..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కరీంనగర్ రీజియన్‌లోని రహదారులకే తక్షణమే మరమ్మతులు అవసరం. వీటిని మరమ్మతులకు దాదాపు రూ.188.88 కోట్ల నిధులు అవసరమవుతాయని నివేదిక రూపొందించారు. ఈ ప్రతిపాదనలకు ఇంకా అధికారుల ఆమోద ముద్ర పడాల్సి ఉంది. ఆ తరువాత ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే.. టెండర్లు పిలిచి మరమ్మతులు ప్రారంభించనున్నారు. వర్షాలు కురిసిన సమయంలో వాగులు వంకలు ఆనుకుని ఉన్నగ్రామాల్లో రెండు మూడురోజులపాటు రాకపోకలు స్తంభించాయి. ఇలాంటి గ్రామాలకు మరమ్మతుల్లో తొలిప్రాధాన్యం ఇవ్వనున్నారు. ముఖ్యంగా పల్లెలను పట్టణాలను కలిపేందుకు కీలకమైన.. బ్రిడ్జిలు చాలాచోట్ల ధ్వంసమయ్యాయి. వీటికి తక్షణమే మరమ్మతులు అవసరం. వీటిని కూడా ప్రాధాన్యం జాబితాలో చేర్చారు.


గంగాధర- లక్ష్మీదేవిపల్లి మధ్య తెగిపోయిన రోడ్డు

జిల్లా	మొత్తం రోడ్లు (కి.మీ)	ధ్వంసమైన కి.మీలు	నిధులు (రూ.లక్షల్లో)
కరీంనగర్	406.77	163.96	7,306.70
జగిత్యాల	298.36	1.90	8,000.00
పెద్దపల్లి	42.46	0.41	531.50
రాజన్నసిరిసిల్ల	121.43	7.43	3,050.35


ఇల్లంతకుంట మండలం నర్సక్కపేట -జవారిపేట గ్రామాల మధ్య తెగిన కాజ్‌వే


కోతకు గురైన సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల ఆలయానికి వెళ్లే దారి


జగిత్యాల జిల్లా రాఘవపేట-చిట్టాపూర్ మధ్య తెగిన రోడ్డు

ప్రతీ నియోజకవర్గానికి 3వేల ఇళ్లు

- వీసీలో సీఎస్ శాంతికుమారి

కరీంనగర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని సీఎస్ శాంతికుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి హరితహారం, గృహలక్ష్మి, ఇంటి పట్టాల పంపిణీ, జీఓ 59, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, బీసీ, మైనారిటీలకు రూ.లక్ష ఆర్థికసాయం, గొర్రెల పంపిణీ, దళితబంధు అంశాలపై వీసీలో సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ.. గృహలక్ష్మి ద్వారా ప్రతీ నియోజకవర్గానికి మూడువేల ఇళ్లను కేటాయించాలని తెలిపారు. సెప్టెంబర్ 15నాటికి హరితహారం లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో గొర్రెలయూనిట్లు పంపిణీ చేయాలని తెలిపారు. బీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష సాయంకింద ఆగస్టు 10లోపు చెక్కుల పంపిణీ చేయాలని సూచించారు. గృహలక్ష్మి పథకానికి తహసీల్దార్, మున్సిపల్, కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఆగస్టు 10వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్ గోపి, అధికారులు

ప్రభుత్వ ఉత్తర్వు 58 కింద ఉచితంగా పేదలకు క్రమబద్ధీకరణ పూర్తిచేశామని, ప్రభుత్వ ఉత్తర్వు 59కింద పెండింగ్ రుసుం మూడువారాల్లో వసూలు చేయాలని తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు వ్యవసాయేతర నోటరీ భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అనుమతించిందని అన్నారు. 125గజాల కన్నా తక్కువ ఉన్న నోటరీ భూములను స్టాంప్‌డ్యూటీ లేకుండా క్రమబద్ధీకరిస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ బి.గోపి, అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మికిరణ్, జిల్లా అటవీశాఖ అధికారి బాలామణి, డీఆర్‌డీవో శ్రీలత, డీపీవో వీరబుచ్చయ్య, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్ పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూఎస్‌పీసీ నాయకులు

- ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: యూఎస్‌పీసీ

కరీంనగర్: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికి చేపడుతున్న ఉద్యమ కార్యచరణ పోస్టర్లను జిల్లాకేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్‌లో ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఎనిమిదేళ్లుగా పదోన్నతులు, ఆరేళ్లుగా బదిలీలు నిర్వహించలేదని అన్నారు. డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ఆడిట్ కమిటీ కన్వీనర్ డి.ఏసురెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టడంలో ప్రభుత్వ వైఖరిలో స్పష్టత లేదని అన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలన్నారు. యూఎస్పీసీ మూడుదశల పోరాటకార్యక్రమంలో భాగంగా ఈనెల 12న జిల్లాకేంద్రంలో జరిగే ర్యాలీ, ధర్నా, సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యూఎస్పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు ముక్కల కుమార్, పోరెడ్డి దామోదర్‌రెడ్డి, యాంసాని ఉమారాణి, కేఎఫ్.జావిద్, ఆర్.చంద్రశేఖర్, తూముల తిరుపతి, కానిగంటి రాజమౌళి పాల్గొన్నారు.

రెవెన్యూ అక్రమాలపై ఆరా

సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్ కార్పొరేషన్: నగర పాలకసంస్థ పరిధిలోని రెవెన్యూ విభాగంలో జరుగుతున్న అక్రమాలపై ఎట్టకేలకు ఉన్నతాధికారులు దృష్టి సారించారు. 'ముడుపులిస్తేనే మ్యూటేషన్' పేరిట సోమవారం 'సాక్షి'లో వచ్చిన కథనం నగరపాలకసంస్థలో కలకలం సృష్టించింది. ఈ కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. కథనంలో పేర్కొన్న ఉదంతాలతో పాటు, ఆరోపణలపై విచారణ చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. మ్యుటేషన్ కోసం నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్న బోయవాడకు చెందిన మహిళ ఫైల్‌ను అధికారులు పరిశీలించారు. ఆమె ఫైల్ ప్రాసెస్‌లో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఆమెకు న్యాయం చేస్తామన్నారు.

విచారణ చేపడతాం

నగరపాలకసంస్థ రెవెన్యూ విభాగంపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపడుతాం. బోయవాడకు చెందిన మహిళ ఫైల్ ప్రాసెస్‌లో ఉంది. వల్లంపహాడ్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిజాలు నిర్ధారిస్తాం. ఇక ఒకే స్థలానికి రెండు ఇంటి నిర్మాణ అనుమతుల వ్యవహారంపై టౌన్‌ప్లానింగ్ విభాగానికి సిఫారసు చేస్తాం.

– స్వరూపరాణి, డిప్యూటీ కమిషనర్

బువ్వ పెడ్తలేరు.. భూమి ఇస్తలేరు

రెండేళ్లుగా తిరుగుతున్నా



నా భర్త పేరున ఉన్న భూమిని నా పేరు చేయండని రెండున్నరేళ్లుగా తిరుగుతున్నా. నోటీసులు పంపుతుర్రు.. వాయిదాలు వేస్తుర్రు. కొత్తపల్లి మండలం బావుపేట మా ఊరు. నా భర్త గంగారాం ఏడు ఎకరాలకు పైగా భూమిని సంపాదించిండు. దాన్ని నా పెద్ద కొడుకు రాజయ్య, చిన్న కొడుకు మరణించగా కోడలు పద్మ సాగు చేసుకుంటున్నారు. ఇప్పటిదాకా నా పెద్ద కొడుకే నన్ను చూసుకున్నడు. లక్షలు ఖర్చు పెట్టిండు. చిన్న కోడలు బుక్కెడు బువ్వ పెట్టింది లేదు. నా భర్త భూమిని నా పేరున చేస్తే నేనే ఎలాగొలా బతుకుతా.

– పెద్ది రుక్కవ్వ, బావుపేట, కొత్తపల్లి

ఎన్నాళ్లని తిరగాలే..?



మాది సీతారాంపూర్(కరీంనగర్). నా భర్త ఐలయ్య 2015లో కాలం చేసిండు. మాకు ఇద్దరు కొడుకులు. నలుగురు కూతుళ్లు. ప్రస్తుతం నా వయసు 75ఏళ్లు. దాదాపు ఎనిమిదేళ్ల నుంచి నా కొడుకులు నా బాగోగులు పట్టించుకోవడం లేదు. సీతారాంపూర్‌లో 22గుంటలు, రేకుర్తిలో 1.25 ఎకరాలుండగా వాటిని ఇద్దరు కొడుకులు వారిపేరున దొంగతనంగా మార్చుకున్నారు. నా కూతుళ్లకు 29 సర్వే నంబర్‌లో నాలుగున్నర గుంటలు గిఫ్ట్‌డీడ్ చేస్తే సదరు వివరాలను నా కుమారులు బ్లాక్‌లిస్ట్‌లో పెట్టించారు. బ్లాక్‌లిస్ట్ నుంచి తొలగించడంతో పాటు నా పోషణ అందరూ చూసుకునేలా చర్యలు తీసుకోవాలని తిరిగితే పట్టించుకుంటలేరు. నా కూతుళ్లే నన్ను పోషిస్తున్నారు. ఆస్తులు తీసుకునేది కొడుకులు.. ఉండాల్సింది కూతుళ్ల దగ్గరా?

– బొంతల నాగమల్లమ్మ, సీతారాంపూర్, కరీంనగర్

- కన్నందుకు మాకిదేం శిక్ష
- కలెక్టర్ సారూ కరుణించండి
- ప్రజావాణిలో వృద్ధుల గోడు

కరీంనగర్ అర్బన్: 'కళ్లలో ఉన్నదేదో కన్నులకే తెలుసు.. రాళ్లలో ఉన్న నీరు కళ్లకెలా తెలుసు' అని సినీ కవి తనకలంతో మనిషి జీవితాన్ని ప్రస్ఫుటించారు.. నిజ జీవితంలో కాటికి కాళ్లు చాచిన వృద్ధుల పరిస్థితి అచ్చం అలాగే మారింది.. పట్టెడన్నం పెట్టి ఆప్యాయతను చూపాల్సిన సంతానం నిర్దయగా వదిలేస్తున్నారు. నాలుగు గోడల మధ్య జరిగే వ్యవహారాన్ని కడుపులో దాచుకున్న తల్లులు విధిలేని పరిస్థితుల్లో అధికారులను ఆశ్రయిస్తున్నారు. అయినా సాంత్వన కరవవడం ఆందోళనకర పరిణామం. పలువురు వృద్ధులు విధిలేని పరిస్థితుల్లో సోమవారం ప్రజావాణిని ఆశ్రయించారు. కలెక్టర్ డా.బి.గోపితో ఆవేదన వ్యక్తం చేశారు. భూ సమస్యలు, పింఛన్లు, రెండు పడకల ఇళ్లు, రేషన్ కార్డులు ఇలా మొత్తం 211 అర్జీలు రాగా అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్‌తో కలిసి ఆర్జీలను స్వీకరించారు.


కలెక్టర్‌తో గోడు వెళ్లబోసుకుంటున్న నాగమల్లమ్మ

చట్టమేం చెబుతోంది..

తల్లిదండ్రుల బాగోగులు పట్టించుకోకపోవడం చట్టరీత్యా నేరం. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం, నిర్వహణ పేరుతో ప్రభుత్వం 2007లో చట్టాన్ని తీసుకొచ్చింది. నిరాదరణకు గురైన తల్లిదండ్రులకు వారి సంతానం నెలకు రూ.10వేల వరకు ఖర్చుల నిమిత్తం చెల్లించాలి. కేసు వేసిన 90 రోజుల్లోనే తీర్పు వెలువడుతుంది. తల్లిదండ్రుల ఆస్తిని ఆక్రమించి అనుభవిస్తుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. కేసువేసి తిరిగి ఆస్తిని స్వాధీనం చేసుకునే హక్కు వృద్ధులకు ఉంది. మానసికంగా, శారీరకంగా వృద్ధులను వేధిస్తే మూడు నెలల వరకు జైలు, రూ.5వేల వరకు జరిమానా విధిస్తారు.

అధికారులేం చేస్తున్నట్లు..?

కుమారుల నిరాదరణతో కలెక్టరేట్‌కు చేరుతున్న వృద్ధులకు యంత్రాంగం భరోసా కరువవుతోంది. చట్టప్రకారం చర్యలు తీసుకునే సర్వాధికారం ఉన్నా మాకేమన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో తమకు న్యాయం చేయాలని మళ్లీ మళ్లీ ప్రజావాణిని ఆశ్రయిస్తున్నారు. జిల్లా కేంద్రంలో జరిగే ప్రజావాణి దరఖాస్తులపై అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని కలెక్టర్ డా.బి.గోపి స్పష్టంగా ఆదేశిస్తున్నా ఆచరణలో అంతంతమాత్రమే.

ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయరూ..

మలి వయసులో నిరాదరణకు గురవుతున్న వారికి చట్టం చుట్టంగా ఉండాలంటే జిల్లా కలెక్టర్ చొరవ చూపాల్సిన అవసరం ఉంది. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో సదరు సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి.

జిల్లా ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు



కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్ ఆదివారం రాత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది రాత్రివేళల్లో విధుల్లో ఉండకపోవడం, పేషెంట్లకు సరైన సేవలు అందించడం లేదని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. అన్ని వార్డులు, సీటీ, ఐసీయూతో పాటు ఎంసీహెచ్‌లోని అన్ని వార్డులను, లేబర్‌రూంను తనిఖీ చేశారు. వైద్యుల హాజరును పరిశీలించి విధుల్లో ఉన్నారా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. సమయపాలన పాటించని, విధులకు సక్రమంగా హాజరు కాని వైద్యులపై శాఖాపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ఎంపీ సంజయ్‌కి అభివృద్ధి అంటే తెలుసా?


విద్యారణ్యపురిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ సునీల్‌రావు

- మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: ఎంపీ బండి సంజయ్‌కి అభివృద్ధి అంటే తెలుసా.. ఏనాడైనా నగర అభివృద్ధి గురించి పట్టించుకున్నారా అని మేయర్ యాదగిరి సునీల్‌రావు ధ్వజమెత్తారు. నాలుగు సంవత్సరాల తన ఎంపీ హయాంలో నగర అభివృద్ధికి చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని 32వ డివిజన్ వినాయకనగర్ రోడ్డు నంబరు 4లో స్థానిక కార్పొరేటర్ మర్రి భావన సతీశ్‌తో రూ.10 లక్షలతో చేపట్టే సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. 2వ డివిజన్ విద్యారణ్యపురి రోడ్డు నంబర్ 1,2తో పాటు మాణిక్యేశ్వర టెంపుల్ సమీపంలో స్థానిక కార్పొరేటర్ కాశెట్టి లావణ్య శ్రీనివాస్‌తో కలిసి ఏడుచోట్ల రూ.70 లక్షతో చేపట్టనున్న డ్రైనేజీలు, సీసీ రోడ్డు నిర్మాణాలకు భూమి పూజ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తోందని అన్నారు. సంజయ్ విమర్శలు హాస్యాస్పదమన్నారు.

క్లుప్తంగా

వాగులో ఆటోబోల్తా.. డ్రైవర్ సురక్షితం



శంకరపట్నం: శంకరపట్నం మండలం అర్కండ్ల లోలెవల్ బ్రిడ్జిపై అదుపుతప్పిన ఆటో వాగులో బోల్తాపడింది. గ్రామస్తుల వివరాలు.. వీణవంక మండలం గంగారం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ రాజు మండలంలోని కన్నాపూర్‌లో ప్రయాణికులను దింపి స్వగ్రామానికి వెళ్తున్నాడు. శంకరపట్నం మండలం అర్కండ్ల వాగుపై ఉన్న లోలెవల్‌బ్రిడ్జిపై ఆటో అదుపు తప్పి వాగులో పడింది. ఆటోలో డ్రైవర్ రాజు ఒక్కడే ఉండడంతో ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు చేరాడు. అర్కండ్ల గ్రామస్తులు వాగులోపడిన ఆటోను బయటకు తీశారు.

అల్ఫోర్స్ ఆధ్వర్యంలో చేనేతకు చేయూత



కొత్తపల్లి: భారతదేశం చేనేత వస్త్రాలకు నిలయమని, దేశ అభివృద్ధిలో గననీయమైన పాత్ర పోషిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా వి.నరేందర్‌రెడ్డి అన్నారు. పాఠశాలలోని 6వ తరగతి విద్యార్థులు జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తపల్లిలోని మరమగ్గాల క్షేత్ర పర్యటనకు బయలుదేరే ముందు పలు సూచనలు చేశారు. చేనేత కార్మికులు దేశానికి వెన్నుముక్కలాంటివారని, వారు లేకుండా అభివృద్ధిని సాధించలేమని, ఉపాధి అవకాశాలను సృష్టించలేమని అన్నారు.

విద్యాశాఖ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి



కరీంనగర్: ఇటీవల విద్యాశాఖ జారీచేసిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఏఐఎస్ఎఫ్ సభ్యులు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు వినతిపత్రం అందించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అటువంటి తరుణంలో సంఘాలను ప్రభుత్వ పాఠశాలల్లో అనుమతి ఇవ్వకపోవడం ఎందుకని ప్రశ్నించారు. తక్షణమే సంబంధిత ప్రకటనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నూనవత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన సిరిసిల్ల సాయికుమార్(24) చికిత్సపొందుతూ మరణించాడు. పోలీసుల వివరాలు.. సాయికుమార్ ఇంటర్ వరకు చదివాడు. ట్రాక్టర్ నడుపుతూ కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. గత కొద్దిరోజుల నుంచి కిడ్నీ నొప్పితో బాధపడుతున్నాడు.ఈనెల 2న ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

గద్దర్‌కు ఘన నివాళి

ప్రజా గాయకుడు గద్దర్‌కు జిల్లా ప్రజలు ఘన నివాళి అర్పించారు. జిల్లాతో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రజల మనిషి గద్దర్ లేని లోటు తీర్చలేనిదని పేర్కొన్నారు. పలువురు కళాకారులు ఆయనతో కలిసి పాల్గొన్న ఉద్యమ కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా కూడళ్ల వద్ద గద్దర్ చిత్రపటానికి కొవ్వొత్తులతో ఘన నివాళి అర్పించారు.



గోసంగి కుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణచౌక్‌లో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. నాయకులు సమ్మయ్య, లక్ష్మణ్, రామచంద్రం, సదానందం, రమేష్, జితేందర్, రమణ, బాలయ్య, లింగయ్య, కుమార్, లక్ష్మణ్, సంపత్, ప్రేమేందర్, సాయి, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

గద్దర్ తాతయ్యో.. వందానాలయ్యో..



అక్షర రాసి, పాడిన పాట, గద్దర్‌తో బామండ్ల అక్షర(ఫైల్)

గన్నేరువరం: ప్రజా గాయకుడు గద్దర్‌పై మండలంలోని చీమల కుంటపల్లెకు చెందిన ఐదో తరగతి చిన్నారి బామండ్ల అక్షర గద్దర్ తాతయ్య అంటూ పాట రాసింది. గ్రామానికి చెందిన సీపీఐ(ఎంఎల్) నాయకుడు బామండ్ల రవీందర్‌కు గద్దర్‌తో అనుబంధం ఉంది. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో గద్దర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ క్రమంలో తన కూతురు అక్షర 2020జనవరిలో గద్దర్‌పై ప్రత్యేక పాట రాసినట్లు రవీందర్ తెలిపారు. గద్దర్ తాతయ్యో.. వందానాలయ్యో.. అంటూ ప్రత్యేకపాట రాసింది. కాగా హైదరాబాద్‌లో జరిగిన అంత్యక్రియల్లో రవీందర్ పాల్గొని నివాళి అర్పించారు.

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

కరీంనగర్: గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని రైతు, ప్రజా సంఘాల నాయకుడు పోలాడి రామారావు అన్నారు. సోమవారం ఓసీ సమాఖ్య ఐకాస కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు. ఐకాస నాయకులు పెండ్యాల కేశవరెడ్డి, చెన్నమనేని పురుషోత్తమరావు, జైపాల్‌రెడ్డి, రాంరెడ్డి, స్వామిరెడ్డి, నర్సింహారెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

సైకత శిల్పం



కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని మంకమ్మతోటకు చెందిన సైకతశిల్పి రెవెల్లి శంకర్ సోమవారం ప్రజాగాయకుడు గద్దర్ సైకత శిల్పాన్ని రూపొందించి నివాళి అర్పించారు. శిల్పానికి ఐదుబ్యాగుల ఇసుక వాడినట్లు శంకర్ తెలిపారు. గద్దర్ మృతితో ఓ కళాకారుడిగా సైకత శిల్పాన్ని తయారు చేసి నివాళి అర్పించినట్లు తెలిపాడు.

పోరాటయోధుడు

కరీంనగర్: ప్రతిఘటన ఉద్యమాలనుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు గద్దర్ కీలకపాత్ర పోషించారని డాక్టర్ బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్ కొనియాడారు. అమరవీరులస్తూపం వద్ద గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు రమేష్, భూషణ్‌రావు, దేవకిషన్; సుదర్శన్, కుతాడి శివరాజ్,రాజయ్య, లక్ష్మీనారాయణ, బాబుజానీ, కుమార్, మల్లేశం పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి నివాళి

మర్చిపోలేని ప్రజా గాయకుడు

కరీంనగర్‌క్రైం/కరీంనగర్‌కల్చరల్/విద్యానగర్: సమాజం మర్చిపోలేని ప్రజాగాయకుడు గద్దర్ అని కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రఘునందన్‌రావ్, ప్రధానకార్యదర్శి లింగంపల్లి నాగరాజు పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ కోర్టులో గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. వేర్వేరు కార్యక్రమాల్లో భాగంగా ప్రజా గాయకుడు గద్దర్‌కు పలువురు కళాకారులు, సాహితీవేత్తలు సంతాపం ప్రకటించారు. చైతన్య కళాభారతి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం అధ్యక్ష కార్యదర్శులు తిప్పర్తి ప్రభాకర్, మంచాల రమేశ్ ఆధ్వర్యంలో కళాకారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.



గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న న్యాయవాదులు

ఎట్టకేలకు వ్యవసాయ గణన

- రెండేళ్ల అనంతరం నిర్వహణకు కసరత్తు
- కాగిత రహితం.. కమతాల వారీగా వివరాల సేకరణ
- రేపు ఎంపీఎస్‌వో, ఏఈవోలకు శిక్షణ

కరీంనగర్ అర్బన్: ఎట్టకేలకు వ్యవసాయ గణనకు కసరత్తు ప్రారంభమైంది. రెండేళ్ల క్రితం సదరు ప్రక్రియ చేయాల్సి ఉండగా పలు కారణాలతో వాయిదా వేశారు. ఈ నెలలో గణనను ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో రేపు(9న) కలెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణనివ్వనుండగా గురువారం నుంచి ఫీల్డ్ వర్క్ జరగనుంది. తదనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దేశంలో వ్యవసాయ స్థితిగతులు తెలుసుకోవడంతో పాటు అభివృద్ధి ప్రణాళిక, సామాజిక ఆర్థిక విధాన రూపకల్పనకు కేంద్ర ప్రభుత్వం అయిదేళ్లకు ఒకసారి వ్యవసాయ గణన నిర్వహిస్తోంది. గతంలో 2015–16లో ఈ గణన జరుగగా తిరిగి 2021–22లో జరగాల్సిన గణన వాయిదా పడుతూ వస్తోంది. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన అధికారులు జిల్లా సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. వానాకాలం, యాసంగిలో రైతుల వారీగా ఏయే పంటలు సాగు చేస్తున్నారనేది ఏటా వ్యవసాయ శాఖ సర్వే చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న వ్యవసాయగణనలో సామాజిక వర్గాలవారీగా రైతుల సంఖ్య, సాగు విస్తీర్ణం, ఏయే పంటలు పండిస్తున్నారు. నీటి వినియోగం, ఏయే యంత్రాలు అందుబాటులో ఉన్నాయి, కౌలు రైతులు, సాగు నీటి వనరులు ఇలా వ్యవసాయ సంబంధిత సమాచారాన్ని సేకరించనున్నారు. భూ కమతాల వారీగా రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని సర్వే చేస్తారు.



సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

జిల్లా కమిటీ చైర్మన్‌గా కలెక్టర్

గణన నిర్వహణకు రాష్ట్రస్థాయి నుంచి మొదలు జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్, సీపీఓ కన్వీనర్, మెంబర్‌గా జిల్లా వ్యవసాయాధికారి ఉంటారు. జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. ఉప గణాంక, మండల గణాంక అధికారులు సాంకేతిక సలహాలు ఇచ్చి సకాలంలో పూర్తి చేసేలా సూచనలు ఇవ్వనున్నారు. మొదటి దశ గణన ఈ నెల 15లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది.

అంతా డిజిటల్‌లోనే

తొలిసారిగా కాగితం వాడకుండా వివరాలను నమోదు చేయనున్నారు. గతంలో రైతుల వారీగా వివరాలు సేకరించి నమోదు చేయాల్సి ఉండేది. తాజాగా చేపట్టనున్న వ్యవసాయ గణనలో సాంకేతిక పద్ధతులను అమలు చేయనున్నారు. ఏఈవోలు స్మార్ట్‌ఫోన్లు ట్యాబ్ ద్వారా డిజిటల్ విధానంలో వివరాలు సేకరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రైతుబంధు కోసం రైతులు వివరాలు, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాలు, ఎంత భూమి ఉందనే వివరాలు సేకరించి ఉంచింది. వాటిని పరిగణనలోకి తీసుకుంటూనే అదనపు సమాచారాన్ని నమోదు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు దశల్లో గణన పూర్తి చేయాల్సి ఉంటుంది. మొదటి విడతలో రైతు పేరు, సామాజిక స్థితి, సాగు విస్తీర్ణం, భూమి వినియోగం(వ్యక్తిగత, ఉమ్మడి సంస్థాగత) పురుషులు, మహిళలు ఇలా అన్ని వివరాలు సేకరించి రెవెన్యూ గ్రామం వారీగా నమోదు చేస్తారు. రెండో విడతలో ఎంపిక చేసిన 20 శాతం గ్రామాల్లో అదనంగా మరి కొంత సమాచారం, మూడో దశలో ఏడు శాతం గ్రామాల్లో సాగు ఖర్చులు, యంత్రాల వినియోగం, ఎరువులు, విత్తనాలు, ప్రభుత్వ రాయితీలు తదితర వాటిని సేకరించి యాప్‌లో నమోదు చేస్తారు.

సకాలంలో పూర్తికి చర్యలు

ఈ సారి కాగిత రహితంగా గణన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తదనుగుణంగా శిక్షణ ఏర్పాట్లు చేస్తున్నాం. బుధవారం శిక్షణ పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేశాం. అన్ని వివరాలు యాప్‌లోనే నమోదు చేయడం వల్ల సమాచారం. నమోదు సులువవుతుంది.

– కొమురయ్య, సీపీవో

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



అభివాదం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

- లేకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తాం
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు

కరీంనగర్: భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లాకమిటీ ఆధ్వర్యంలో ఆరు రోజులుగా నిర్వహించిన విద్యార్థి చైతన్య మహాపాదయాత్ర జిల్లావ్యాప్తంగా 450కిలోమీటర్లు పూర్తి చేసుకొని ఏడోరోజు కరీంనగర్‌కు చేరుకుంది. తెలంగాణచౌక్ నుంచి రెవెన్యూగార్డెన్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. ముగింపు సభ రెవెన్యూ గార్డెన్‌లో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.5177 కోట్లు ఇంతవరకు విడుదల చేయలేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శనిగరపు రజినీకాంత్ మాట్లాడుతూ.. శాతవాహన యూనివర్సిటీలో అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ ఎం.పూజ మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు మహిళలకు రక్షణ కరువైందని అన్నారు. జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని అన్నారు. జిల్లాలోని 16మండలాలకు ముగ్గురు మాత్రమే.. రెగ్యులర్ ఎంఈవోలు ఉన్నారని తెలిపారు.ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, ఉపాధ్యక్షులు వినీషా, రోహిత్, అభిలాష్, సహ కార్యదర్శులు శ్రీజ, మనోజ్, వినయ్, సురేశ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్‌చౌర్యం.. జరిమానా

కొత్తపల్లి: సుల్తానాబాద్ మండలం సుభాష్‌నగర్‌కు చెందిన న్యాతరి శంకర్ విద్యుత్ చౌర్యానికి పాల్పడగా సెషన్స్ జడ్జి డి.హేమంత్ కుమార్ జరిమానా విధించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యుత్ విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ కె.స్వామి వివరాల ప్రకారం.. శంకర్ తన ఇంటికి విద్యుత్‌సంస్థ అనుమతి లేకుండా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. మొదటి నేరంగా భావించి, రూ.1,000 చొప్పున జరిమానా విధించారు. రెండోసారి పట్టుబడగా కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. సోమవారం జిల్లా అదనపు జడ్జి ఎదుట ప్రవేశపెట్టగా.. తప్పు ఒప్పుకున్నాడు. శంకర్‌కు రూ.9842 జరిమానా చెల్లించాలని, లేదంటే మూడు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. సమావేశంలో సీఐ టి. నరేష్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

విహారం.. విషాదం

- వాగులో మునిగి పీజీ వైద్య విద్యార్థి మృతి
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం



ప్రవీణ్ మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్: ఎంతోమంది ప్రాణాలను నిలబెడుతున్న వైద్యులు తోటి వైద్యుడైన మిత్రుడిని కాపాడలేకపోయారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో పీజీ ప్రథమ సంవత్సరం చదువుతున్న వైద్యులు తోటి స్నేహితులతో కలిసి ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలం కుంభఝరి-కంఠ గ్రామాల మధ్య ప్రవహించే సాత్నాల వాగు సమీపంలోని కోటిలింగాల వద్దకు వెళ్లారు. భూక్యా ప్రవీణ్‌కుమార్ రాథోడ్ వాగులో కాలుజారి గల్లంతు కాగా సోమవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. కళ్లకు గంతలు కట్టినట్లు ఉండటంతో కుటుంబ సభ్యులు మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. డైరెక్టర్ ఛాంబర్‌లో విహారయాత్రకు వెళ్లిన వైద్యుల నుంచి సీఐ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చిన్నతనం నుంచే చదువుల్లో మేటి

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం రంగంపేటకు చెందిన భూక్యా ఉస్మాన్ నాయక్ రాథోడ్-లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శేఖర్‌నాయక్ వ్యవసాయం చేస్తుండగా చిన్న కుమారుడు ప్రవీణ్ ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ప్రస్తుతం రిమ్స్‌లో ఆర్థోపెడిక్ పీజీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కాగా 1 నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివాడు. మొదటి ప్రయత్నంలో ఎంబీబీఎస్ సీటు సాధించగా హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో విద్యనభ్యసించారు. తర్వాత ముస్తాబాద్‌లోని పీహెచ్‌సీలో మూడు నెలలపాటు మెడికల్ ఆఫీసర్‌గా సేవలందించాడు. పీజీ సీటు రావడంతో రిమ్స్‌లో చేరాడు. ప్రయోజకుడై కుటుంబానికి అండగా నిలుస్తాడని అనుకున్న కొడుకు కానరానిలోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

స్నేహితుల దినోత్సవం రోజే

తోటి స్నేహితులు 9 మంది సరదాగా గడిపేందుకు ఆదివారం విహారయాత్రకు వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటలకు కుంభఝరి సమీపంలోని కోటి లింగాలను దర్శించుకున్నారు. వీరిలో నలుగురు పురుష వైద్యులు ఉండగా ఆరుగురు మహిళా వైద్యులు ఉన్నట్లు రిమ్స్ వర్గాలు తెలిపాయి. ఇంటికి బయల్దేరే క్రమంలో నీటిని దాటుతుండగా ప్రవీణ్ సెల్‌ఫోన్ నీటిలో పడిపోవడంతో దాన్ని తీసుకునేందుకు ప్రయత్నించి కాలు జారి నీటిలో పడ్డాడు. స్నేహితులు కార్తీక్, రాజు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. స్నేహితుడిని కాపాడాలంటూ పెద్ద ఎత్తున కేకలు వేసినా అప్పటికే ప్రవీణ్ గల్లంతయ్యాడు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, గ్రామస్తులు వాగు వద్దకు చేరుకున్నారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, మరి కొందరు వైద్యులు అక్కడకు చేరుకుని గజఈతగాళ్ల ద్వారా గాలింపు చేపట్టారు. రిమ్స్ మార్చురీలో పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు ప్రవీణ్ భౌతిక కాయాన్ని అప్పగించారు. పోస్టుమార్టం అనంతరం డైరెక్టర్ ఛాంబర్ ఎదుట మృతదేహాన్ని ఉంచి నివాళులర్పించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, వైద్యులు సుమలత, శ్యాంప్రసాద్, వెంకట్‌రెడ్డి, జాడే తానాజీ, అధికారులు పార్థివదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

పరుగో.. పరుగు

- గృహలక్ష్మి, డబుల్ బెడ్రూం ఇండ్లకు దరఖాస్తులు
- సోషల్‌మీడియాలో విస్తృత ప్రచారం
- మీసేవా కేంద్రాల్లో జనసందడి

కరీంనగర్‌రూరల్: జిల్లాలోని మీసేవా కేంద్రాలన్ని సోమవారం జనసందడిగా మారాయి. గృహలక్ష్మి, డబుల్ బెడ్రూం ఇండ్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకుంటున్నారనే సమాచారంతో పెద్దఎత్తున మహిళలు కేంద్రాలకు తరలివెళ్లారు. గృహలక్ష్మి పథకం దరఖాస్తుల కోసం మీసేవా కేంద్రాల నిర్వాహకులను ఆరా తీశారు. ఎలాంటి దరఖాస్తులు తీసుకోవడంలేదని చెప్పినప్పటికీ.. పలువురు మహిళలు నిర్వాహకులతో వాగ్వివాదం పెట్టుకున్నారు. చివరకు విధిలేని పరిస్థితుల్లో దరఖాస్తుఫారాలను ఇచ్చి కలెక్టరేట్‌లో అధికారులకు ఇవ్వాలంటూ నిర్వాహకులు తప్పించుకున్నారు. ఇదంతా సోమవారం పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా జిల్లాల్లో గృహలక్ష్మి పథకం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు టీవీలు, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో జరిగింది.

గృహలక్ష్మిపై విస్తృత ప్రచారం..

గృహలక్ష్మి పథకంపై సోషల్‌మీడియాలో విస్తృతప్రచారం జరగడంతో ఆశావహులందరు దరఖాస్తుల కోసం మీసేవా కేంద్రాలకు పరుగులు పెట్టారు. దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. దరఖాస్తుఫారంతోపాటు అవసరమైన ఆధార్,రేషన్,ఓటరుకార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, బ్యాంకు అకౌంట్‌బుక్, ఖాళీస్థలం ధ్రువీకరణ పత్రాల కోసం ప్రయత్నిస్తున్నారు. దరఖాస్తుఫారంతో అధికారులను సంప్రదిస్తే సరైన సమాధానం ఇవ్వడంలేదని పలువురు వాపోతున్నారు. అయితే గృహలక్ష్మి పథకం దరఖాస్తులపై ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం రాలేదని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు.



మీ సేవాలో వివరాలు అడుగుతున్న గ్రామస్తులు

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారనే సమాచారంతో పలువురు మీసేవా కేంద్రాలను సంప్రదించారు. మీసేవా పోర్టల్‌లో డబుల్ బెడ్రూం /ప్రధానమంత్రి అవాస్ యోజన-హౌసింగ్ ఫర్ ఆల్ (అర్బన్)పేరిట సైట్ ఉందని మీ సేవా కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. ఈ పోర్టల్‌లో కరీంనగర్ జిల్లా పేరు చూపించకపోవడంతో వివరాలను నమోదు చేసుకునే అవకాశం లేదని వివరించారు. మొత్తానికి గృహలక్ష్మి, డబుల్ బెడ్రూం ఇండ్ల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారనే ప్రచారం తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని మీసేవా కేంద్రాల నిర్వాహకుల కరీంనగర్ మండల అధ్యక్షుడు వేముల అశోక్ తెలిపారు.

గుండెపోటుతో ఆశవర్కర్ మృతి

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని మొర్రాపూర్‌తండాకు చెందిన ఆశవర్కర్ దండు పద్మ(40) గుండెపోటుకు గురై చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. పద్మ రెండు రోజుల క్రితం గుండెపోటుకు గురికాగా కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. స్టంట్ వేయగా.. మరోసారి గుండెపోటుకు గురైంది. వైద్యులు ఆమెను రక్షించే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. ఆపరేషన్ జరిగిన గంటల వ్యవధిలోనే పద్మ మృతి చెందింది. పద్మ మృతదేహాన్ని స్వగ్రామం మొర్రాపూర్‌కు తరలించారు. పద్దెనిమిదేళ్లుగా ఆశవర్కర్‌గా పనిచేస్తున్న పద్మ.. తండాలో ఎంతో మందికి నాణ్యమైన వైద్యం అందించేందుకు పనిచేసిందని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. భర్త నర్సింలు కూలీ పనులు చేస్తుండగా వీరికి పల్లవి, చిరంజీవి, వంశీ సంతానం.

ఆత్మహత్యలు పరిష్కారం కాదు



మృతుల కుటుంబాలను ఓదారుస్తున్న జాడి బాల్‌రెడ్డి

- దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బాల్‌రెడ్డి

చొప్పదండి: యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని, చిన్న చిన్న సమస్యలకు మనస్తాపం చెంది ఆత్మహత్యలు చేసుకోవడం తగదని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని రుక్మాపూర్‌లో పబ్జీ ఆడుతూ తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్యకు పాల్పడిన లంక రమేశ్ కుటుంబాన్ని ఆయన సోమవారం పరామర్శించారు. చాకుంటకు చెందిన తడిగొప్పుల హారిక ఆత్మహత్య చేసుకోగా కుటుంబాన్ని ఓదార్చారు. బీజేపీ సీనియర్ నాయకులు గుడిపాక రాములు, తాటికొండ కుమార్, ఒల్లాజి వెంకటస్వామి, పెద్ది వీరేశం, ముద్దం చందు, పాలకుర్తి శ్రీకాంత్ గౌడ్, ఎండీ మజీద్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంచాయతీ కార్మికుల వంటావార్పు



రోడ్డుపై భోజనంచేస్తున్న కార్మికులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మె సోమవారంతో 33 రోజుకు చేరింది. నెలరోజులు దాటినా ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరసనగా కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల కార్మికులు వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్డుపైనే వంటలు చేసి సామూహికంగా భోజనాలు చేశారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల రమేశ్, ప్రధానకార్యదర్శి సంపత్, కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల పంచాయతీ కార్మికులసంఘం అధ్యక్షులు కూర అంజిరెడ్డి, లక్ష్మినారాయణ, ఉపాధ్యక్షుడు శంకర్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



ప్రారంభిస్తున్న మేయర్,కార్పొరేటర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని 6వ డివిజన్ హౌసింగ్‌బోర్డు కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన మినీ హైమాస్ట్‌లైట్లను సోమవారం మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్ కోల మాలతి ప్రారంభించారు. కాలనీలోని రెండు చౌరస్తాల్లో మినీ హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు చేశారు. మేయర్, కార్పొరేటర్‌లను కాలనీవాసులు సన్మానించారు.

కో ఆప్షన్ సభ్యురాలికి పరామర్శ

ఇటీవల తండ్రిని కోల్పోయిన నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యురాలు నందెల్లి రమను సోమవారం మేయర్ సునీల్‌రావు పరామర్శించారు. ప్రముఖ వైద్యుడు విజయమోహన్‌రెడ్డి మామ చనిపోవడంతో ఆయనను పరామర్శించారు. మేయర్‌వెంట బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల అశోక్, గందె మహేశ్, బోనాల శ్రీకాంత్ ఉన్నారు.

చేనేత కార్మికులకు సన్మానం



సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మధు

కొత్తపల్లి: మండలంలోని బావుపేట మార్కండేయ పద్మశాలీ సంఘం భవనంలో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు ఆధ్వర్యంలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత ప్రాముఖ్యత, చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు పథకాలను వివరించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీధర్, శ్రీనివాస్, కమలమనోహర్, తిరుపతి, ఆంజనేయులు, లక్ష్మణ్‌రావు, కరుణాకర్, రవీందర్, కరుణాకర్, సుకుమార్, ఆంజనేయులు, రాజేందర్, సీహెచ్.రాజు, మహేందర్, మురళీ, శేఖర్, ప్రవీణ్, పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

కరీంనగర్‌రూరల్: మండలంలోని తాహెర్‌కొండాపూర్,బహుదూర్‌ఖాన్‌పేట గ్రామాల్లో సోమవారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువైద్యశిబిరాలు నిర్వహించారు. బొమ్మకల్ పశువైద్యాధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో తాహెర్‌కొండాపూర్‌లో 189, బహుదూర్‌ఖాన్‌పేటలో 256 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను సిబ్బంది వేశారు. మంగళవారం ఫకీర్‌పేట, జూబ్లీనగర్ గ్రామాల్లో పశువైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి రామకృష్ణ తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా మంగళవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11 కేవీ ఫీడర్ గోదాంగడ్డ ఫీడర్‌లో శ్రీనగర్‌కాలనీ, గోదాంగడ్డ, భగత్‌నగర్ ప్రాంతాల్లో, ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సప్తగిరి స్కూల్ ఏరియాలో, బతుకమ్మ కాలనీ, సప్తగిరిటెల్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏడీఈ2 ఎం సుధీర్‌కుమార్ పేర్కొన్నారు.

యువకుల రక్తదానం

తిమ్మాపూర్: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఉల్లెంగుల సేవా ట్రస్ట్ చైర్మన్ ఏకానందం జన్మదినం పురస్కరించుకొని ఉల్లెంగుల నవీన్ ఆధ్వర్యంలో మండలంలోని మహాత్మానగర్ రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బతుకు ఫుట్‌పాతే!





- రోడ్లపైనే చిరువ్యాపారులు
- దుకాణాలు కేటాయించని బల్దియా

కరీంనగర్ కార్పొరేషన్: స్మార్ట్ సిటీలో భాగంగా నగరపాలకసంస్థ సిటీలో వివిధ ప్రాంతాల్లో చిరువ్యాపారుల కోసం దుకాణ సముదాయాలు నిర్మించింది. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వెనుకాల, శాతవాహన యూనివర్సిటీ ఏరియా, కాశ్మీర్ గడ్డ రైతుబజార్ సమీపంలో దుకాణ సముదాయాలు దాదాపు సంవత్సరం క్రితం నిర్మించింది. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే చిరువ్యాపారాలు చేసుకునే వారితో పాటు, నిబంధనలకు అనుగుణంగా వ్యాపారులకు ఈ దుకాణాలు కేటాయించాలి. అయితే కొంతమంది దుకాణాలను కేటాయిస్తామని నమ్మిస్తూ చిరువ్యాపారుల వద్ద రూ. లక్ష నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసిన విషయం గతంలో 'సాక్షి' బయటపెట్టింది. దీంతో దళారుల బెడద కాస్త తగ్గినా... నగరపాలకసంస్థ అధికారులు ఇప్పటివరకు దుకాణాలు వ్యాపారులకు కేటాయించకపోవడం అనుమానాలకు తావునిస్తోంది. ఎవరికి ఎలా ఈ దుకాణాలు కేటాయించాలనేది నగరపాలకసంస్థ పాలకవర్గ సమావేశం నిర్ణయిస్తుంది. కానీ.. దుకాణ సముదాయాల నిర్మాణాలు పూర్తయినా కేటాయింపులో నాన్చుడు ధోరణితో వ్యాపారుల సహనాన్ని అధికారులు పరీక్షిస్తున్నారు. కాశ్మీర్ గడ్డ మార్కెట్ ను తొలగించి నూతనంగా నిర్మాణం చేపడుతుండడంతో, అక్కడ మాత్రం దుకాణసముదాయాల్లోనే విక్రయాలు జరుగుతున్నాయి. మిగతా ప్రాంతాల్లో చిరువ్యాపారులు పుట్ పాత్‌ల పైనే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.





డంపింగ్‌యార్డుగా బైపాస్ రోడ్డు...



ఆటోలో వచ్చి వ్యర్థాలను పడేస్తున్న వ్యక్తి

బొమ్మకల్‌బైపాస్‌రోడ్డు డంపింగ్‌యార్డుగా ఉపయోగపడుతోంది. కరీంనగర్‌లోని హోటళ్లు బిర్యాణి సెంటర్లలో మిగిలిన ఆహార పదార్థాలు, చికెన్‌సెంటర్లలోని వ్యర్థాలను నిర్వాహకులు ఆటోల్లో బైపాస్‌రోడ్డుకు తెచ్చి పడేస్తున్నారు. దీంతో బొమ్మకల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి విట్స్ ఇంజినీరింగ్ కళాశాల వరకు రోడ్డుపక్క న పడేసిన వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లి వా హనదారుల ముక్కుపుటాలు అదురుతున్నా యి. ఈ క్రమంలో సోమవారం ఓ వ్యక్తి ఆటో లో వచ్చి బకెట్లలో తెచ్చిన వ్యర్థాలను బైపాస్ రోడ్డులో దర్జాగా పడేస్తుండగా 'సాక్షి' తన కెమెరాతో క్లిక్‌మనిపించింది. గతంలో చెత్తచె దారంతో పాటు వ్యర్థాలను పడేయకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఫెన్సింగ్ ఏర్పాటుచేసి, సీసీ కెమెరాలు బిగించినప్పటికీ మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి బైపాస్‌లో వ్యర్థాలను పడేయకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. – కరీంనగర్‌రూరల్

రేషన్.. మళ్లీ ఆలస్యం

- తూకంలో రగడ.. కమీషన్‌పై పట్టు
- నేడు ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద డీలర్ల ఆందోళన
- బియ్యం తీసుకునేందుకు విముఖత



కరీంనగర్ అర్బన్: మళ్లీ రేషన్ ఆలస్యమే.. వినియోగదారులకు పడిగాపులే. ఇప్పటికే రేషన్ పంపిణీ చేయాల్సిఉండగా తూకం రగడ రాజుకుంటోంది. గత నెలలో ఆందోళన చేపట్టిన రేషన్ డీలర్లు అధికారుల హామీలతో విరమించారు. కానీ ఆచరణలో తూకం వేయకపోవడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. జిల్లాలో 25శాతమే పంపిణీ జరగ్గా 70 శాతానికి పైగా రేషన్ షాపులకు బియ్యం రాలేదు. రేషన్ బియ్యం పంపిణీలో ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేస్తుండగా క్షేత్రస్థాయిలో ఈ పరిస్థితి కనిపించడం లేదు. పంపిణీ ప్రారంభించగా వేలిముద్ర వేసేందుకు వెళ్లిన డీలర్లకు 'తూకం' వివాదానికి కారణమవుతోంది. నిబంధనల ప్రకారం తూకం వేసి పంపాల్సిఉండగా తక్కువగా తూకం ఉండడంతో బియ్యం తీసుకునేందుకు డీలర్లు విముఖత వ్యక్తం చేస్తున్నారు. వద్దేవద్దని వారిస్తున్నారు. గన్నీసంచుల తరుగును తూకంలో కలపకపోవడంతో క్వింటాళ్ల కొద్ది బియ్యం నష్టపోతున్నామని మేమెక్కడి నుంచి తెస్తామని డీలర్లు వాపోతున్నారు. జిల్లాలో కరీంనగర్, చొప్పదండి, జమ్మికుంట, హుజూరాబాద్ ప్రాంతాల్లో మండల స్థాయి నిల్వ కేంద్రాలు (ఎంఎల్ఎస్ పాయింట్లు) ఉండగా ఆయా కేంద్రాల నుంచి రేషన్ షాపులకు బియ్యం చేర్చడం పరిపాటి.

తక్కువ తూకంపై డీలర్ల ఆందోళన

జిల్లాలో 566 రేషన్‌షాపులుండగా ఏ రేషన్‌షాపునకు కూడ బియ్యం చేరలేదు. గతనెల నుంచి రేషన్ డీలర్లకు వేలిముద్ర తప్పనిసరి చేశారు. ఈనేపథ్యంలో యుద్ధప్రతిపాదికన బియ్యం రేషన్‌షాపులకు చేర్చాల్సి ఉండగా తూకంలో కోతను భర్తీ ఎలాచేస్తారనేది డీలర్లను వేధిస్తున్న సమస్య. గన్నీ సంచి బరువు 580 గ్రాములుంటుందన్నది ప్రభుత్వ లెక్క. అయితే ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం బస్తాను తూకం వేస్తే 50.580 కిలోలుండాలి కానీ 47.48 కిలోలే వస్తుండడం ఆందోళనకర అంశమైంది. స్టేజ్–1 నుంచి వచ్చిన ప్రకారం తూకం వేస్తుండగా నష్టపోయేది డీలర్లని మండిపడుతున్నారు. క్వింటాల్ బియ్యానికి రెండు కిలోలకు పైగా కోత పెడుతున్నారని, ఈ–పాస్ట్ ద్వారా పంపిణీ చేసినపుడు తరుగుభారం ఎవరిపై పడుతుందన్నది వారి వాదన. మంగళవారం ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద డీలర్లు ఆందోళన చేయనున్నారని సమాచారం. పూర్తిస్థాయిలో తూకం వేస్తేనే బియ్యం తీసుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

మాకిదేం పరిస్థితి



గౌరవ వేతనం లేదు.. ఒక్క బియ్యమే పంచాలి. ఏళ్ల తరబడి నానాఇక్కట్లు పడుతుంటే మా వైపుగా ఆలోచించేవారేరి. తూకం వేసి మూవ్‌మెంట్ చేస్తేనే అంగీకరిస్తాం. లేకుంటే వేలిముద్ర వేయలేం. ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలి.

– రొడ్డ శ్రీనివాస్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

రెండు నెలల కమీషన్ ఏదీ?

డిసెంబర్ 2022, జనవరి 2023 నెలలకు సంబంధించిన కమీషన్ డీలర్లకు చేరలేదు. ప్రభుత్వమిచ్చే కమీషనే డీలర్లకు ఆధారం. కానీ కొందరు డీలర్ల బ్యాంకు ఖాతాలో కమీషన్ చేరగా మరికొందరికి చేర లేదు. సాంకేతిక సమస్యలంటూ సా..గదీస్తుండగా నిరీక్షించడం డీలర్ల వంతవుతోంది. డిసెంబర్ 2022 నెల కమీషన్ 12 మంది డీలర్లకు రాలేదు. జనవరి 2023 కమీషన్ సుమారు 112 మంది డీలర్లకు చేరలేదు. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులను కలిసినా కంటితుడుపు చర్యలే తప్పా కార్యాచరణ లేదని డీలర్లు వాపోతున్నారు.

తల్లిపాలపై విస్తృత ప్రచారంతో అవగాహన



పండ్లు పంపిణీ చేస్తున్న లయన్స్ సభ్యులు, వైద్యాధికారి

కరీంనగర్/కరీంనగర్‌రూరల్: తల్లిపాల ప్రాధాన్యతపై మెడికోలు విస్తృత ప్రచారం చేసి ప్రజలకు అవగా హన కల్పించడం అభినందనీయమని కెయిమ్స్ ప్రిన్సిపాల్ ఆసీం అలీ అన్నారు. సోమవారం బొమ్మక ల్‌లోని చల్మెడ ఆనందరావువైద్యకళాశాలలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. డ్యాన్స్, పాటలు, షార్ట్‌ఫిలిం ఉపన్యాసం తదితర కార్యక్రమాల ద్వారా తల్లిపాలపై అవ గాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం పలువురు విద్యార్థులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల వైద్యులు రమ్య, శ్రీదేవి, శేషగిరి, శ్రీనివాస్, సంధ్య, సంగీత, స్వప్న పాల్గొన్నారు. కరీంనగర్‌లోని మాతా శిశు ఆరోగ్యకేంద్రంలో శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ యాదగిరి శేఖర్‌రావు ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరించే కరపత్రాల ను విడుదల చేసి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా గర్భిణులకు కరపత్రాలు, పండ్లు పంపిణీచేశారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ఆర్ఎంవో డాక్టర్ నవీన గర్భిణులకు వివరించారు. కార్యక్రమంలో లయన్ బుచ్చిరెడ్డి, బి.నరసింగరావులతో పాటు జిల్లా అదనపు కార్యదర్శి లయన్ కెప్టెన్ డా.బుర్ర మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి లయన్ ఏ.లక్ష్మారెడ్డి, కోశాధికారి లయన్ కోటసత్యం, లయన్ సీహెచ్. రాజిరెడ్డి ఇతర లయన్స్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలంతా సంఘటితం కావాలి



మాట్లాడుతున్న హరిప్రసాద్

విద్యానగర్: బీసీలందరూ సంఘటితమై తమ శక్తిని చాటాలని తెలంగాణ బీసీ కులాల నాయకుడు గుంజపడుగుహరిప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్ ఫిల్మ్‌భవన్‌లో బీసీల దినోత్సవం సందర్భంగా బీసీ యోధులను స్మరిస్తూ వారి పేరున బీసీ కులాల్లో సమాజ సేవ చేస్తున్న వారికి అవార్డులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. బీసీల్లో ఎందరో మహనీయులు సమాజ హితం కోసం, స్వాతంత్య్ర ఉద్యమంలోనూ, తెలంగాణ రైతాంగ పోరాటంలో, తెలంగాణ సాధనలో పాల్గొని అసువులు బాసరన్నారు. వారిని స్మరించుకుంటూ వారిపేరున బీసీ నాయకులకు అవార్డులు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. బీసీ కులాల రాష్ట్ర అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బీసీల్లోని వివిధ కులాలకు చెందిన వారికి, అమరులైన వారి పేరున అవార్డులను ప్రదానం చేశారు. బీసీ కులాల నాయకులు పెండ్యాల మహేశ్, సింగిరాల వెంకటస్వామి, తూల భాస్కర్‌రావు, కర్రె శ్రీనివాస్, గర్శకుర్తి శంకర్, జంపాల మనోహర్, కిన్నెర సురేశ్, దాడి సంపత్‌యాదవ్, గొల్లపల్లి సుధాకర్ పాల్గొన్నారు.

భూ పరిశీలన

తిమ్మాపూర్: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో బొమ్మలకుంటకు వెళ్లే రోడ్డును స్థానికులు ఇరువైపులా ఆక్రమించుకున్నారని గ్రామస్తులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. కలెక్టర్ తిమ్మాపూర్ ఎంపీడీవోకి ఆదేశాలు జారీచేశారు. సోమవారం ఎంపీవో కిరణ్ రోడ్డును పరిశీలించి, గ్రామస్తుల నుంచి వివరాలు తీసుకున్నారు.

మహారాష్ట్రలో గెలిపిస్తే.. కేంద్రం మెడలు వంచుతాం

రైతు ప్రభుత్వం ఏర్పాటు మినహా వేరే కోరికలేవీ లేవు

- బీఆర్‌ఎస్‌ లేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు కాదు.. దేశంలో కొత్త పార్టీ అవసరముంది: సీఎం కేసీఆర్‌
- మహారాష్ట్ర సర్పంచ్‌లు బీఆర్‌ఎస్‌లో చేరిక



సాక్షి, హైదరాబాద్‌: మహారాష్ట్రతో పాటు యావత్‌ భారతదేశంలో వెనుకబాటుతనం కనిపిస్తోందని రైతులు, పేదల ప్రగతి లక్ష్యంగా రైతు ప్రభుత్వం ఏర్పడాలని బీఆర్‌ఎస్‌ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆకాంక్షించారు. అబ్‌ కీ బార్‌ సర్కార్‌ నినాదంతో రైతు ప్రభుత్వం ఏర్పాటు మినహా తమకు వేరే కోరికలేవీ లేవన్నారు. మహారాష్ట్రలోని సోలాపూర్‌ నియోజకవర్గానికి చెందిన పలువురు సర్పంచ్‌లు సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన నేతలకు బీఆర్‌ఎస్‌ అధినేత, సీఎం కేసీఆర్‌ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మహారాష్ట్రలో 48, తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలు కలుపుకుని మొత్తం 65 సీట్లలో బీఆర్‌ఎస్‌ విజయం సాధిస్తే కేంద్రం మెడలు వంచలేమా అని కేసీఆర్‌ ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌ లేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటయ్యే పరిస్థితి ఉండదని, ఈ రకంగా దేశానికి నేతృత్వం వహించే అవకాశం మహారాష్ట్రకు దక్కుతుందన్నారు.

అంబానీ, ఆదానికి అప్పగించి..

దేశంలో నిల్వ ఉన్న 361 బిలియన్‌ టన్నుల బొగ్గు నిల్వలతో 150 ఏళ్ల పాటు విద్యుత్‌ ఉత్పత్తికి అవకాశాలు ఉన్నా ఆస్ట్రేలియా, ఇండోనేషియా నుంచి కొనుగోలు ఎందుకని కేసీఆర్‌ ప్రశ్నించారు. అంబానీ, ఆదానీకి అప్పగించి విద్యుత్‌ బిల్లులు పెంచేందుకు కేంద్రం వింత చేష్టలు చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు, సాగునీటి ప్రాజెక్టులను మహారాష్ట్ర నుంచి 20వేల మంది స్వయంగా చూసివెళ్లారని చెప్పారు. దేశంలో నెలకొన్న సమస్యలను తొలగించడానికి కొత్త పార్టీ అవసరముందని, బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఏర్పడితే మహారాష్ట్రలో రెండు మూడేళ్లలో వెలుగు జిలుగులు వస్తాయన్నారు. త్వరలో బుల్దానా జిల్లా నుంచి 100 శాతం మంది సర్పంచులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. మహారాష్ట్రలో లభిస్తున్న ఆదరణను చూస్తుంటే వందకు వంద శాతం మహారాష్ట్రలో బీఆర్‌ఎస్‌ ప్రభు త్వం ఏర్పడుతుందని కేసీఆర్‌ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంత్రులు హరీష్‌, ప్రశాంత్‌ రెడ్డి, మహమూద్‌ అలీ, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, పల్లా రాజేశ్వర్‌ రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌ రెడ్డి, తెలంగాణ ఇరిగేషన్‌ డెవలప్‌ మెంట్‌ కార్పొరేషన చైర్మన్‌ వేణుగోపాలచారి, మహారాష్ట్ర బీఆర్‌ఎస్‌ ఇంచార్జి వంశీధర్‌ రావు, బీఆర్‌ఎస్‌ నేతలు దాసోజు శ్రావణ్‌, సోలాపూర్‌ నేత నగేష్‌ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు తోకముడిచి కోతలు ఎత్తేశారు

మహారాష్ట్రలో బీఆర్‌ఎస్‌ కాలు పెట్టడంతో తోక ముడిచి విద్యుత్‌ కోతలు ఎత్తేశారని కేసీఆర్‌ వ్యాఖ్యానించారు. తెలంగాణ మోడల్‌ అమలు చేయాలని సూచించిన కేంద్రేకర్‌ అనే ఐఏఎస్‌ అధికారిని సీఎం, మంత్రులు బెదిరించి రాజీనామా చేయించారని ఆరోపించారు. అక్కడ తెలంగాణ మోడల్‌ అమలుకు రూ.49వేల కోట్లు మాత్రమే అవసరమవుతాయని, సంపద కలిగిన ఆ రాష్ట్రంలో ఆదాయం ఏమవుతోందని ప్రశ్నించారు. ఇప్పటివరకు మహారాష్ట్రను పాలించిన కాంగ్రెస్‌, బీజేపీ, శివసేన, ఎన్సీపీ సమస్యలను ఎందుకు దూరం చేయలేకపోయాయని నిలదీశారు. సాగునీరు లేక మహారాష్ట్రలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనీ, మహారాష్ట్రలో ఇప్పటికే 70వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకోగా, మరో లక్ష మంది అదే బాటలో ఉన్నట్లుగా తనకు తెలిసిందని ఆందోళన వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

- స్పష్టం చేసిన గ్రామ పంచాయతీ కార్మికులు.. నేడు జేఏసీ భేటీ
- ఆ తర్వాత కార్యాచరణ

సాక్షి, హైదరాబాద్‌: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని గ్రామ పంచాయతీ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి స్పష్టం చేసింది. సమ్మెకు సంబంధించి ఇప్పటికే పలు అంశాలను ప్రభుత్వానికి వివరించినప్పటికీ స్పందన లేదని, దాదాపు నెలన్నరగా సిబ్బంది సమ్మె చేస్తున్నారని పేర్కొంది. సమ్మె కొనసాగింపు, తదుపరి కార్యాచరణపై జేఏసీ నేతలు చర్చిస్తున్నారు. మరోవైపు సమ్మెను విరమించి విధుల్లో చేరాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జేఏసీ నేతలను కోరారు. సమ్మె విరమించాక చర్చలు జరుపుదామని, ఈ అంశాలను సీఎంకు వివరిస్తానన్నారు. ఈ క్రమంలో మంగళవారం జేఏసీ ముఖ్యులతో ప్రత్యేక సమావేశం జరగనుంది. అనంతరం తదుపరి చర్యలపై జేఏసీ నిర్ణయం తీసుకోనున్నట్లు చైర్మన్‌ పాలడుగు భాస్కర్‌, ప్రధాన కార్యదర్శి యజ్ఞ నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారం ప్రభుత్వానికి అనివార్యమని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం పంచాయతీ కార్మిక సంఘం నేతలతో కలిసి మంత్రి ఎర్రబెల్లిని కలిశారు.

'బతుకమ్మ చీరల పేరుతో ముంబై నుంచి చీరలు'



సాక్షి, హైదరాబాద్‌: చేనేతకు ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వడం లేదని, బతుకమ్మ చీరల పేరుతో ముంబై నుంచి చీరలు తెచ్చి సిరిసిల్ల చీరలు అంటూ మోసం చేస్తోందని టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మహేశ్‌ కుమార్‌గౌడ్‌ ఆరోపించారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా టీపీసీసీ వీవర్స్‌ సెల్‌ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ సమరయోధుడు కొండా లక్ష్మణ్‌ బాపూజీకి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మహేశ్‌కుమార్‌గౌడ్‌, వీవర్‌ సెల్‌చైర్మన్‌ శ్రీనివాస్‌, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్‌ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం అంటేనే కొండా లక్ష్మణ్‌ కానీ, నేడు సీఎం కేసీఆర్‌ ఆయన్ను మరిచిపోయారని విమర్శించారు. చేనేతను ఆదుకున్నది కాంగ్రెస్‌ మాత్రమేనన్నారు. అమరవీరుల స్తూపం పెట్టినా.. బాపూజీ పేరు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. చేనేత రంగానికి ఎలాంటి సేవలు కావాలో కాంగ్రెస్‌ పార్టీ మేనిఫెస్టోలో పెట్టి అధికారంలోకి రాగానే తీరుస్తామని మహేశ్‌కుమార్‌ హామీఇచ్చారు.

'హెర్బ్స్‌ డే'గా ఆచార్య బాలకృష్ణ జన్మదినం

సాక్షి, హైదరాబాద్‌: ఆయుర్వేద శిరోమణి ఆచార్య బాలకృష్ణ మహారాజ్‌ జయంతి రోజును 'హెర్బ్స్‌ డే'గా పతంజలి వెల్‌నెస్‌ సెంటర్‌లో నిర్వహించారు. యాగం, వేద మంత్రోచ్ఛరణల మధ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య బాలకృష్ణ నూతనంగా కనుగొన్న ఔషధాలను విడుదల చేశారు. ఆచార్యజీకి అమెరికాలో ఉన్న పూజ్య స్వామీజీ మహారాజ్‌ ఫోన్‌ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. 'మేము సేవాధర్మం, శాఖ ధర్మం రెండూ కలిసి చేస్తున్నాము' అని పేర్కొన్నారు.

ఉమ్మడి కరీంనగరే కీలకం



- అన్ని సీట్లలో బీఆర్‌ఎస్‌ జయకేతనం... కేసీఆర్‌ హ్యాట్రిక్‌ సీఎం కావడంలో కీలకపాత్ర
- అన్ని సర్వేలు, నివేదికల్లో స్పష్టమైన ఆధిక్యత.. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశమైన కేటీఆర్‌

సాక్షి, హైదరాబాద్‌: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను హ్యాట్రిక్‌ సీఎం చేయడంలో ఉమ్మ డి కరీంనగర్‌ జిల్లా కీలకపాత్ర పోషిస్తుందని బీఆర్‌ఎస్‌ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారకరామారావు ధీమా వ్యక్తం చేశారు. 2001లో పార్టీ ఏర్పాటు చేసినప్పటి నుంచి తిరుగులేని ఆధిక్యంతో ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా ప్రజలు బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని, ఈసారి కూడా అది పునరావృతం అవుతుందని చెప్పారు. సోమవారం మంత్రులు, బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రగతిభవన్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ మాట్లాడుతూ కరీంనగర్‌తో కేసీఆర్‌కు, తెలంగాణ ఉద్యమానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశారు. 2001 నుంచి నేటి వరకూ జిల్లా ప్రజలతో మమేకమై, తీసుకున్న ప్రతీ కార్యక్రమం విజయవంతం చేస్తూ బీఆర్‌ఎస్‌ పార్టీ పటిష్టంగా పని చేస్తుందన్నారు. తాజా సర్వేల్లోనూ, అన్ని నివేదికల్లోనూ ఈసారి ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు ఎదురులేదని స్పష్టమైందని భరోసా ఇచ్చారు. ప్రతిపక్ష పార్టీల డిపాజిట్లు కొల్లగొట్టే విధంగా రాబోయే మూడునెలలు పూర్తిస్థాయిలో ప్రజాప్రతినిధులు మొదలు కార్యకర్త వరకూ ప్రజాక్షేత్రంలో అందుబాటులో ఉండి పార్టీ కార్యక్రమాలు నిర్వహించేలా యాక్షన్‌ప్లాన్‌ రూపకల్పన చేయాలని ఆదేశించారు. బీఆర్‌ఎస్‌ కంచుకోటగా ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాలో గ్రౌండ్‌క్లియర్‌ ఉందని, కేసీఆర్‌ మూడోసారి ముఖ్యమంత్రి కావడానికి జైత్రయాత్ర ఇక్కడి నుంచే మొదలవుతుందని చెప్పారు. కనీస పోటీనిచ్చే పరిస్థితిలో ప్రతిపక్షాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గంగుల కమలాకర్‌, కొప్పుల ఈశ్వర్‌, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌, ఎమ్మెల్యేలు రసమయి, రమేశ్‌బాబు, సతీశ్‌కుమార్‌, సుంకె రవిశంకర్‌, దాసరి మనోహర్‌రెడ్డి, సంజయ్‌, కోరుకంటి చందర్‌, ఎమ్మెల్సీలు భానుప్రసాద్‌, ఎల్‌.రమణ, పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొన్నారు.

వనమాకు సుప్రీంకోర్టులో ఊరట



సాక్షి, న్యూఢిల్లీ: కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది. కొత్తగూడెం ఎమ్మెల్యేగా వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదంటూ, రెండోస్థానంలోని జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా ప్రకటిస్తూ హైకోర్టు ఇటీవల ఆదేశాలు ఇచ్చింది. దీనిని సవాల్‌ చేస్తూ వనమా దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్‌ సూర్యకాంత్‌, జస్టిస్‌ దీపాంకర్‌ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. వనమా వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పార్టీ మారినందున రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని జలగం తరఫు సీనియర్‌ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు కోరారు. దీనిపై హైకోర్టులో వాదనలు జరగలేదు కదా అని ధర్మాసనం ప్రశ్నించింది. వనమా విచారణకు హాజరుకాకపోవడం, ఆయా ఎన్నికల్లో సమర్పించిన ప్రమాణపత్రాల వివరాలు, ఒక భార్య ఉన్నారా లేదా ఇద్దరు భార్యలు ఉన్నారా తదితర అంశాలన్నీ పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొంది. మరో రెండు నెలల్లో ఎన్నికలు ఉన్నందున వనమా వెంకటేశ్వరరావుపై అనర్హతను కొనసాగించాలని దామా శేషాద్రినాయుడు కోరారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించిన ధర్మాసనం ప్రతివాదులు జలగం వెంకట్రావు, తదితరులకు నోటీసులు జారీ చేసింది. అదనపు ఆధారాలు సమర్పించడానికి పిటిషనర్‌ తరఫు సీనియర్‌ న్యాయవాది హరీన్‌ రావెల్‌కు అనుమతించింది. ప్రతివాదులు రెండు వారాల్లో కౌంటర్‌ దాఖలు చేయాలన్న ధర్మాసనం రిజాయిండర్‌కు మరో రెండు వారాలు గడువు ఇచ్చింది.

రాజ్యాంగ హక్కులకోసం విపక్షాలతో కలుస్తాం

ఢిల్లీ పౌరసేవల బిల్లుపై చర్చలో బీఆర్‌ఎస్‌ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రాల హక్కుల్లోకి చొరబడేలా ఉన్న ఢిల్లీ పౌరసేవల సవరణ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నామని బీఆర్‌ఎస్‌ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు తెలిపారు. రాజ్యాంగ హక్కులను కాలరాసేలా ఈ బిల్లు ఉందని ఆయన దుయ్యబట్టారు. సోమవారం రాజ్యసభలో ఈ బిల్లుపై జరిగిన చర్చలో బీఆర్‌ఎస్‌ తరఫున ఆయన పాల్గొన్నారు. దేశ సరిహద్దు సమస్య వస్తే శత్రువుకు వ్యతిరేకంగా అంతా ఒక్కటైనట్లే, రాజ్యాంగానికి సంబంధించిన విషయంలో కేంద్రంతో పోరుకు విపక్షాలతో ఏకమైనట్లు కేకే పేర్కొన్నారు. ఎప్పుడూ కలవని పార్టీలు ఏకమయ్యాయని లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్‌ ఇచ్చారు. విపక్షాల ఐక్యతపై కేంద్రం ఆందోళన చెందుతోందని, అయితే తాము ఇండియా, ఎన్డీఏ కూటములలో లేమని, కానీ రాజ్యాంగ హక్కుల కోసం విపక్షాలతో కలిసి పోరాడుతున్నట్లు వెల్లడించారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ అవినీతికి పాల్పడితే కేంద్ర హోంశాఖ ఆయనపై చర్యలు తీసుకోవచ్చని, అంతేకానీ ఆర్డినెన్స్‌ తేవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంపై గౌరవం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ బిల్లును వ్యతిరేకించాలని ఆయన కోరారు.




సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరంలో వీఆర్‌పురం, కూనవరం మండలాల వరద బాధితులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌

2025 ఖరీఫ్‌కు పోల'వరం'

- మన జీవనాడిపై కేంద్రాన్ని గట్టిగా నిలదీసి అర్థమయ్యేలా చెప్పాం: సీఎం జగన్‌
- అల్లూరి, ఏలూరు జిల్లాల్లో వరద ప్రాంతాల్లో బాధితులను కలుసుకున్న సీఎం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'పోలవరం ప్రాజెక్టును 2025 ఖరీఫ్‌ కల్లా కచ్చితంగా పూర్తిచేసే పరిస్థితి వస్తుంది. 2025 జూలై, ఆగస్టులో 41.15 మీటర్ల పరిధిలో నీటిని నిల్వ చేసే పరిస్థితి కూడా ఉంటుంది'అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టు, నిధులకు సంబంధించిన విషయాలపై కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తూ వారికి అర్థమయ్యే రీతిలో చెప్పామన్నారు. పోలవరం ముంపు ప్రాంతం కాంటూరు లెవెల్‌ 41.15 మీటర్ల పరిధిలో ప్రతి నిర్వాసిత కుటుంబానికి ఎన్నికలకు ముందే ఆరేడు నెలల్లోగా నష్టపరిహారం అందుతుందన్న నమ్మకం ఉందని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వంపై గట్టిగా ఒత్తిడి తెస్తున్నామని తెలిపారు. సోమవారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి జగన్‌ బాధితులను స్వయంగా కలుసుకుని క్షేత్రస్థాయిలో అమలైన సహాయ చర్యలను పరిశీలించారు. కూనవరం, గొమ్ముగూడెంలో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌ ఏమన్నారంటే..

బుద్ధి లేకుండా బాబు సంతకాలు..

పోలవరం డ్యామ్‌ను మూడు సంవత్సరాల్లో మూడు దశల్లో పూర్తిగా నింపుతారు. అందులో మొదటి స్టేజ్‌.. మొదటి ఏడాది 41.15 మీటర్ల వరకు నింపుతారు. 41.15 మీటర్ల వరకు నింపితే కటాఫ్‌ అయిపోయే గ్రామాలు ఇంకా ఉంటాయి. వాటిని ఫస్ట్‌ ఫేజ్‌లోకి తేకుంటే ఆ ఊర్లకు వెళ్లటానికి ఇబ్బంది అవుతుంది. అందుకనే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి లైడార్‌ సర్వే నిర్వహించి 32 గ్రామాల్లో 48 హ్యాబిటేషన్లను (ఆవాస ప్రాంతాలు) మళ్లీ యాడ్‌ చేయించాం. దీనికి కేంద్ర కేబినెట్‌ ఆమోదం కోసం కిందా మీదా పడుతున్నాం. గత ప్రభుత్వం 2013–2014 రేట్లతోనే పోలవరాన్ని పూర్తి చేస్తామని అండర్‌ టేకింగ్‌ ఇచ్చింది. దీంతో అంతకంటే ఎక్కువ డబ్బులివ్వమని, నాటి మీ ముఖ్యమంత్రే ఇందుకు ఒప్పుకుని సంతకం చేశారని కేంద్ర ప్రభుత్వం మొండికేసింది. నేను నేరుగా ప్రధాని, కేంద్ర మంత్రుల వద్దకు వెళ్లి వారికి అన్ని రకాలుగా నచ్చచెప్పా. 2013–14 రేట్ల ప్రకారం ఇప్పుడు ప్రాజెక్టు పూర్తి చేయాలంటే ఎలా సాధ్యం? గత ప్రభుత్వంలో చంద్రబాబు బుద్ధి లేకుండా సంతకం చేశాడు గానీ మీరైనా ఆలోచన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించే కార్యక్రమం చేశా. కేంద్ర కేబినెట్‌ ఆమోదం తెలిపితే పోలవరం తొలి ప్రాధాన్యతా పనుల కోసం రూ.17 వేల కోట్లు మనకు ఇచ్చేందుకు ఆమోదం లభిస్తుంది. ఈ రూ.17 వేల కోట్లకు అప్రూవల్‌ వస్తే 41.15 మీటర్లకు, 48 హ్యాబిటేషన్లకు సంబంధించి రూ.5,200 కోట్లు పంపిణీ చేసే కార్యక్రమం చేస్తాం. గట్టిగా ఒత్తిడి తెచ్చి వచ్చే జనవరికల్లా ఆర్‌ అండ్‌ఆర్‌ పూర్తయ్యేలా చూస్తాం. మన ప్రభుత్వం రాక ముందు కేవలం 3 వేల కుటుంబాలను మాత్రమే తరలించారు. గత నాలుగేళ్లలో ఇప్పటికే 12 వేల కుటుంబాలను షిఫ్ట్‌ చేశాం. మరో 8 వేల కుటుంబాలను అంటే మొత్తంగా 20 వేల కుటుంబాలను తరలిస్తున్నాం.

మీరే బటన్‌ నొక్కండి.. డబ్బులు పంపండి!

'పోలవరం నిర్మాణంలో మా ప్రభుత్వం క్రెడిట్‌ కోసం ఆలోచించదు. ప్రజలకు మంచి చేయడమే మా సంకల్పం. ప్రధాని నరేంద్ర మోదీకి రాసిన లేఖలో నేను ఒకటే చెప్పా.. అయ్యా! మీరే బటన్‌ నొక్కండి.. నేరుగా మీరే నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు పంపించండి..! మేమే చేయాలని ఆరాట పడటం లేదు. క్రెడిట్‌ ఎవరికి వచ్చినా ఫర్వాలేదు. నాకు కావాల్సిందల్లా మంచి జరగాలి. ఇంతకన్నా నాకు వేరే అవసరం లేదని చెప్పా'

– సీఎం జగన్‌


మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్‌ కోడ్‌ను స్కాన్‌ చేయండి

వారికి మిగతా రూ.3.5 లక్షలు ఇస్తాం

పోలవరం ప్రాజెక్టుకు తొలుత నాన్న (వైఎస్సార్‌) హయాంలో భూసేకరణ జరిగినప్పుడు రూ.లక్ష, రూ.లక్షన్నరకు కొనుగోలు చేశారు. దీనికి సంబంధించి నేను రూ.5 లక్షలు ఇస్తానని చెప్పా. ఆ మిగిలిన రూ.3.5 లక్షలు కచ్చితంగా ఇస్తాం. ఇక ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.6.8 లక్షల ప్యాకేజీకి తోడు రూ.3.8 లక్షల ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం తరఫున మనమే ఇస్తాం. దేవుడు ఆశీర్వదిస్తే కేంద్రం నుంచి జరగాల్సిన మంచి ఆరేడు నెలల్లోనే జరుగుతుందన్న నమ్మకం ఉంది. మీ బిడ్డ మీ కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాడు.

అప్పిలేట్‌ ట్రిబ్యునల్‌ ఆదేశాలపై స్టే ఇవ్వం

- ఈడీకి తేల్చిచెప్పిన తెలంగాణ హైకోర్టు
- ఆస్తుల అటాచ్‌ చెల్లదంటూ ఇదే కోర్టు గతంలోనే తీర్పునిచ్చింది
- అయినా పిటిషన్లు ఎలా వేస్తారు?
- ఏడాది క్రితం ఇచ్చిన 'వాన్‌పిక్‌'తీర్పుపై ఇప్పుడు అప్పీల్‌ చేస్తారా?
- ఈడీ తీరును తీవ్రంగా తప్పుపట్టిన హైకోర్టు ధర్మాసనం
- విచారణ ఈ నెల 11కు వాయిదా



సాక్షి, హైదరాబాద్‌: జగన్‌ కంపెనీల్లో పెట్టుబడుల వ్యవహారంలో వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి, ఇతరుల ఆస్తులను జప్తు నుంచి విడుదల చేయాలని అప్పిలేట్‌ ట్రిబ్యునల్‌ ఇచ్చిన తీర్పును సవాల్‌ చేస్తూ పిటిషన్లు దాఖలు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌ (ఈడీ)కి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఈడీ తీరును హైకోర్టు తప్పుపట్టింది. ట్రిబ్యునల్‌ ఆదేశాలపై స్టే ఇవ్వాలన్న ఈడీ అభ్యర్థనను నిర్ద్వందంగా తోసిపుచ్చింది. ఇప్పటికే ఇదే తరహా కేసులో వాన్‌పిక్‌ సంస్థ ఆస్తుల జప్తు చెల్లదని, వాటిని వెంటనే విడుదల చేయాలని హైకోర్టు గతంలోనే తీర్పునిచ్చిన విషయాన్ని గుర్తు చేసింది. అయినా పిటిషన్లు ఎలా వేస్తారని ప్రశ్నించింది. ట్రిబ్యునల్‌ ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లలోనూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వబోమని తేల్చి చెప్పింది. వాన్‌పిక్‌ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్‌ చేయనున్నట్లు ఈడీ న్యాయవాది చెప్పగా.. తీర్పు వచ్చి ఏడాది దాటిందని, ఇప్పుడు అప్పీల్‌ చేయాలని చూస్తున్నారా అంటూ ప్రశ్నించింది. పార్టీయే కాని సిలికాన్‌బిల్డర్స్‌ ఆస్తులను ఎలా జప్తు చేస్తారని ఈడీపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈడీ అభ్యర్థన మేరకు తదుపరి విచారణను ఈ నెల 11కు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్‌ శ్యామ్‌ కోషి, జస్టిస్‌ లక్ష్మీనారాయణ అలిశెట్టి ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మనీలాండరింగ్‌ నిరోధక చట్ట ప్రకారం దాఖలైన కేసులో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆస్తులు కొన్నింటిని ఈడీ అటాచ్‌ చేసింది. ఈడీ జప్తును సమర్థిస్తూ అడ్జ్యుడికేటింగ్‌ అథారిటీ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వైఎస్‌ జగన్‌ సహా పలువురు 2016లో అప్పిలేట్‌ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన ట్రిబ్యునల్‌.. ఈడీ చర్యలను తప్పుపట్టింది. రూ.746.17 కోట్ల ఆస్తులను జప్తు నుంచి వెంటనే విడుదల చేయాలని 2019 జూలై 26న ఉత్తర్వులు ఇచ్చింది. క్విడ్‌ ప్రో కో కింద పెట్టుబడులు వచ్చినట్లుగా నిరూపించడంలో ఈడీ విఫలమైందని తేల్చింది. అలాగే నిమ్మగడ్డ ప్రసాద్‌ ఆస్తుల జప్తు విషయంలో కూడా ఈడీ చర్యలను ట్రిబ్యునల్‌ తప్పుపట్టింది. ఆ ఆస్తులను కూడా విడుదల చేయాలని ఈడీని ఆదేశించింది. బ్యాంకు గ్యారెంటీ చూపాలని నిమ్మగడ్డ ప్రసాద్‌ను ఆదేశించింది. ట్రిబ్యునల్‌ ఇచ్చిన ఈ ఉత్తర్వులన్నింటినీ సవాలు చేస్తూ ఈడీ తెలంగాణ హైకోర్టులో 2019, 2020 సంవత్సరాల్లో వేర్వేరుగా పలు పిటిషన్లు దాఖలు చేసింది. ఈ పిటిషన్లపై హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్‌ శ్యామ్‌ కోషి, జస్టిస్‌ లక్ష్మీనారాయణ అలిశెట్టి ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈడీ పిటిషన్లకు ఎలాంటి విచారణార్హత లేదని, వాటిని కొట్టేయాలని జగన్‌, ఇతర కంపెనీల న్యాయవాదులు ఎస్‌. నవీన్‌ కుమార్‌, తరుణ్‌ జి.రెడ్డి కోరారు. అప్పిలేట్‌ ట్రిబ్యునల్‌ ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని ఈడీ తరఫు న్యాయవాది అనిల్‌ తివారీ కోరారు.

బీసీలను అణచివేస్తున్న కేంద్రం

- హక్కుల సాధనే లక్ష్యంగా బీసీలు ఉద్యమించాలి
- జాతీయ ఓబీసీ మహాసభలో వక్తల పిలుపు



అభివాదం చేస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్‌: దేశవ్యాప్తంగా 80 శాతం ఉన్న బీసీల అణచివేత దిశగా కేంద్రం వ్యవహరిస్తోందని, మండల్‌ సిఫార్సులను అమలు చేయడంలో దగా చేస్తోందని పలువురు వక్తలు, ఓబీసీ జాతీయ నేతలు ధ్వజమెత్తారు. బీసీల పట్ల కేంద్రం వైఖరిని వ్యతిరేకిస్తూ తిరుపతి మహతి కళాక్షేత్రంలో సోమవారం జాతీయ ఓబీసీ మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జాతీయ బీసీ కమిషన్‌ చైర్‌పర్సన్‌ హంసరాజ్‌ గంగారాం అహిర్‌, ఎంఐఎం పార్టీ అధి నేత, హైదరాబాద్‌ ఎంపీ అసదుద్దీన్‌ ఓవైసీ, జా తీయ ఓబీసీ ఫెడరేషన్‌ అధ్యక్షుడు జస్టిస్‌ ఈశ్వరయ్య, తెలంగాణ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌, రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్‌ అధ్యక్షుడు ప్రొఫెసర్‌ బబన్‌రావ్‌ తైవాడే తదితరులు హాజరయ్యారు. హంసరాజ్‌ గంగారాం అహిర్‌ మా ట్లాడుతూ బీసీల హక్కులు యాచన కాదని, దేశ రాజకీయాలను శాసించే దిశగా ఓబీసీలు ఐక్యతతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ అసదుద్దీన్‌ ఓవైసీ మాట్లాడుతూ బీసీలు కోరుతున్న డిమాండ్లు న్యాయమైనవని, జనాభా ప్రాతిపదికన వారు అడుగుతున్న హ క్కులను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జస్టిస్‌ ఈశ్వరయ్య మాట్లాడుతూ భారతదేశంలో ఏపీ సీఎం వైఎస్‌ జగన్‌ బీసీలకు సామాజిక న్యాయం చేస్తున్నారని ప్రశంసించారు.

సామాన్యుల సేవే సంతృప్తినిచ్చింది

- తిరుమలలో సాధారణ భక్తులకే పెద్దపీట వేశాం
- ఇందుకు వీఐపీ బ్రేక్‌ దర్శనంలో మార్పులు చేశాం
- చివరి సమావేశంలో టీటీడీ చైర్మన్‌ వైవీ సుబ్బారెడ్డి



పాలకమండలి సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్‌ వైవీ సుబ్బారెడ్డి

తిరుమల: టీటీడీ చైర్మన్‌గా తాను పనిచేసిన నాలుగేళ్లలో ఎక్కువమంది సామాన్య భక్తులకు తిరుమలలో వేంకటేశ్వరస్వామి దర్శనం కల్పించడం సంతృప్తిని ఇచ్చిందని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఎల్‌1, ఎల్‌2, ఎల్‌3 టికెట్లు రద్దు చేయడంతోపాటు సామాన్యులు స్వామివారి తొలి దర్శనం చేసుకునేలా వారికి పెద్దపీట వేశామన్నారు. ఇందుకు వీఐపీ బ్రేక్‌ దర్శన సమయాన్ని మార్చుతూ తీసుకున్న నిర్ణయాలు అత్యంత సంతృప్తినిచ్చాయని చెప్పారు. నాలుగేళ్లపాటు చైర్మన్‌గా పనిచేసే అదృష్టం ప్రసాదించిన శ్రీవేంకటేశ్వరస్వామివారికి, తనకు అవకాశం ఇచ్చిన సీఎం వైఎస్‌ జగన్‌కు, సహకారం అందించిన ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, సిబ్బందికి వైవీ కృతజ్ఞతలు తెలిపారు. నూతన చైర్మన్‌గా నియమితులైన భూమన కరుణాకర్‌రెడ్డి అనుభవం టీటీడీ అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టీటీడీ ప్రస్తుత ధర్మకర్తల మండలి చివరి సమావేశం సోమవారం తిరుమలలో వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అధికారులు ఆయన నాలుగేళ్ల పదవీకాలంలో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలపై పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ఇచ్చారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డి తాజా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు నిధులతో రెండు తెలుగు రాష్ట్రాల్లో 26 ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే రూ.24 కోట్లతో తిరుమలలోని రెండు ఘాట్‌ రోడ్లలో రక్షణ గోడల నిర్మాణం చేపడతామని వెల్లడించారు. కాగా టీటీడీ చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి నాలుగేళ్లపాటు అందించిన సేవలు అనుసరణీయమని టీటీడీ నూతన చైర్మన్‌ భూమన కరుణాకర్‌రెడ్డి కొనియాడారు. ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ మేరకు ఆయన తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం భూమన శాలువాతో వైవీని ఘనంగా సన్మానించారు.

10న టీటీడీ చైర్మన్‌గా భూమన ప్రమాణ స్వీకారం



తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డి ఈ నెల 10వ తేదీ ఉదయం 11.44 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయన మొదటిగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని అనంతరం శ్రీవారి గరుడ అల్వార్‌ సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ మేరకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, భూమన రెండోసారి టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనుండటం విశేషం.

నోమాడ్ హిజాబీ రైడర్

ఇట్టే వస్తా, రానీ వెంటా
నీ బుల్లెట్టు బండెక్కి వచ్చేత్తా పా
డుగ్గు డుగ్గు డుగ్గు డుగ్గనీ
అందాల దునియానే సూపిత్త పా
చిక్కు చిక్కు చిక్కు చిక్కుబుక్కనీ.. పాడుతూ, డ్యాన్స్ చేస్తూ, బైక్ ఎక్కే రోజుల నుంచి గేర్ల్‌మీద గేర్లు మార్చుకుంటూ రయ్యన దూసుకెళ్తున్నారు నేటి తరం అమ్మాయిలు. సెల్ఫ్‌తో బండిని స్టార్ట్‌చేసి సుదూర ప్రాంతాలకు సోలోగా రైడ్ చేస్తూ దునియాని చుట్టేస్తూ ఆస్వాదిస్తున్నారు. ఒక్కొక్కరు ఒక్కో రీతిలో రైడింగ్ చేస్తుంటే... మరింత ప్రత్యేకంగా హిజాబ్ ధరించి జాతీయ రహదారులే కాదండోయ్ దేశాలు దాటి మక్కా దాక బుల్లెట్ మీదే వెళ్తానంటోంది ముప్ఫై ఏళ్ల **నూర్ బీ.**



• నూర్ బీ



చెన్నైలోని పల్లవరానికి చెందిన అమ్మాయి నూర్‌బీ. సంప్రదాయ కుటుంబంలో పుట్టి పెరిగిన అమ్మాయి. ఇది చేయకు! అది చేయకు! అలా ఉండకు! ఇలా ఉండాలి! అంటూ ఎన్నో నిబంధనలు. అడుగు తీసి అడుగు వేయాలంటే ఆలోచించాలి. అయినా నూర్ బీకి మాత్రం బైక్ నడపడం అంటే ఎంతో ఇష్టం. ఆ ఇంట్లో అమ్మాయిలు బైక్‌లు అస్సలు నడపకూడదు. అయినా తన ఇష్టాన్ని మాత్రం వదులుకోలేదు. కాలేజీలో ఉండగానే మోటర్ సైకిల్ కొనుక్కోవాలనుకునేది. చదువు పూర్తయ్యాక బెంగళూరులోని ఐటీ కంపెనీలో హెచ్‌ఆర్ ఉద్యోగం వచ్చింది. నెలనెలా వచ్చే జీతంలో కొంత మొత్తాన్ని బండి కొనుక్కోవడానికి దాచుకునేది. ఇలా జమ చేసిన డబ్బులతో 2021లో రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350 మోడల్‌ను కొనుక్కుంది. బండి కొన్న వెంటనే ఉద్యోగం మానేసి రైడింగ్ షురూ చేసింది.

ఫస్ట్ రైడ్...

ఎన్నాళ్లుగానో వేచిచూస్తోన్న క్షణాలు వచ్చేశాయి. వెంటనే రైడింగ్‌కు ప్రణాళిక రూపొందించుకుంది నూర్. 2021 నవంబర్ 14 తొలి రైడింగ్ గేర్‌ను స్టార్ట్ చేసింది. ఈ రైడ్ గురించి కుటుంబ సభ్యులకు చెప్పలేదు. బెంగళూరు నుంచి మహారాష్ట్ర, డామన్ డయ్యూ, గుజరాత్, రాజస్థాన్ మీదుగా ఢిల్లీ చేరుకుంది. తల్లిదండ్రులకు చెప్పకుండా రహస్యంగా ఉంచినప్పటికీ మహారాష్ట్రలోని లోనావాలకు చేరుకునేటప్పటికి విషయం ఇంట్లో వాళ్లకు తెలిసింది. అయినా ఏమాత్రం వెనక్కి తగ్గలేదు నూర్. ఐదున్నర అడుగుల ఎత్తున్న నూర్ హిజాబ్ ధరించి బుల్లెట్ బండి మీద డుగ్గు డుగ్గు అని వెళ్తుంటే ఆమెను అంతా ఆసక్తిగా చూసేవారు. ఆ చూపులు నూర్‌కు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చేవి.

ఈసడింపులు, యాక్సిడెంట్ ఎదురైనప్పటికీ...

ప్రపంచం రోజురోజుకీ అప్‌డేట్ అవుతున్నప్పటికీ కొంతమంది ఇంకా 'అమ్మాయి ఏంటీ ఇలా చేస్తోంది? ఇదేం విడ్డూరం?' అని నోరు వెళ్లబెట్టిన వాళ్ల ఈసడింపులు నూర్‌కూ ఎదురయ్యాయి. అయినప్పటికీ రోడ్డు మీద గేర్‌లు మారుస్తూపోతూనే ఉంది. తన రైడ్‌ను ఎక్కడా ఆపలేదు. ఇదే దూకుడుతో... ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ లలో ప్రయాణిస్తూ నేపాల్‌కు వెళ్లాలనుకుంది. బిహార్ సరిహద్దులోకి రాగానే చిన్న యాక్సిడెంట్ జరిగి రైడింగ్‌ను మధ్యలో ఆపేయాల్సి వచ్చింది. అప్పుడు తన మోటర్ సైకిల్‌ను ట్రెయిన్‌లో చెన్నై పంపించాల్సిన పరిస్థితి. చాలా బాధ వేసింది. అయినా తప్పలేదు. 2022 మేలో యాక్సిడెంట్ అయితే జూలైలో కోలుకుని బెంగళూరు వచ్చేసింది. ఇంక బండిని అమ్మేయమని అంతా చెప్పారు. అయినప్పటికీ నూర్ రైడింగ్ ఆపలేదు. జాతీయ రహదారులేగాక అంతర్జాతీయ రహదారులపై రైడింగ్ చేస్తానూ అంటోంది. వచ్చే సంవత్సరం బెంగళూరు నుంచి మక్కా, సౌదీ అరేబియా కూడా వెళ్తానని చెబుతోంది.

మనకంటూ కొన్ని రూల్స్ పెట్టుకోవాలి...

''నేను నోమాడ్ హిజాబీ రైడర్‌ని. దక్షిణ భారత దేశం నుంచి తొలి సోలోరైడర్‌ని నేనే అవుతాను. ఉత్తర భారతదేశంలోని గురుద్వారాలు, గుళ్లు, ఆశ్రమవాసులు నా మతం వేరైనప్పటికీ ప్రేమగా భోజన, వసతి సదుపాయాలను కల్పించేవారు. కొన్ని సేఫ్టీరూల్స్ పాటిస్తే తక్కువ బడ్జెట్‌లో ట్రిప్స్‌ను విజయవంతంగా పూర్తిచేయవచ్చు. సాయంత్రం ఐదు తరువాత ఎటువంటి రైడింగ్ చేయను. తెలియని వ్యక్తులతో అస్సలు మాట్లాడను.పెట్రోల్ బంకులు, ప్రార్థనా స్థలాలు, ఆశ్రమాల్లో రాత్రుళ్లు బస చేస్తూ, ఉదయం రైడింగ్ చేస్తున్నాను. ఈ స్పీడుతో మక్కాను చేరుకుంటాను ''అని నూర్‌బీ ధీమా వ్యక్తం చేస్తోంది.

సవాల్ అని తెలిసీ ఎంచుకున్నాను..

'అమ్మాయిలు పోస్ట్‌మార్టం చేయలేరు' ఈ అపోహ తప్పని నిరూపిస్తున్నారు ఈ రంగంలోకి వస్తున్న యువ డాక్టర్లు. నాలుగేళ్లలో వెయ్యికి పైగా మృతదేహాలకు పోస్ట్‌మార్టం చేసి, అమ్మాయిలూ చేయగలరు అని నిరూపిస్తున్నారు కర్ణాటకలోని కార్వార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహాలక్ష్మి



• మెడికల్ స్టూడెంట్స్‌తో...



• డాక్టర్ మహాలక్ష్మి

మన దేశంలో మొట్టమొదటి ఫోరెన్సిక్ సైంటిస్ట్‌గా డాక్టర్ రుక్మిణీ కృష్ణమూర్తి వార్తల్లో నిలిచారు. ముంబయ్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీలో 1974లో చేరిన ఆమె రిటైర్ అయ్యేంతవరకు వర్క్ చేశారు. ఆమె స్ఫూర్తితో ఆ తర్వాత ఈ రంగంవైపు ఆసక్తి చూపినవాళ్లు ఉన్నారు. కానీ, వేళ్లమీద లెక్కించదగిన సంఖ్యలోనే ఉన్నారు.

అనారోగ్యంతో ఉన్నవారిని చూడటం సాధారణం. కానీ, కాలిపోయిన శరీరాలు, ప్రమాదాలలో ఛిద్రమైన శరీరాలు, నీటిలో మునిగిపోయిన శరీరాలు చూడటం సాధారణం కాదు. విషం కారణంగా శరీరం నీలం రంగులోకి మారడం లేదా ఆత్మహత్య కారణంగా మృతదేహాలను చూడటం మరింత బాధాకరం. సున్నితమనస్కులైన మహిళలు ఈ ఛాలెంజ్‌ను స్వీకరించలేరనేది అందరూ అనుకునేమాట. అయితే, ఈ వృత్తిని తాను ఛాలెంజింగ్‌గా తీసుకున్నానని చెబుతున్నారు డాక్టర్ మహాలక్ష్మి.

చదువుకునే రోజుల్లో...

''అమ్మానాన్నలకు ఐదుగురం ఆడపిల్లలం. అందులో ముగ్గురం డాక్టర్లమే. ఒక అక్క డెంటిస్ట్, మరొకరు ఆయుర్వేద డాక్టర్. వాళ్లని చూసే నేనూ డాక్టర్ కావాలని కల కన్నాను. ఆయుర్వేద వైద్యురాలైన మా అక్క ఫోరెన్సిక్ డాక్టర్ కావాలనుకుంది. కానీ, తను ఆ దారిలో వెళ్లలేకపోయింది. నేను ఈ టాపిక్‌ను ఎంచుకున్నప్పుడు మా అక్క ఎంతో సపోర్టునిచ్చింది. మా నాన్న ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేసేవారు. అమ్మ గృహిణి. మా ఇంట్లో ఎప్పుడూ చదువుకే ప్రాధాన్యత ఉండేది.

రిస్క్ ఎందుకు అన్నారు..

చదువుకునే రోజుల్లో సీఐడీ సీరియల్ చూసేదాన్ని. అందులో ఫోరెన్సిక్ విభాగం నాకు చాలా ఆసక్తిగా అనిపించేది. ఎంబీబీఎస్ రెండో సంవత్సరంలోనే ఫోరెన్సిక్‌కు సంబంధించిన సమాచారం తెలుసుకోవడం మొదలుపెట్టాను. మా ప్రొఫెసర్లు కూడా నాకు ఆ విభాగానికి సంబంధించిన సమాచారాన్ని, నేర కథనాలను వివరించేవారు. ఇందుకు సంబంధించిన నవలలు కూడా చదివాను. మా క్లాస్‌మేట్ అబ్బాయిలు మాత్రం 'ఈ విభాగం వద్దు, అమ్మాయివి ఎందుకు రిస్క్. ఇది కేవలం మార్చురీ గురించి మాత్రమే కాదు, సాక్ష్యం కోసం కోర్టుకు వెళ్లాల్సి ఉంటుంది. పోలీసులతో కలిసి పనిచేయాలి. రాత్రి, పగలు ఎప్పుడు అవసరమున్నా చురుగ్గా పనిచేయాలి. లేడీస్‌కి అంత సులభం కాదు' అన్నారు. 'మా నాన్నగారు కూడా పెళ్లై, సంప్రదాయ కుటుంబంలోకి వెళితే ఇబ్బందులుగా మారతాయి' అన్నారు. కానీ, ఒక కేసు దర్యాప్తులో ఫోరెన్సిక్ నిపుణుల పాత్ర చాలా ముఖ్యం అని నాకు తెలుసు. ఈ ఫీల్డ్‌లో ఛాలెంజెస్ ఎక్కువ. నేను చేయగలను అని భావించే ఈ విభాగంలోకి వచ్చాను. ఇప్పుడు నా నిర్ణయాన్ని అంతా సమర్థిస్తున్నారు'' అని వివరించారు ఈ ఫోరెన్సిక్ డాక్టర్.

అనేక పరిశోధనలు..

మేల్ డామినేటెడ్ వృత్తిలో ఎలా చోటు సంపాదించుకున్నావని నన్ను చాలామంది అడుగుతుంటారు. సవాళ్లు అంటే ఇష్టం అని చెబుతుంటాను. నేను పుట్టి పెరిగింది కర్ణాటకలోని ధార్వాడ్ జిల్లాలోని హుబ్లీ నగరం. ప్రాథమిక విద్య వరకు బెల్గాంలో చదివాను. ఆ తర్వాత కాలేజీ చదువంతా హుబ్లీలోనే. 2007 నుండి 2017 మధ్యన బెల్గాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుండి ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఏడాది పాటు గ్రామీణ ప్రజలకు సేవ చేశాను. 2020లో ఫోరెన్సిక్ విభాగంలో చేరాను. అప్పటి నుండి అనేక పరిశోధనలను ఫోరెన్సిక్ నిపుణుల బృందంతో కలిసి పనిచేశాను. మెడికల్ స్టూడెంట్స్‌కు క్లాసులు తీసుకుంటున్నాను. ఈ విభాగంలో గోల్డ్ మెడల్ వచ్చింది.

– డాక్టర్ మహాలక్ష్మి

బ్యూటిప్స్

మచ్చలు తగ్గాలంటే...

కళ్ల కింద లేదా మోచేతుల భాగంలో నలుపు కనిపిస్తుంటుంది. ఈ సమస్య నివారణకు...



• టీ స్పూన్ నిమ్మరసంలో స్పూన్ నీళ్లు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో దూది ఉండను ముంచి చర్మం మీద రాయాలి. ఆరిన తర్వాత కడిగేయాలి. రోజూ ఈ విధంగా చేయడం వల్ల నలుపు తగ్గుతుంది.



• రోజ్‌వాటర్‌లో దూది ఉండను ముంచి, నలుపు ఉన్న చోట రాయాలి. అలాగే శనగపిండిలో కొన్ని చుక్కల రోజ్‌వాటర్ పోసి, పేస్ట్ చేసి రాయాలి. ఈ విధంగా రోజూ చేయాలి.



• అవకాడో పండును గుజ్జు చేయాలి. ఈ గుజ్జును కళ్లకింద ముఖమంతా రాసి, ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవచ్చు. అవకాడోలో ఉన్న సహజ ఔషధ గుణం చర్మం పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తుంది.

సాగుబడి
అశ్లేష కార్తె: ఆగస్టు 4 నుంచి

గుళి రాగి భళా!

- విత్తనాలు వెదజల్లకుండా నారు పెంచి, మొక్కలు నాటే 'గుళి' పద్ధతిలో రాగి సాగులో సత్ఫలితాలు
- ప్రకృతి సేద్యంలో ఎకరానికి 14-18 క్వింటాళ్ల దిగుబడి
- గుళి పద్ధతిలోనే రాగులతో పాటు సామలు, కొర్రలు కూడా

ఉత్తరాంధ్ర ప్రకృతి వ్యవసాయదారులు రాగులు, సామలు, కొర్రలు వంటి చిరుధాన్యాల సాగును దేశీ రకాలతోనే కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. వెదజల్లే పద్ధతికి స్వస్తి చెప్పి.. నారు పెంచి మొక్కవేసే పద్ధతిలో ఒకటి, రెండు తడులతో సాగు చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. దీన్నే 'గుళి పద్ధతి' అని పిలుస్తున్నారు.



గుళి రాగి సాగు పద్ధతిలో రాగి మొక్కలు బాగా దుబ్బు కట్టి అధిక దిగుబడినిస్తాయి. ఎక్కువ పిలకలు కట్టిన రాగి దుబ్బులను చూపుతున్న రైతులు

'గుళి' పద్ధతి అంటే?

గుళి అంటే కన్నడంలో గొయ్యి లేక గుంత అని అర్థం. గుంత తీసి రాగి మొక్క నాటుతారు కాబట్టి గుళి రాగి పద్ధతి అని పేరొచ్చిందని ఈ పద్ధతిని గత కొన్ని ఏళ్లుగా ప్రాచుర్యంలోకి తెస్తున్న సంజీవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, ఏపీ రైతు సాధికార సంస్థ స్టేట్ రిసోర్స్‌పర్సన్ పచారి దేవుళ్లు 'సాక్షి సాగుబడి'కి తెలిపారు. గుళి రాగిని ఉత్తరాంధ్ర జిల్లాల రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో విస్తృతంగా సాగు చేస్తూ ఎకరానికి 14–18 క్వింటాళ్ల దిగుబడి పొందుతుండటం విశేషం. రాగులతో పాటు సామలు, కొర్రలను కూడా దేశీ వంగడాలతోనే గుళి పద్ధతిలో సాగు చేస్తున్నామని ఆయన వివరించారు. గుళి రాగి ప్రకృతి సేద్య పద్ధతి విశేషాలు ఆయన మాటల్లోనే..

11-18 రోజుల నారు..

విత్తనాలు వెదజల్లే పద్ధతిలో కన్నా నారు పోసి, మొక్క నాటే గుళి పద్ధతిలో చోడి (రాగులు) సాగులో దేశీ విత్తనాలు వాడితే మంచిది. ఉత్తరాంధ్రలో పెద్దచోడి, ముద్దచోడి రకాలు విరివిగా సాగులో ఉన్నాయి. ఎత్తుమడిని తయారు చేసుకొని బీజామృతంతో విత్తనశుద్ధి చేసి నారు మడి పోసుకోవాలి. 40 చదరపు అడుగుల నారు మడికి అర కేజీ విత్తనం సరిపోతుంది.

వారం రోజుల వ్యవధిలో వేర్వేరుగా రెండు నారు మడుల్లో నారు పోసుకోవాలి. దీని వల్ల వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా సరైన వయసు ఉన్న నారు అందుబాటులో ఉంటుంది. 11 నుంచి 18 రోజుల నారును మాత్రమే నాటుకోవాలి. రైతులు కొంతమంది కలసి ఒక చోట నారు మడులు వేసుకుంటే నారుమళ్ల నిర్వహణ సులభం అవుతుంది.

భూమిని 4 సార్లు బాగా కలియదున్ని ప్రధాన పొలాన్ని మొక్కవేతకు సిద్ధం చేయాలి. ఒక వైపు లోతుగా సాలు వచ్చే విధంగా చూసుకోవాలి. చివరి దుక్కిలో పశువుల ఎరువు లేదా ఘనజీవామృతం వేసి బాగా కలియదున్నాలి. వరుసల మధ్య, మొక్కల మధ్య ఒక అడుగు దూరం ఉండేలా తాడు లేదా మార్కర్ సహాయంతో మార్కింగ్ ఇచ్చుకొని నారు మొక్కలు నాటాలి.



రాగి నారు మడులు



వరుసల్లో రాగి నాట్లేస్తున్న మహిళలు



గుళి రాగి పంటకు 1,2 తడులు చాలు

గుళి రాగిలో అంతర పంటలు

గుళి రాగిలో అంతర పంటలు సాగు చేసుకోవాలి. 6 వరుసలు రాగి, 2 వరుసలు కంది/ మొక్కజొన్న/ నువ్వులు వేసుకోవచ్చు. గుళిరాగిలో టమోటా, బీర, గోంగూరలను కూడా అంతర పంటలుగా వేసుకోవచ్చు.

మొక్క నాటిన 15 రోజులకు మొదటి విడత కలుపు తీయాలి. సైకిల్ వీడర్ ఉపయోగించి కలుపు తీసుకోవచ్చు. ఎద్దులున్న వారు ప్రతి 15 రోజులకు ఒకసారి కలుపు నివారించవచ్చు. కలుపు తీసిన ప్రతీసారీ పంటపై ద్రవజీవామృతం పిచికారీ చేయాలి. వర్షాలను బట్టి పంట కాలంలో అవసరం మేరకు రెండు లేదా మూడు సార్లు రక్షక తడులు ఇవ్వాలి.

రెట్టింపు దిగుబడి

గుళి రాగిని ఏక పంటగా, అంతర పంటలు, 365 రోజులు పంటలు సాగు చేసే పద్ధతిలో కూడా సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో అల్లూరి సీతారామరాజు, మన్యం జిల్లాల్లో వేస్తారు. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ జిల్లాలో రబీలో ఎక్కువ మంది రైతులు వేస్తారు. ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే 4 వేల మంది రైతులు 3 వేల ఎకరాల్లో గుళి రాగి సాగు చేస్తున్నారు. లోకల్ రకాలైన పెద్దచోడి, పెద్ద సామ, బండకొర్ర రకాలు గుళ్లి పద్ధతిలో ఎక్కువ దిగుబడి వస్తున్నది. గుళి రాగిని ఉత్తరాంధ్ర జిల్లాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసి ఎకరానికి 14–18 క్వింటాళ్ల దిగుబడి పొందుతున్నారు. విత్తనం వెద పెట్టినప్పటి కన్నా దిగుబడి రెట్టింపయ్యింది. వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు కూడా ఈ దిగుబడులను నమోదు చేశారు.



– పచారి దేవుళ్లు
(94401 19789),
స్టేట్ రిసోర్స్‌పర్సన్,
ఏపీ రైతు సాధికార సంస్థ,
ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ బోర్డు సభ్యుడు.

గుళి రాగి సాగులో ప్రధానాంశాలు:

• బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి • చివరి దుక్కిలో/ గుంతలో ఎరువు వేయాలి • 11 నుంచి 18 రోజుల వయసు గల నారు నాటాలి • సైకిల్ వీడర్ లేదా పశువులను ఉపయోగించి కలుపు తీయాలి • కలుపు తీసిన తరువాత ప్రతి మొక్క వంగేలా దుంగను మొక్కలపై నుంచి లాగటం అవసరం • కలుపు తీసిన ప్రతి సారీ ద్రవజీవామృతం పిచికారీ చేయాలి • నేలలో తేమ ఆరిపోతే అవసరం మేరకు రక్షక తడులు ఇవ్వటం • పురుగులు/తెగుళ్ళ నివారణకు నీమాస్త్రం, అగ్ని అస్త్రం వంటి కషాయాలు పిచికారీ చేయాలి • ఇలా గుళి రాగి సాగు చేస్తే ఎకరానికి 14 నుంచి 18 క్వింటాళ్ళ రాగుల దిగుబడి సాధించవచ్చు.

12న జహీరాబాద్‌లో సాగుచేయని పంటల ప్రదర్శన

ఆకుకూరల్లో విత్తనం చల్లి సాగు చేసే రకాలు కొన్నయితే, వాటంతట అవే మొలిచేవి(అన్‌కల్టివేటెడ్ గ్రీన్స్) మరికొన్ని. ఈ కోవ కిందకు వచ్చేవే దొగ్గలి కూర, బచ్చలి కూర, జొన్నచెంచెలి కూర, బంకంటి కూర.. ఇంకా మరెన్నో. పోషక విలువలను అందించటంలో ఈ సాగు చేయని ఆకుకూరలు మామూలు ఆకుకూరలకు ఏమాత్రం తీసిపోవు. ఈ పంటలను ప్రచారంలోకి తేవడం కోసం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతి ఏటా నిర్వహించినట్లే ఈ ఏడాది కూడా ఆగస్టు 12(శనివారం)న 'అన్‌కల్టివేటెడ్ గ్రీన్స్ ఫెస్టివల్'ను నిర్వహిస్తోంది. మిల్లెట్ సోదరీమణుల పర్యావరణ వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, 30కి పైగా సంప్రదాయ ఆకుకూరల రకాల ప్రదర్శనను చూడవచ్చు. వీటి రుచులతో కూడిన మిల్లెట్ లంచ్ విందులో పాల్గొనవచ్చు. హైదరాబాద్ నుంచి వంద కి.మీ. దూరంలోని జహీరాబాద్ సమీపంలోని మహిళల పొలాల్లో ఈ కార్యక్రమం జరగనుంది. ఆగస్టు 10 లోగా ముందస్తు పేర్ల నమోదు తప్పనిసరి. వివరాలకు.. 040 27764577.

సేద్యం కన్నా ఆక్వా మిన్న

- చేపల హేచరీ రంగంలో విశేష కృషి చేసిన ఒడిశాకు చెందిన ఆక్వా రైతు శాస్త్రవేత్త
- రెండేళ్ల క్రితం పద్మశ్రీ పురస్కారం అందుకున్న సాహు

వ్యవసాయంలో కన్నా చేపల పెంపకం లాభదాయకంగా ఉందంటారు ఆక్వా రంగంలో ప్రసిద్ధుడైన బటక్రుష్ణ సాహు. ఒడిశాలోని ఖుర్దా జిల్లాలో పుట్టిన 73 ఏళ్ల సాహూ 40 ఏళ్ల క్రితమే చేపల పెంపకాన్ని ప్రారంభించి సరికొత్త ప్రయోగాలు చేసి విజయం సాధించారు. ప్రముఖ ఆక్వా రైతు శాస్త్రవేత్తగా ఎదిగారు. ఒడిశాలో తొలి ప్రైవేట్ హేచరీని నెలకొల్పారు. రెండేళ్ల క్రితం పద్మశ్రీ పురస్కారాన్ని సైతం తీసుకున్నారు.

భువనేశ్వర్‌లోని కేంద్రీయ మంచి నీటి ఆక్వాసాగు పరిశోధనా సంస్థ (సిఫా), కేవీకేలలో శిక్షణ పొందిన సాహూ ఆక్వా సాగును కొత్తపుంతలు తొక్కించారు. చేపల పెంపకందారులు స్పాన్‌ల సేకరణ, శిక్షణతో పాటు మార్గదర్శకత్వం కోసం సాహును నిరంతరం సంప్రదిస్తూ ఉంటారు. ఆయన ఏడాదికి సుమారు వెయ్యి మంది రైతులకు శిక్షణ ఇస్తారు.

1986లో చేపల పెంపకంలోకి రావడానికి ముందు 15 ఎకరాల సొంత పొలంలో వరి సాగు చేసేవారు. అది పెద్దగా లాభదాయకంగా లేదని భావించి చేపల పెంపకం నేర్చుకున్నారు. తన గ్రామానికి సమీపంలోని పంచాయతీ చెరువును లీజుకు తీసుకుని చేపల పెంపకాన్ని ప్రారంభించి, ఏడాదిలో దాదాపు రూ. 24 వేల నికర లాభం సంపాదించారు. చేపల పెంపకంలో పట్టుసాధించిన తర్వాత చేపల స్పాన్ ఉత్పత్తిలోకి దిగారు. ఇందులో ఆదాయం ఎక్కువ కనిపించేసరికి మరిన్ని ప్రయోగాలు చేశారు. ప్రభుత్వ రుణం తీసుకొని ఐదు చెరువుల్లో చేపల పెంపకాన్ని, స్పాన్ ఉత్పత్తిని చేపట్టారు. 1997 వరకు హాపా టెక్నిక్‌తో చేపల స్పాన్ ఉత్పత్తి చేసిన ఆయన తర్వాత వృత్తాకార కృత్రిమ హేచరీ(చైనీస్ హేచరీ) పద్ధతిని అనుసరించారు.

1998లో వృత్తాకార హేచరీ ట్యాంకులు నిర్మించడం ప్రారంభించాను. వర్షాలు, బలమైన గాలులు, జంతువుల కారణంగా చెరువుల్లో వ్యవహారాలను పెద్దగా నియంత్రించలేం. కాబట్టి, చేపలను రక్షించడానికి వృత్తాకార హేచరీలను ఉపయోగించడం ప్రారంభించాను అన్నారాయన. ఇప్పుడు ఆయనకు 22 చెరువులు ఉన్నాయి.





చేపల హేచరీ చెరువుల వద్ద పద్మశ్రీ పురస్కార గ్రహీత సాహు

10 రకాల మంచినీటి చేపలపై దృష్టి కేంద్రీకరించి స్పాన్ ఉత్పత్తి చేపట్టారు. చేపల పెంపకంపై ఏటా వెయ్యి మంది రైతులకు శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. సాహు అత్యాధునిక సాంకేతికతలతో స్పాన్ ఉత్పత్తిని ప్రవేశపెట్టడంలో అగ్రగామిగా పేరుగాంచారు. ప్రభుత్వ రంగానికే పరిమితం అయిన స్పాన్ ఉత్పత్తిని రైతుగా ఆయన చేపట్టి విజయం సాధించడం విశేషం. ప్రస్తుతం సాహు ప్రతి సంవత్సరం 4–5 కోట చేపల సీడ్ వ్యాపారం చేస్తూ ఏడాదికి రూ. 12 లక్షల కంటే ఎక్కువ సంపాదించగలుగుతున్నారు. వ్యవసాయంతో పోలిస్తే చేపల పెంపకంలో నష్టాలు చాలా తక్కువ అంటారాయన.

20న పశు హోమియో వైద్యంపై సదస్సు

గోశాలల నిర్వహణ, పశువ్యాధులకు హోమియోపతి వైద్యంపై 'రైతునేస్తం ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఈనెల 20 (ఆదివారం)న హైదరాబాద్ లక్డీకాపూల్ రెడ్ హిల్స్‌లోని ఫ్యాప్సీ భవన్‌లో ఉ.9–సా. 5 గం. వరకు ఉచిత అవగాహన సదస్సు జరగనుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గోశాలల నిర్వాహకులు, పాడి రైతులు, పశువైద్యులు పాల్గొనవచ్చు. కేంద్ర ప్రభుత్వ పశు సంవర్థక శాఖ కమిషనర్, వెటరినరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు ఈ సదస్సుకు అతిథులుగా విచ్చేస్తున్నారు. అతి తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా పనిచేసే హోమియో పశువైద్య విధానంపై నిపుణులు అవగాహన కల్పిస్తారని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వర రావు తెలిపారు. అందరూ ఆహ్వానితులే. పాల్గొనదలచిన వారు ఆగస్టు 15లోగా పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 70939 73999, 95538 25532.



పాకిస్తాన్ చీఫ్ సెలెక్టర్‌గా ఇంజమామ్

దిగ్గజ క్రికెటర్ ఇంజమామ్ ఉల్ హఖ్ రెండోసారి పాకిస్తాన్ జట్టు చీఫ్ సెలెక్టర్‌గా నియమితుడయ్యాడు. ఈ మేరకు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సోమవారం ప్రకటన విడుదల చేసింది. 53 ఏళ్ల ఇంజమామ్ గతంలో 2016 నుంచి 2019 వరకు ఈ పదవిలో ఉన్నారు. ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లో భారత్ వేదికగా జరిగే వన్డే వరల్‌కప్‌లో పాల్గొనే పాక్ జట్టును ఎంపిక చేసే ప్రక్రియలో ఇంజమామ్ కీలకపాత్ర పోషించనున్నాడు.



హెచ్‌సీఏ ఎన్నికల అధికారిగా వీఎస్ సంపత్

హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)లో ఎన్నికల నిర్వహణకు తొలి అడుగు పడింది. భారత ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్‌గా పని చేసిన వీరవల్లి సుందరం (వీఎస్) సంపత్ హెచ్‌సీఏ ఎన్నికల అధికారిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో హెచ్‌సీఏ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) లావు నాగేశ్వరరావు దీనికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్‌సీఏ ఎన్నికల ప్రక్రియ మొత్తం వీఎస్ సంపత్ నేతృత్వంలోనే జరుగుతుంది.



సిరీస్ కాపాడుకునేందుకు...

నేడు వెస్టిండీస్‌తో భారత్ మూడో టి20
- తీవ్ర ఒత్తిడిలో టీమిండియా
- 3-0పై విండీస్ గురి
- రాత్రి గం.8 నుంచి డీడీ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్షప్రసారం

ప్రావిడెన్స్ (గయానా): ఏడేళ్ల తర్వాత వెస్టిండీస్ చేతిలో భారత్ వరుసగా రెండు టి20 మ్యాచ్‌లలో ఓడింది. ఇప్పుడు అదే తరహాలో సిరీస్ కూడా కోల్పోయే స్థితిలో టీమిండియా నిలిచింది. రోహిత్, కోహ్లి లేకపోయినా ఐపీఎల్ కారణంగా తగినంత టి20 అనుభవం ఉన్న భారత జట్టు తొలి రెండు మ్యాచ్‌లలో ప్రత్యర్థికి అనూహ్యంగా తలవంచింది. ఇప్పుడైనా హార్దిక్ పాండ్యా బృందం కోలుకొని తమ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరుస్తుందా అనేది కీలకం. మరోవైపు రెండు మ్యాచ్‌లు గెలిచిన ఉత్సాహంతో వెస్టిండీస్ సిరీస్‌పై కన్నేసింది. ఆ జట్టు ఇదే జోరు కొనసాగిస్తే మరో మ్యాచ్ గెలవడం కూడా కష్టం కాబోదు. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య నేడు మూడో టి20 మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. గత మ్యాచ్ జరిగిన వేదికపైనే ఈ మ్యాచ్ కూడా కావడంతో పిచ్ నెమ్మదిగా ఉండవచ్చు.

సూర్య చెలరేగేనా...

తొలి రెండు టి20ల్లోనూ భారత ప్రధాన బ్యాటర్లంతా విఫలమయ్యారు. బ్యాటింగ్‌కు గొప్పగా అనుకూలించని నెమ్మదైన పిచ్‌పై పరుగులు చేసేందుకు మనవాళ్లు తడబడుతున్నారు. ఇషాన్ కిషన్, గిల్, సంజు సామ్సన్, హార్దిక్ పాండ్యా ప్రభావం చూపలేకపోయారు. దీంతోపాటు టి20ల్లో అద్భుత రికార్డు ఉన్న సూర్యకుమార్ యాదవ్ కూడా తనదైన దూకుడు ప్రదర్శించలేదు. హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ ఒక్కడే చక్కటి బ్యాటింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. బౌలింగ్‌లో స్పిన్నర్ చహల్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోగా, అర్ష్‌దీప్, ముకేశ్ కుమార్ నిరాశపరిచారు. పాండ్యా కెప్టెన్సీ కూడా పేలవంగా ఉంది. గత మ్యాచ్‌లో అక్షర్ పటేల్‌కు బౌలింగ్ ఇవ్వకపోగా, కీలకదశలో చహల్‌కు బౌలింగ్ ఇవ్వకుండా విండీస్ గెలిచే అవకాశం సృష్టించాడు. ఈ తప్పులను దిద్దుకుంటేనే భారత్ గెలుపు బాట పట్టగలదు.

వారిద్దరిపై భారం...

వెస్టిండీస్ రెండుసార్లూ చక్కటి బౌలింగ్ ప్రదర్శనలతో మ్యాచ్‌లను సొంతం చేసుకోగలిగింది. పటిష్టమైన భారత లైనప్‌ను నిలువరించడంలో ఆ జట్టు సఫలమైంది. ముఖ్యంగా అకీల్ హొసీన్, మెకాయ్, జోసెఫ్‌లు నియంత్రణతో బౌలింగ్ చేస్తున్నారు. హోల్డర్ కూడా కీలక దశలో రాణించడం ఆ జట్టుకు సానుకూలాంశం. బ్యాటింగ్‌లో తన విలువేమిటో పూరన్ చూపించాడు. హెట్‌మైర్ కూడా జట్టు బ్యాటింగ్‌లో కీలకం. ఈ ఇద్దరు ఐపీఎల్ అనుభవం ఉన్న ఆటగాళ్లు జట్టును ఒంటిచేత్తో గెలిపించగల సమర్థులు. అదే తరహాలో మేయర్స్ కూడా రాణించాలని టీమ్ కోరుకుంటోంది. మొత్తంగా చూస్తే ఈ ఫార్మాట్‌లో అంత సులువుగా తలవంచమని చూపిన విండీస్ సిరీస్ గెలుపుపై దృష్టి పెట్టింది.

'2011 పునరావృతం చేస్తాం'

సొంతగడ్డపై ప్రపంచకప్ గెలుస్తామన్న భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ



న్యూఢిల్లీ: స్వదేశంలో అభిమానుల మద్దతుతో వన్డే వరల్డ్ కప్ గెలవగలమని భారత కెప్టెన్ రోహిత్ శర్మ విశ్వాసం వ్యక్తం చేశాడు. గత రెండు ప్రయత్నాల్లో తాము ట్రోఫీకి దూరమైనా... ఈసారి 2011 ప్రదర్శనను పునరావృతం చేస్తామని అతను అన్నాడు. ఎమ్మెస్ ధోని నాయకత్వంలో 2011లో గెలిచిన భారత జట్టులో రోహిత్ శర్మ సభ్యుడు కాదు. ఆ తర్వాత 2015, 2019లలో అతను ఆడిన సందర్భాల్లో టీమ్ సెమీఫైనల్ చేరింది. పుష్కరకాలం క్రితంలాగే ఈసారి సొంతగడ్డపై అభిమానుల మద్దతు తమకు అదనపు బలం అవుతుందని అతను అభిప్రాయపడ్డాడు. 'భారత జట్టు ఏ వేదికపై ఆడేందుకు వెళ్లినా పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ అండగా నిలుస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. 12 ఏళ్ల తర్వాత మళ్లీ భారత్‌లో వన్డే వరల్డ్ కప్ జరుగుతోంది. 2016 టి20 ప్రపంచకప్ జరిగినా వన్డే టోర్నీ ప్రత్యేకత వేరు. అభిమానులు ఎంతో ఉత్సాహంగా టోర్నీ కోసం ఎదురు చూస్తున్నారు. నేను ఇంత దగ్గరగా మొదటిసారి ట్రోఫీని చూస్తున్నాను. ఈసారి విజేతగా అందుకోవాలని కోరుకుంటున్నా' అని రోహిత్ వ్యాఖ్యానించాడు. అమెరికాలో ఐసీసీ ప్రపంచకప్ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న రోహిత్ ఈ సందర్భంగా టోర్నీని సంబంధించి తన పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నాడు. '2003లో సచిన్ అద్భుతంగా ఆడటంతోపాటు భారత్ ఫైనల్ వరకు చేరడం, 2007లో మన జట్టు విఫలం కావడం గుర్తున్నాయి. 2011కు సంబంధించి ఆనందం, బాధ ఉన్నాయి. నేను లేకపోవడంతో ఒకదశలో మ్యాచ్‌లు చూడవద్దని అనుకున్నా. కానీ తర్వాత చూశా. మన జట్టు క్వార్టర్స్ నుంచి చాలా బాగా ఆడింది. ఇక సభ్యుడిగా రెండు టోర్నీల్లో భాగమయ్యా' అని రోహిత్ చెప్పాడు.

భారత జూనియర్ బ్యాడ్మింటన్ జట్టు ప్రకటన

న్యూఢిల్లీ: వచ్చే నెలలో అమెరికాలో జరిగే ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 16 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో తెలంగాణ నుంచి ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. టీమ్, వ్యక్తిగత ఈవెంట్‌లో బాలుర సింగిల్స్‌లో లోకేశ్ రెడ్డి, బాలికల సింగిల్స్‌లో శ్రియాన్షి వలిశెట్టి ఉన్నారు. బాలికల డబుల్స్‌లో వెన్నెల-శ్రియాన్షి వలిశెట్టి... మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ రెడ్డి-వైష్ణవి ఖాడ్కేకర్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు.

ఎదురులేని భారత్

3-2తో కొరియాపై గెలుపుతో సెమీస్‌లోకి



చెన్నై: ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో ఎదురులేని భారత్ మూడో విజయాన్ని సాధించి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. సోమవారం జరిగిన పోరులో టీమిండియా 3-2 గోల్స్‌తో దక్షిణ కొరియాపై గెలుపొందింది. భారత్ తరఫున నీలకంఠ శర్మ (6వ నిమిషంలో), హర్మన్‌ప్రీత్ సింగ్ (23వ ని.లో), మన్‌దీప్ సింగ్ (33వ ని.లో) తలా ఒక గోల్ చేశారు. కొరియా బృందంలో సంగ్‌హ్యూన్ కిమ్ (12వ ని.లో), జిహున్ యంగ్ (58వ ని.లో) చెరో గోల్ చేశారు. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో 10 పాయింట్లతో భారత్ పట్టికలో అగ్రస్థానంలో ఉంది. రేపు తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో భారత్ ఆడుతుంది. ఇతర మ్యాచ్‌ల్లో పాకిస్తాన్ 2-1తో చైనాపై గెలుపొంది సెమీస్ ఆశల్ని నిలబెట్టుకుంది. మరోవైపు మలేసియా 3-1తో జపాన్‌ను ఓడించి సెమీఫైనల్‌కు అర్హత సంపాదించింది.

'సడన్‌డెత్'లో హారిక విజయం



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక... ఓపెన్ విభాగంలో నిహాల్ సరీన్, విదిత్ సంతోష్ గుజరాతి నాలుగో రౌండ్‌లోకి ప్రవేశించారు. సోమవారం జరిగిన మూడో రౌండ్ టైబ్రేక్ పోటీల్లో హారిక 5.5-4.5తో లెలా జవఖిష్‌విలి (జార్జియా)పై... నిహాల్ 2.5-1.5తో డేనియల్ బొగ్డాన్ (రొమేనియా)పై... విదిత్ 5-4తో మథియాస్ బ్లూబామ్ (జర్మనీ)పై విజయం సాధించారు. ఆదివారం రెండు క్లాసికల్ గేమ్‌లు 'డ్రా' కావడంతో హారిక-లెలా మధ్య విజేతను నిర్ణయించేందుకు సోమవారం టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. వీరిద్దరు ముందుగా 25 నిమిషాల నిడివి గల రెండు ర్యాపిడ్ గేమ్‌లు ఆడారు. రెండూ 'డ్రా'గా ముగియడంతో 2-2తో సమంగా నిలిచారు. దాంతో 10 నిమిషాలు నిడివిగల రెండు ర్యాపిడ్ గేమ్‌లు నిర్వహించారు. ఇందులో చెరో గేమ్‌లో గెలవడంతో స్కోరు 3-3తో సమమైంది. అనంతరం 5 నిమిషాల నిడివిగల రెండు ర్యాపిడ్ గేమ్‌లు ఆడించగా...రెండూ 'డ్రా' కావడంతో స్కోరు 4-4తో నిలిచింది. దాంతో విజేతను నిర్ణయించేందుకు ఆఖరుగా 3 నిమిషాల నిడివిగల 'సడన్‌డెత్' గేమ్‌లు మొదలయ్యాయి. 'సడన్‌డెత్'లో 'డ్రా' అయితే విజేత తేలేవరకు గేమ్‌లు నిర్వహిస్తారు, గెలిస్తే మాత్రం వెంటనే ముగిస్తారు. ఇందులో హారిక, లెలా తొలి గేమ్ 'డ్రా'కాగా... రెండో గేమ్‌లో హారిక 59 ఎత్తుల్లో నెగ్గి నాలుగో రౌండ్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.

సన్‌రైజర్స్ హెడ్ కోచ్‌గా వెటోరి

బ్రియాన్ లారాపై వేటు





హైదరాబాద్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో గత మూడేళ్లుగా పేలవ ప్రదర్శనతో 'ప్లే ఆఫ్స్'కు అర్హత సాధించలేకపోయిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈసారి కొత్త కోచ్‌తో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. రాబోయే సీజన్ కోసం న్యూజిలాండ్ మాజీ కెప్టెన్, కోచింగ్‌లో విశేష అనుభవం ఉన్న డానియెల్ వెటోరీని సన్‌రైజర్స్ హెడ్ కోచ్‌గా నియమించింది. 2023 సీజన్‌లో చివరి స్థానానికే పరిమితమైన హైదరాబాద్ టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించిన దిగ్గజ బ్యాటర్ బ్రియాన్ లారాను తొలగిస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. ఆరు సీజన్ల వ్యవధిలో వెటోరి సన్‌రైజర్స్‌కు నాలుగో కోచ్ కావడం విశేషం. 2019, 2022లలో టామ్ మూడీ, 2020, 2021లలో ట్రెవర్ బేలిస్ కోచ్‌లుగా వ్యవహరించగా, ఈ ఏడాది లారా బాధ్యతలు నిర్వర్తించాడు. 2016లో విజేతగా నిలిచిన తర్వాత మరో నాలుగు సీజన్ల పాటు 2020 వరకు సన్‌రైజర్స్ కనీసం 'ప్లే ఆఫ్స్'కు చేరింది. ఆ తర్వాత వరుసగా మూడేళ్ల పాటు 8వ, 8వ, 10వ స్థానాల్లో నిలిచింది. ఈ మూడు సీజన్లలో కలిపి సన్‌రైజర్స్ 13 మ్యాచ్‌లు మాత్రమే గెలిచి 29 మ్యాచ్‌లలో ఓటమిపాలైంది. 2023లోనైతే నాలుగే మ్యాచ్‌లు గెలిచి 10 ఓడింది. ఐపీఎల్‌లో ఐదేళ్ల పాటు (2014-18) వెటోరి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించాడు. ఇందులో రెండుసార్లు 'ప్లే ఆఫ్స్' చేరిన టీమ్ 2016 ఫైనల్లో హైదరాబాద్ చేతిలోనే ఓడింది. ఆ తర్వాత బిగ్‌బాష్, సీపీఎల్, వైటాలిటీ బ్లాస్ట్, హండ్రెడ్ లీగ్‌లలో వేర్వేరు టీమ్‌లకు కోచ్‌గా పని చేసిన వెటోరి ప్రస్తుతం ఆస్ట్రేలియా జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

అనిత X సంజయ్

12న డబ్ల్యూఎఫ్‌ఐ ఎన్నికలు



న్యూఢిల్లీ: ఇన్నాళ్లు రెజ్లర్ల ఆరోపణలు, నిరసనలతో తరచూ వార్తల్లోకెక్కిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) ఇప్పుడు ఎన్నికల హడావిడిలో ఉంది. 2010 ఢిల్లీ కామన్వెల్త్ గేమ్స్ చాంపియన్ రెజ్లర్ అనిత షెరాన్ అధ్యక్ష పదవి కోసం నామినేషన్ వేయగా, వివాదాస్పద డబ్ల్యూఎఫ్‌ఐ చీఫ్ బ్రిజ్‌భూషణ్ తన వీర విధేయుడు సంజయ్ కుమార్ సింగ్‌ను బరిలో దించాడు. నామినేషన్ల దాఖలు గడువు ముగియడంతో అధ్యక్ష పోటీ ఇప్పుడు మాజీ రెజ్లర్ అనిత, బ్రిజ్‌భూషణ్ నమ్మిన బంటు సంజయ్‌ల మధ్యే నెలకొంది. నిరసన దీక్షలో పాల్గొన్న రెజ్లర్లకు వెన్నుదన్నుగా నిలిచి మాట్లాడిన 38 ఏళ్ల అనితకు రెజ్లర్ల మద్దతు ఉంది. ఇప్పటికే విడుదలైన ఎన్నికల షెడ్యూలు ప్రకారం ఈ నెల 12న ఓటింగ్, అదే రోజు ఫలితాలు విడుదలవుతాయి.

సినిమా

కథా కేళి కొత్త ప్రయత్నంలా ఉంది

- 'దిల్' రాజు



హరీష్ శంకర్, 'దిల్' రాజు, సతీష్ వేగేశ్న

''సతీశ్ వేగేశ్న దర్శకత్వం వహించిన 'శతమానం భవతి' సినిమా మా బ్యానర్‌కి జాతీయ అవార్డును తీసుకొచ్చింది. ఇప్పుడు శతమానం భవతి ఆర్ట్స్ పేరుతో సతీశ్ బ్యానర్ పెట్టడం సంతోషంగా ఉంది. 'కథా కేళి' టీజర్ చూస్తుంటే సతీశ్ కొత్త ప్రయత్నం చేసినట్లు అనిపించింది. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. యశ్విన్, దినేశ్ తేజ్, అజయ్, బాలాదిత్య, పూజిత పొన్నాడ, నందిని, ఆయుషి, ప్రీతి, విరాట్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కథా కేళి'. చింతా గోపాల కృష్ణారెడ్డి సమర్పణలో సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ సినిమా లోగోను 'దిల్' రాజు విడుదల చేయగా, టీజర్‌ను డైరెక్టర్ హరీష్ శంకర్ రిలీజ్ చేశారు. సతీశ్ వేగేశ్న మాట్లాడుతూ– ''నేను ఇండస్ట్రీకి వచ్చి పాతికేళ్లు అయ్యింది. 'ప్రియా ఓ ప్రియా' చిత్రంలో నా పేరుని మొదటిసారి స్క్రీన్ పై చూసుకున్నాను. ఆ రోజు నుంచి ఈరోజు వరకు రైటర్‌గా, డైరెక్టర్‌గా నిలబడ్డాను. ఈవీవీ సత్యనారాయణగారి మాటల స్ఫూర్తితోనే ఈ బ్యానర్ పెట్టాను. నేను స్టార్ట్ చేసిన 'కోతి కొమ్మచ్చి, శ్రీశ్రీశ్రీ రాజావారు' సినిమాలు ఆలస్యం అవుతుండటంతో ఈ గ్యాప్‌లో ఓ కాన్సెప్ట్ బేస్డ్ సినిమా చేద్దామని 'కథా కేళి' తీశా'' అన్నారు.

వృషభ నాకో అందమైన జర్నీ

- హాలీవుడ్ నిర్మాత నిక్ తుర్లో



నంద కిశోర్, విశాల్ గుర్నాని, నిక్ తుర్లో

'మూన్ లైట్ (2016), త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ' (2017) వంటి పలు హాలీవుడ్ చిత్రాలకు నిర్మాతగా, సహనిర్మాతగా వ్యవహరించిన నిక్ తుర్లో తొలిసారి భారతీయ భాషా చిత్రానికి నిర్మాణ భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. మోహన్ లాల్, రోషన్ మేక తండ్రీ కొడుకులుగా, శనయ కపూర్, జహ్రా ఖాన్ కీ రోల్స్‌లో నటిస్తున్న 'వృషభ' చిత్రానికి ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు నిక్. ఈ సందర్భంగా నిక్ మాట్లాడుతూ – ''వృషభ' నా ఫస్ట్ ఇండియన్ మూవీ. నేను చేస్తున్న తొలి బహు భాషా సినిమా కూడా ఇదే. 'వృషభ' నాకో అందమైన జర్నీ అవుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు. నంద కిషోర్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని అభిషేక్ వ్యాస్, విశాల్ గుర్నాని, జుహి పరేఖ్ మెహతా, శ్యామ్ సుందర్, ఏక్తా కపూర్, శోభా కపూర్, వరుణ్ మథూర్, సౌరభ్ మిశ్రాలు నిర్మిస్తున్నారు. తెలుగు, మలయాళ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రం హిందీ, కన్నడ, తమిళ భాషల్లోనూ రిలీజ్ కానుంది.

గద్దర్ మృతికి టీఎఫ్‌సీసీ, టీఎఫ్‌పీసీ సంతాపం

ప్రముఖ కవి, గాయకుడు గద్దర్ (గుమ్మడి విఠల్ రావు) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతి పట్ల తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ), తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (టీఎఫ్‌పీసీ) సంతాపం తెలిపాయి. ఈ మేరకు టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు వి. వెంకటరమణా రెడ్డి ('దిల్' రాజు), గౌరవ కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్, టీఎఫ్‌పీసీ అధ్యక్షుడు కేఎల్ దామోదర్ ప్రసాద్, గౌరవ కార్యదర్శులు టి. ప్రసన్న కుమార్, వైవీఎస్ చౌదరి వేరు వేరు ప్రకటనలు విడుదల చేశారు. ''తెలుగు సినిమాల్లో అభ్యుదయ గీతాలంటే గద్దర్ పేరు తలచుకోవాల్సిందే. 'మా భూమి, భద్రం కొడుకో' చిత్రాల్లో ఆయన పాడిన పాటలు చాలా పాపులర్ అయ్యాయి. ప్రతి పాటను సందేశంగా మలిచి ప్రజలను ఆకట్టుకొనేలా ఆడి, పాడడం సాధారణ విషయం కాదు'' అన్నారు.

యాక్షన్‌కి సై

ఒకరు తుపాకీ పట్టుకున్నారు.. ఇంకొకరు ఫ్లయిట్ ఎక్కారు... ఫైట్ చేయడానికి రెడీ అయ్యారు. 'యాక్షన్‌కి సై' అంటూ బరిలోకి దిగారు. ప్రత్యర్థులను రఫ్ఫాడారు. సుకుమారంగా కనిపించే కథానాయికలు రఫ్‌గా మారిపోయి, విలన్లను ఇరగదీశారు. సమంత, త్రిష, కీర్తీ సురేశ్, దీపికా పదుకోన్, కత్రినా కైఫ్, ఆలియా భట్, కృతీ సనన్ వంటి నాయికలు సినిమాల్లో, వెబ్ సిరీస్‌ల్లో యాక్షన్ రోల్స్ చేస్తున్నారు. ఆ విశేషాలు తెలుసుకుందాం.



దీపికా పదుకోన్
కంగనా రనౌత్



త్రిష
సమంత

పవర్‌ఫుల్ రీటా

ఓ వైపు హీరోయిన్‌గా అగ్రహీరోల సరసన నటిస్తూనే మరో వైపు కథానాయిక ప్రాధాన్యం ఉన్న చిత్రాలతో మెప్పిస్తున్నారు కీర్తీ సురేశ్. ప్రస్తుతం ఆమె లీడ్ రోల్‌లో నటిస్తున్న తమిళ చిత్రం 'రివాల్వర్ రీటా'. చంద్రు దర్శకత్వం వహిస్తున్నారు. కామెడీ, థ్రిల్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో కీర్తీ సురేశ్ యాక్షన్ సీన్స్ చేస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌లో రెండు చేతుల్లో రెండు రివాల్వర్స్ పట్టుకుని ఉన్న కీర్తి పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమా తెలుగులోనూ విడుదల కానుంది. కాగా 'సైరన్, రఘు తాత, కన్ని వెడి' వంటి చిత్రాలతో ఫుల్ బిజీగా ఉన్నారు కీర్తీ సురేశ్. వీటిలో 'కన్ని వెడి' లేడీ ఓరియంటెడ్ మూవీ. 'రఘు తాత' కూడా దాదాపు ఇలాంటి సినిమానే. ఇక చిరంజీవి చెల్లెలిగా కీర్తి నటించిన 'భోళా శంకర్' ఈ 11న విడుదల కానున్న విషయం తెలిసిందే.

బాలీ టు హాలీవుడ్

బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకోన్ ఈ మధ్య ఎక్కువగా యాక్షన్ సినిమాలకు పచ్చజెండా ఊపుతున్నారు. ఈ ఏడాది జనవరిలో విడుదలైన షారుక్ ఖాన్ 'పఠాన్' మూవీలో యాక్షన్ సీన్స్‌లో అదరగొట్టిన దీపిక ప్రస్తుతం 'ఫైటర్', 'సింగం 3' వంటి చిత్రాల్లో యాక్షన్ రోల్స్‌కి సై అన్నారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న 'ఫైటర్' కోసం ప్రత్యేకంగా స్టంట్స్‌లో శిక్షణ తీసుకున్నారు దీపిక. అలాగే 'సింగం' ఫ్రాంచైజీలో భాగంగా 'సింగం 3' రూపొందనుంది. 'సింగం', 'సింగం 2' చిత్రాలు తెరకెక్కించిన రోహిత్ శెట్టి దర్శకత్వంలోనే 'సింగం 3' తెరకెక్కనుంది. ఈ మూడో భాగం హీరోయిన్ ఓరియంటెడ్‌గా సాగనుందట. ఇందులో దీపికా పవర్‌ఫుల్ పోలీస్‌గా కనిపించనున్నారు. ఈ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. అలాగే ఓ హాలీవుడ్ మూవీలో ఏజెంట్‌గా కనిపించనున్నారట దీపిక. ఈ చిత్రంలోనూ ఆమె యాక్షన్ సీన్స్ చేయనున్నారని భోగట్టా. ఇలా బాలీవుడ్ టు హాలీవుడ్ యాక్షన్ రోల్స్ సైన్ చేసి జోరుగా దూసుకెళుతున్నారు దీపికా పదుకోన్.

టైగర్‌తో యాక్షన్

సల్మాన్ ఖాన్‌కి సమానంగా కాకపోయినా తనదైన శైలిలో ఫైట్స్ చేశారు కత్రినా కైఫ్. 'టైగర్' ఫ్రాంచైజీలో భాగంగా సల్మాన్ ఖాన్ టైటిల్ రోల్‌లో దర్శకుడు మనీష్ శర్మ తెరకెక్కిస్తోన్న చిత్రం 'టైగర్ 3'. ఇందులో కత్రినా కైఫ్ హీరోయిన్. హీరో హీరోయిన్లు ఇద్దరూ గూఢచారుల పాత్రల్లో నటిస్తున్నారట. ఐఎస్ఐ ఏజెంట్ జోయా పాత్రలో కత్రినా కనిపించనున్నారని సమాచారం. ఈ హై ఓల్టేజ్ యాక్షన్ మూవీలో జోయాగా కత్రినా చేసిన ఫైట్స్ హైలైట్‌గా ఉంటాయని ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ ఫైట్స్ కోసం ప్రత్యేకించి సౌత్ కొరియాకు చెందిన స్టంట్ మాస్టర్ల దగ్గర 14 రోజులు శిక్షణ తీసుకున్నారట కత్రినా. ఈ చిత్రం నవంబర్ 10న రిలీజ్ కానుంది.



కీర్తీ సురేశ్



కత్రినా కైఫ్



కృతీ సనన్



ఆలియా భట్

వెబ్‌లో యాక్షన్

కొందరు కథానాయికలు వెండితెరపై యాక్షన్ రోల్స్ చేస్తుంటే త్రిష, సమంత వంటి తారలు వెబ్ సిరీస్‌లో ఈ తరహా పాత్రలు చేస్తున్నారు. రెండు దశాబ్దాల కెరీర్‌లో ఎన్నో గుర్తుండిపోయే పాత్రలను పోషించిన త్రిష తొలిసారి 'బృందా' అనే వెబ్ సిరీస్‌లో నటించారు. సూర్య వంగల్ దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్‌లో త్రిష ఓ పవర్ పోలీసాఫీసర్ పాత్ర చేశారు. త్రిషలోని మాస్ ఇమేజ్‌ని బలంగా చూపించే పాత్ర ఇది. త్వరలో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. మరోవైపు ఆ మధ్య వరుసగా హీరోల సరసన నటించిన సమంత ఇటీవల లేడీ ఓరియంటెడ్ చిత్రాలు ఎక్కువగా చేస్తున్నారు. ఈ బ్యూటీ నటించిన తొలి వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మేన్ 2'. దర్శక ద్వయం రాజ్-డీకే తెరకెక్కించిన ఈ సిరీస్‌లో సమంత యాక్షన్ రోల్‌లో అదరగొట్టారు. ప్రస్తుతం సమంతతోనే ఈ దర్శక-ద్వయం 'సిటాడెల్' అనే మరో వెబ్ సిరీస్ రూపొందిస్తున్నారు. ప్రియాంకా చోప్రా నటించిన అమెరికన్ సైన్స్ ఫిక్షన్ హిట్ డ్రామా 'సిటాడెల్' ఆధారంగా ఈ వెబ్ సిరీస్ తెరకెక్కుతోంది. గూఢచారి సాహసాల నేపథ్యంలో పూర్తి స్థాయి యాక్షన్ సిరీస్‌గా రూపొందుతోంది. ఇందులో సమంత యాక్షన్ సీన్స్‌లో అలరించనున్నారు. సెప్టెంబర్ నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ అయ్యే అవకాశం ఉంది.

యుద్ధ విమానం ఎక్కి..

దాదాపు లేడీ ఓరియంటెడ్ సినిమాలకే పరిమితమయ్యారు కంగనా రనౌత్. సర్వేష్ మేవారా దర్శకత్వంలో ఆమె లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'తేజస్'. ఈ చిత్రంలో ఆమె యుద్ధ విమానాలు నడిపే పైలెట్ పాత్ర చేశారు. కంప్లీట్ యాక్షన్ ఓరియంటెడ్‌గా రూపొందిన ఈ చిత్రం కోసం పలు యుద్ధ విద్యలు కూడా నేర్చుకున్నారు కంగన. ఇందుకోసం దాదాపు నాలుగు నెలల పాటు ఆమె శిక్షణ తీసుకున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంచితే.. కంగనా రనౌత్ లీడ్ రోల్‌లో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో 'ఎమర్జెన్సీ' చిత్రం నిర్మించారు. భారత ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో ఎమర్జెన్సీ (1975–1977) ఎందుకు విధించారు? ఆ పరిస్థితి ఎందుకు ఏర్పడింది? అనే అంశంతో 'ఎమర్జెన్సీ'ని తెరకెక్కించారు. ఇందిరా గాంధీగా కంగన నటించిన ఈ చిత్రం నవంబరు 24న విడుదల కానుంది. అలాగే పి. వాసు దర్శకత్వంలో లారెన్స్ హీరోగా కంగన టైటిల్ రోల్‌లో రూపొందిన 'చంద్రముఖి 2' సెప్టెంబరు 19న విడుదల కానుంది.

హాలీవుడ్‌లో యాక్షన్

అందం, అభినయంతో ప్రేక్షకులను అలరిస్తున్న హీరోయిన్ ఆలియా భట్ కూడా యాక్షన్‌కి సై అన్నారు. టామ్ హార్పర్ దర్శకత్వం వహించిన హాలీవుడ్ చిత్రం 'హార్ట్ ఆఫ్ స్టోన్'లో ఆలియా కీలక పాత్ర చేశారు. స్పై యాక్షన్ మూవీగా రూపొందిన ఈ సినిమాలో యాక్షన్ సీక్వెన్స్ కోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు ఆలియా భట్. ఈ నెల 11న ఈ సినిమా విడుదల కానుంది.

బైక్‌పై దూసుకెళుతూ...

ఇటీవల విడుదలైన 'ఆది పురుష్'లో సుకుమారి సీతగా కనిపించిన కృతీ సనన్ ఇప్పుడు అందుకు పూర్తి విభిన్నంగా రూడ్‌గా మారిపోయారు. వికాస్ బాల్ దర్శకత్వం వహించిన 'గణ్‌పథ్: పార్ట్ 1'లో ఆమె పవర్‌ఫుల్ రోల్ చేశారు. ఈ సినిమా కోసం కృతి అద్భుతమైన బైక్ స్టంట్స్ చేశారు. ఇందుకోసం బైక్ స్టంట్స్ నేర్చుకున్నారామె. అమితాబ్ బచ్చన్, టైగర్ ష్రాఫ్ నటించిన ఈ చిత్రం అక్టోబర్ 20న విడుదల కానుంది.

ఇంతేనా.. ఇంకొందరు కథానాయికలు యాక్షన్ రోల్స్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, తామేంటో నిరూపించుకోవడానికి రెడీ అవుతున్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	232	65,953
నిఫ్టీ ▲	80	19,597

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,941	▲	32
డోజోన్స్	35,441	▲	375
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,554	▼	10
డాక్స్	15,951	▼	1
షాంఘై	3,269	▼	19
నికాయ్	32,255	▲	62

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	59,327
బంగారం (99.5 స్వచ్ఛత)	59,089
వెండి (కిలో)	71,848

పేటీఎంలో విజయ్‌కు మరింత వాటా!

10.3 శాతం కొనుగోలుకు సై



న్యూఢిల్లీ: పేటీఎం బ్రాండు ఫిన్‌టెక్ దిగ్గజం.. వన్97 కమ్యూనికేషన్స్‌లో సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో విజయ్ శేఖర్ శర్మ వాటా పెరగనుంది. యాంట్‌ఫిన్(నెదర్లాండ్స్) హోల్డింగ్స్ నుంచి 10.3 శాతం వాటాను విజయ్ సొంతం చేసుకోనున్నట్లు పేటీఎం తాజాగా పేర్కొంది. ఇందుకు ఎలాంటి నగదు చెల్లింపు ఉండదని, ఆఫ్‌మార్కెట్ లావాదేవీ ద్వారా వాటా బదిలీ ఉంటుందని తెలియజేసింది. అయితే ఈ వాటా ఎకనమిక్ రైట్స్ యాంట్‌ఫిన్ వద్దనే కొనసాగుతాయని వెల్లడించింది. ఒప్పందంలో భాగంగా విదేశీ సొంత సంస్థ రెజిలియంట్ అసెట్ మేనేజ్‌మెంట్ బీవీ ద్వారా వాటాను శర్మ కొనుగోలు చేయనున్నట్లు వివరించింది. దీనికి బదులుగా మార్పిడికి వీలయ్యే(ఆప్షనల్లీ కన్వర్టిబుల్) డిబెంచర్లను యాంట్‌ఫిన్‌కు రెజిలియంట్ జారీ చేయనున్నట్లు పేర్కొంది. ఈ లావాదేవీ కారణంగా కంపెనీ యాజమాన్య నియంత్రణలో ఎలాంటి మార్పులు చోటుచేసుకోబోవని స్పష్టం చేసింది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం ఈ లావాదేవీతో పేటీఎంలో శర్మ వాటా 19.42 శాతానికి చేరనుంది. వెరసి కంపెనీలో అతిపెద్ద వాటాదారుగా నిలవనున్నారు. మరోపక్క యాంట్‌ఫిన్ వాటా 23.79 శాతం నుంచి 13.5 శాతానికి తగ్గనున్నట్లు తెలుస్తోంది. కాగా.. పేటీఎం బోర్డులో యాంట్‌ఫిన్ నామినీ ఉండబోరు. యాంట్‌ఫిన్.. చైనా దిగ్గజం యాంట్ గ్రూప్ అనుబంధ కంపెనీ అన్న సంగతి తెలిసిందే.

షేరు జూమ్

సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో విజయ్ శేఖర్ శర్మ వాటా పెరగనున్న వార్తల నేపథ్యంలో ఫిన్‌టెక్ దిగ్గజం పేటీఎం కౌంటర్లో లావాదేవీలు ఊపందుకున్నాయి. షేరు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో 7 శాతం జంప్‌చేసి రూ. 851 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో దాదాపు 12 శాతం దూసుకెళ్లి రూ. 888కు చేరింది. ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ రూ. 3,511 కోట్లు ఎగసి రూ. 53,957 కోట్లను అధిగమించింది.

టీవీఎస్ సప్లైచైన్@ రూ.187-197

ఈ నెల 10–14 మధ్య పబ్లిక్ ఇష్యూ

న్యూఢిల్లీ: టీవీఎస్ గ్రూప్ సంస్థ టీవీఎస్ సప్లైచైన్ సొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 10న ప్రారంభం కానుంది. 14న ముగియనున్న ఇష్యూకి ధరల శ్రేణి రూ. 187–197. తద్వారా రూ. 880 కోట్లు సమీకరించనుంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.42 కోట్ల షేర్లను కంపెనీ ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫర్ చేయనున్నారు. ఇష్యూ తదుపరి టీవీఎస్ మోటార్స్ వాటా 10% తగ్గి 42%కి పరిమితం కానుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 76 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయాలి.

అదానీ గ్రీన్ ఎనర్జీలో క్యూఐఏకి వాటాలు

రూ. 3,920 కోట్లతో దాదాపు 2.5 శాతం పైగా వాటాల కొనుగోలు



న్యూఢిల్లీ: అదానీ గ్రీన్ ఎనర్జీ (ఏజీఈఎల్)లో ఖతార్‌కు చెందిన సార్వభౌమ నిధి ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (క్యూఐఏ) 2.5 శాతం పైగా వాటాలను కొనుగోలు చేసింది. ఇందుకోసం సుమారు రూ. 3,920 కోట్లు వెచ్చించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై లిమిటెడ్ (ఏఈఎంఎల్)లో 2020లో 25.1 శాతం వాటాలు కొనుగోలు చేసిన క్యూఐఏ మళ్లీ అదానీ గ్రూప్‌లో ఇన్వెస్ట్ చేయడం ఇది రెండోసారి. స్టాక్ ఎక్స్ఛేంజీల డేటా ప్రకారం ప్రమోటర్ గ్రూపు సంస్థ ఇన్ఫినిట్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ .. ఏజీఈఎల్‌లో సుమారు 4.49 కోట్ల షేర్లను (2.8 శాతం వాటా) షేరు ఒక్కింటికి రూ. 920 చొప్పున మొత్తం రూ. 4,131 కోట్లకు విక్రయించింది. క్యూఐఏ అనుబంధ సంస్థ అయిన ఐఎన్‌క్యూ హోల్డింగ్ 4.26 కోట్ల షేర్లను (దాదాపు 2.68 శాతం వాటా) కొనుగోలు చేసింది. సగటున రూ. 920 రేటు చొప్పున ఇందుకోసం మొత్తం రూ. 3,920 కోట్లు వెచ్చించింది.

జాలిమ్ లోషన్ బ్రాండ్ ప్రచారకర్తగా గోవిందా



హైదరాబాద్: జాలిమ్ లోషన్ తన బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ నటుడు గోవిందాను నియమించుకుంది. ''దేశవ్యాప్తంగా పేరున్న నటుడు మా బ్రాండ్‌కు ప్రచారకర్తగా నియమితులు కావడం సంతోషంగా ఉంది. విస్తృత ప్రచారం ద్వారా బ్రాండ్‌ను ప్రజలకు మరింత చేరువ చేస్తారు'' అని కంపెనీ ఎండీ నవీన్ ఝూ తెలిపారు. ఉత్పత్తుల విక్రయాలు కూడా గణనీయంగా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల తమ ప్రొడక్ట్ పేరుతో కొన్ని కంపెనీలు నకిలీ లోషన్‌ను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయని, వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నవీన్ కోరారు.

ఒలెక్ట్రా లాభం రూ.18 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహన తయారీలో ఉన్న ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ జూన్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.16.7 కోట్ల నుంచి రూ.18 కోట్లకు చేరింది. ఈపీఎస్ రూ.2.03 నుంచి రూ.2.20కి ఎగసింది. టర్నోవర్ రూ.283 కోట్ల నుంచి రూ.217 కోట్లకు పడిపోయింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఒలెక్ట్రా షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే సోమవారం 0.17 శాతం క్షీణించి రూ.1,136.90 వద్ద స్థిరపడింది.

రాణించిన ఫార్మా, ఐటీ షేర్లు

- 19,600 చేరువలో నిఫ్టీ
- సెన్సెక్స్ లాభం 232 పాయింట్లు
- సూచీలకు రెండోరోజూ లాభాలు



ముంబై: ఫార్మా, ఐటీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ లాభపడ్డాయి. అయితే విదేశీ ఇన్వెస్టర్ల నిధుల ఉపసంహరణ మార్కెట్ భారీ ర్యాలీకి ప్రతిబంధకంగా మారింది. ఈ వారంలో ఆర్‌బీఐ ద్రవ్య విధాన వైఖరి, అమెరికా ద్రవ్యోల్బణ డేటాతో సహా పలు దేశాల కీలక స్థూల ఆర్థిక గణాంకాల వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం సానుకూలంగా మొదలయ్యాయి. ట్రేడింగ్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో లాభ, నష్టాల మధ్య కదలాడుతూ ఊగిసలాట వైఖరిని ప్రదర్శించాయి. సెన్సెక్స్ ఉదయం 90 పాయింట్లు పెరిగి 65,811 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 65,748 వద్ద కనిష్టాన్ని, 66,068 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 232 పాయింట్లు పెరిగి 65,953 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 60 పాయింట్లు బలపడి 19,577 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ఇంట్రాడేలో 19,525 – 19,620 పరిధిలో కదలాడింది. ఆఖరికి 80 పాయింట్లు పెరిగి 19,597 వద్ద నిలిచింది. ఫార్మా, ఐటీతో పాటు ఇంధన, రియల్టీ, ఆటో షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు అరశాతం చొప్పున లాభపడ్డాయి. బ్యాంకులు, మెటల్, మీడియా, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,893 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,081 కోట్ల షేర్లను కొన్నారు. సెన్సెక్స్ 232 పాయింట్లు లాభపడటంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.22 లక్షల కోట్లు పెరిగి రూ.305.38 లక్షల కోట్లకు చేరింది. అమెరికా బాండ్లపై రాబడులు పెరగడం, యూరోజోన్ స్థూల ఆర్థిక గణాంకాలు నిరాశపరచడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో అధిక భాగం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- జూన్ క్వార్టర్‌లో నికర లాభం 56.04% వృద్ధి చెందడంతో మహీంద్రా అండ్ మహీంద్రా షేరు 4% లాభపడి రూ.1,527 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నాలుగున్నర శాతం దూసుకెళ్లి రూ.1,531 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. దీంతో కంపెనీ విలువ ఒక్క రోజులో రూ.7,673 కోట్లు పెరిగి రూ.1.90 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ సూచీలో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే.
- యధార్థ్ హాస్పిటల్ అండ్ ట్రామా కేర్ సర్వీసెస్ లిమిటెడ్ షేరు లిస్టింగ్ రోజు 11% ర్యాలీ చేసింది. ఈక్విటీ మార్కెట్లలోని అస్థిరత పరిస్థితుల దృష్ట్యా బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.300)తో పోలిస్తే 2% స్వల్ప ప్రీమియంతో రూ.306 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 14% ఎగసి రూ.343 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 11% లాభంతో రూ.334 వద్ద స్థిరపడింది. ఎక్స్ఛేంజీలో మొత్తం 15.16 లక్షల ఈక్విటీ షేర్లు చేతులు మారాయి. కంపెనీ విలువ రూ.2,854 కోట్లుగా నమోదైంది.
- తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలను అందుకోవడంలో విఫలం కావడంతో బ్రిటానియా షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ఎన్ఎస్ఈలో రెండున్నర శాతానికి పైగా నష్టపోయి రూ.4,670 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో నాలుగుశాతం క్షీణించి రూ.4618 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని దిగివచ్చింది. నిఫ్టీ–50 సూచీలో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే కావడం గమనార్హం.

ఎలక్ట్రిక్ ఆటోపరికరాల తయారీకి కొత్త కంపెనీ

కైనెటిక్ వాట్స్ అండ్ వోల్ట్స్‌ను నెలకొల్పిన కైనెటిక్ ఇంజినీరింగ్



ముంబై: ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ పరికరాల తయారీ కోసం కొత్తగా అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు కైనెటిక్ ఇంజినీరింగ్ వెల్లడించింది. కైనెటిక్ వాట్స్ అండ్ వోల్ట్స్ పేరుతో 2022లో దీన్ని నెలకొల్పినట్లు తెలిపింది. ఇది మోటార్లు, కంట్రోలర్లు, బ్యాటరీలు మొదలైనవి తయారు చేస్తుందని పేర్కొంది. కొత్త కంపెనీలో మాతృ సంస్థకు 92 శాతం, ప్రమోటర్లయిన ఫిరోదియా కుటుంబానికి మిగతా 8 శాతం వాటాలు ఉంటాయి వ్యూహాత్మక/ఆర్థిక భాగస్వామికి 25 శాతం వరకు వాటాను విక్రయించేందుకు కూడా కంపెనీ సిద్ధంగా ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కేఈఎల్, కైనెటిక్ కమ్యూనికేషన్స్ కింద ఉన్న తమ ప్రస్తుత ఈవీ (ఎలక్ట్రిక్ వాహనాలు) వ్యాపారాన్ని కొత్త సంస్థలో విలీనం చేయనున్నట్లు కైనెటిక్ ఇంజినీరింగ్ ఎండీ అజింక్యా ఫిరోదియా తెలిపారు. తాము ఇప్పటికే ఎలక్ట్రిక్ వాహనాల కోసం గేర్‌బాక్సులు, ఛాసిస్‌లను తయారు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. దేశీయంగా 700 పైచిలుకు సంస్థలు ద్విచక్ర ఈవీలను ఉత్పత్తి చేస్తున్న నేపథ్యంలో తమకు భారీగా వ్యాపార అవకాశాలు ఉన్నాయని ఆయన ఫిరోదియా చెప్పారు.

టెస్లా సీఎఫ్‌వోగా వైభవ్



న్యూయార్క్: ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా భారత సంతతికి చెందిన వైభవ్ తనేజా (45) నియమితులయ్యారు. ప్రస్తుత సీఎఫ్‌వో జాకరీ కిర్‌కోర్న్ తప్పుకోవడంతో ఆ స్థానంలో తనేజా నియమితులయ్యారు. 2019 నుంచి తనేజా టెస్లా చీఫ్ అకౌంటింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. అంతకుముందు 2016లో టెస్లా కొనుగోలు చేసిన సోలార్‌సిటీ కార్పొరేషన్‌లో ఫైనాన్స్, అకౌంటింగ్ విభాగాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. దానికి పూర్వం 1999 నుంచి 2016 వరకు ప్రైస్‌వాటర్‌హౌస్‌కూపర్స్‌లో పని చేశారు.

ఐఓసీ చైర్మన్‌గా మరో ఏడాది శ్రీకాంత్ మాధవ్ వైద్య



న్యూఢిల్లీ: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) చైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్యకు ప్రభుత్వం పదవీ విరమణ తర్వాత ఒక సంవత్సరం పాటు బాధ్యతల పొడిగింపును ఇచ్చింది. ఒక ప్రభుత్వ రంగ సంస్థలో ఈ తరహా నిర్ణయం చాలా అరుదని అత్యున్నత స్థాయి వర్గాలు పేర్కొంటున్నాయి. నిజానికి సెప్టెంబర్ 1న వైద్య తన ప్రస్తుత బాధ్యత నుంచి పదవీ విరమణ చేయాల్సి ఉంది. శ్రీకాంత్ మాధవ్ వైద్య కాంట్రాక్ట్ విధానం ప్రాతిపదికన సంస్థకు మరో ఏడాది పాటు చైర్మన్‌గా కొనసాగుతారు.

విద్య, ఉద్యోగ సమాచారం

తపాలా శాఖలో 30,041 గ్రామీణ డాక్ సేవక్ పోస్టులు

దేశవ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలో.. గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) పోస్టుల భర్తీకి తపాలా శాఖ దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 30,041
- **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్–1058, తెలంగాణ–961.
- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇందులో మ్యాథ్స్, ఇంగ్లిష్, స్థానిక భాష ఉండటం తప్పనిసరి. ఏపీ, తెలంగాణకు చెందినవారు తెలుగు సబ్జెక్టు పదో తరగతి వరకు చదివి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానంతోపాటు సైకిల్ తొక్కటం రావాలి.
- **వయసు:** 18 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ట వయసులో సడలింపు వర్తిస్తుంది.
- **వేతనం:** నెలకు బీపీఎం పోస్టులకు రూ.12,000 నుంచి రూ.29,380, ఏబీపీఎం/డాక్ సేవక్ పోస్టులకు రూ.10,000 నుంచి రూ.24,470 వేతనం ఉంటుంది.
- **ఎంపిక విధానం:** అభ్యర్థులు పదో తరగతిలో సాధించిన మార్కుల మెరిట్ ప్రకారం నియామకాలు చేపడతారు. ఎంపికైన వారికి సమాచారం ఎస్ఎంఎస్/ఈమెయిల్ /పోస్టు ద్వారా అందుతుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.08.2023
- **దరఖాస్తు సవరణలకు అవకాశం:** 24.08.2023 నుంచి 26.08.2023 వరకు
- **వెబ్‌సైట్:** indiapostgdsonline.gov.in

ఎస్ఎస్‌సీలో 1207 స్టెనోగ్రాఫర్ పోస్టులు

న్యూఢిల్లీలోని స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. దేశవ్యాప్తంగా వివిధ మంత్రిత్వ శాఖల్లో/విభాగాల్లో/సంస్థల్లో ఖాళీగా ఉన్న స్టెనోగ్రాఫర్ గ్రేడ్ సి(గ్రూప్ బి, నాన్ గెజిటెడ్), స్టెనోగ్రాఫర్ గ్రేడ్ డి(గ్రూప్ సి) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 1207
- **విభాగాలు:** సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ కోఆపరేషన్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ వాటర్ రిసోర్సెస్, రివర్ డెవలప్‌మెంట్ అండ్ రెజువెనేషన్, ఇండియన్ మెటియోరాలాజికల్ డిపార్ట్‌మెంట్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా తదితరాలు.
- **అర్హత:** ఇంటర్మీడియట్/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. స్టెనోగ్రఫీలో నైపుణ్యం ఉన్న అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు.
- **వయసు:** 01.08.2023 నాటికి స్టెనోగ్రాఫర్ గ్రేడ్–సి పోస్టులకు 18 నుంచి 30 ఏళ్లు, గ్రేడ్–డి పోస్టులకు 18 నుంచి 27 ఏళ్లు మించకూడదు. వివిధ కేటగిరీల వారీగా వయో సడలింపు కల్పించారు.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్టెనోగ్రఫీలో స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌లో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రెహెన్షన్ అంశాల్లో ప్రశ్నలుంటాయి.
- **ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ,విశాఖపట్నం,హైదరాబాద్,వరంగల్

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.08.2023
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 24.08.2023 నుంచి 25.08.2023 వరకు
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష షెడ్యూల్:** అక్టోబర్ 2023.
- **వెబ్‌సైట్:** https://ssc.nic.in

కాళోజీ వర్సిటీలో ఎంపీహెచ్ కోర్సుల్లో ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్రంలో కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం..మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఎంపీహెచ్) కోర్సులో 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సు:** మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఎంపీహెచ్)
- **కోర్సు వ్యవధి:** రెండేళ్లు(నాలుగు సెమిస్టర్లు).
- **సీట్ల సంఖ్య:** 60 సీట్లు(కాంపిటెంట్ అథారిటీ కోటా–30 సీట్లు, మేనేజ్‌మెంట్ కోటా–24సీట్లు, ఫారెన్ నేషనల్స్ కోటా–06 సీట్లు).
- **అర్హత:** కనీసం 50శాతం మార్కులతో ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** వయోపరిమితి లేదు.
- **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.08.2023
- **హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభం:** 21.08.2023.
- **కంప్యూటర్ ఆధారిత ప్రవేశపరీక్ష తేది:** 27.08.2023.
- **వెబ్‌సైట్:** www.knruhs.telangana.gov.in

'యశస్వి'తో.. స్కాలర్‌షిప్స్ బాటలో!

- పాఠశాల విద్యలో స్కాలర్‌షిప్స్‌కు పీఎం యశస్వి స్కీమ్
- ఓబీసీ, ఈబీసీ, డీ–నోటిఫైడ్ గిరిజన విద్యార్థులకు ఉపకార వేతనం
- యంగ్ అచీవర్స్ టెస్ట్ (వైఈటీ) ద్వారా అభ్యర్థుల ఎంపిక
- తొమ్మిది, పదకొండు తరగతుల విద్యార్థులు అర్హులు
- తాజాగా 2023–24కు వైఈటీ నోటిఫికేషన్ విడుదల

ఫీజుల భారం కారణంగా విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్స్‌తో చేయూతనిస్తోంది. అందుకోసం పీఎం–యశస్వి పేరుతో ప్రత్యేక స్కాలర్‌షిప్ పథకానికి రూపకల్పన చేసింది! దీనిద్వారా విద్యార్థులు తమ సమీప ప్రాంతంలోని ప్రముఖ స్కూల్స్‌లో.. తొమ్మిదో తరగతి, పదకొండో తరగతిలో చేరి ప్రతి నెల స్కాలర్‌షిప్ అందుకోవచ్చు!! ఇందుకోసం ఎన్‌టీఏ నిర్వహించే యంగ్ అచీవర్స్ టెస్ట్ (వైఈటీ)లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. తాజాగా 2023 సంవత్సరానికి సంబంధించి.. వైఈటీ నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. పీఎం–యశస్వి స్కీమ్‌తో ప్రయోజనాలు, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..



దేశంలో హైస్కూల్ స్థాయిలో డ్రాప్–అవుట్స్ సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు(ఈబీసీ), ఓబీసీలు, గిరిజన ప్రాంతాల్లోని డీ–నోటిఫైడ్ ట్రైబ్స్ వర్గాలకు చెందిన విద్యార్థుల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. వీరికి స్కాలర్‌షిప్ ద్వారా చేయూతనందించి ఉన్నత విద్యవైపు ప్రోత్సహించేందుకు రూపొందించిన స్కాలర్‌షిప్స్ పథకమే.. పీఎం యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా(పీఎం యశస్వి).

9 నుంచి 12వ తరగతి వరకు స్కాలర్‌షిప్

- పీఎం–యశస్వి స్కాలర్‌షిప్ పథకం మార్గనిర్దేశాల ప్రకారం–ప్రభుత్వం గుర్తించిన అత్యున్నత శ్రేణి పాఠశాలల్లో చదువుతున్న ఓబీసీ, ఈబీసీ, డీ–నోటిఫైడ్ ట్రైబ్స్ వర్గాలకు చెందిన పిల్లలకు తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతి నెల నిర్దిష్ట మొత్తంలో స్కాలర్‌షిప్ అందిస్తారు.
- తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు ఏటా రూ.75 వేలు; పదకొండు, పన్నెండు తరగతుల విద్యార్థులకు ఏటా రూ.1.25 లక్షలు చొప్పున స్కాలర్‌షిప్ లభిస్తుంది.

ఈ ఏడాది 30 వేల మందికి

2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి జాతీయ స్థాయిలో మొత్తం 30 వేల మందికి పీఎం–యశస్వి స్కాలర్‌షిప్స్‌ను అందించనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్రాల వారీగా కోటాను పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 1,401 మంది; తెలంగాణలో 1,001 మంది విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్స్ అందించనున్నారు. మొత్తం స్కాలర్‌షిప్‌ల సంఖ్యలో 30 శాతం స్కాలర్‌షిప్స్‌ను అమ్మాయిలకు కేటాయిస్తారు.

అర్హతలు

- తొమ్మిదో తరగతి స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2022–23లో ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత పొందాలి.
- పదకొండో తరగతికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2022–23లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలి.
- విద్యార్థుల కుటుంబ వార్షికాదాయం రూ.2.5 లక్షల లోపు ఉండాలి.
- స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులకు 75 శాతం హాజరు ఉంటేనే తదుపరి ఏడాది స్కాలర్‌షిప్‌ను కొనసాగిస్తారు.

వయసు

- తొమ్మిదో తరగతికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఏప్రిల్ 1, 2007 – మార్చి 31, 2011 మధ్యలో జన్మించి ఉండాలి.
- పదకొండో తరగతికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఏప్రిల్ 1, 2005 – మార్చి 31, 2009 మధ్యలో జన్మించి ఉండాలి.

స్కూల్స్.. ప్రమాణాలు

పీఎం–యశస్వి స్కాలర్‌షిప్ అందకునే విద్యార్థి చదివే స్కూల్‌కు నిర్దిష్ట ప్రమాణాలు ఉండాలని పేర్కొన్నారు. సదరు పాఠశాలలో 10, 12 తరగతుల్లో వంద శాతం ఫలితాలు వచ్చి ఉండాలని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ నిర్దేశించింది. ఇలాంటి పాఠశాలలను గుర్తించేందుకు జాయింట్ సెక్రటరీ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. అంటే.. ఈ స్కాలర్‌షిప్ అందుకోవాలంటే.. టాప్ స్కూల్స్‌లో విద్యార్థులు చదువుతుండాలి లేదా ప్రవేశం ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.

ఫ్రీషిప్ కార్డ్

పీఎం–యశస్వి స్కీమ్ ద్వారా ఎంపికైన విద్యార్థులకు ఫ్రీషిప్ కార్డ్ సదుపాయం అందుబాటులో ఉంటుంది. వీటిని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు అర్హులైన విద్యార్థులకు జారీ చేస్తాయి. వీటి ద్వారా విద్యార్థులు ఆయా ఇన్‌స్టిట్యూట్స్‌లో ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు చెల్లించకుండానే అడుగు పెట్టొచ్చు.

వైఈటీలో ప్రతిభతో ఎంపిక

పీఎం–యశస్వి స్కాలర్‌షిప్స్‌కు అర్హులైన విద్యార్థులను ఎంపిక చేయడం కోసం జాతీయ స్థాయిలో యశస్వి ఎంట్రన్స్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ పరీక్ష నిర్వహణ బాధ్యతను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) చేపడుతోంది.

మొత్తం 100 మార్కులు

- వైఈటీ పరీక్ష.. తొమ్మిది, పదకొండో తరగతుల విద్యార్థులకు వేర్వేరుగా ఉంటుంది. పరీక్షలో సబ్జెక్టులు, మార్కులు రెండు తరగతులకు ఒకే విధంగా ఉన్నప్పటికీ.. వాటి క్లిష్టత స్థాయి ఆయా తరగతులకు అనుగుణంగా ఉంటుంది. వైఈటీ పరీక్షను నాలుగు విభాగాల్లో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో మ్యాథమెటిక్స్ 30 ప్రశ్నలు–30మార్కులు, సైన్స్ 25 ప్రశ్నలు–25 మార్కులు, సోషల్ సైన్స్ 25 ప్రశ్నలు–25 మార్కులు, జనరల్ అవేర్‌నెస్/జనరల్ నాలెడ్జ్ 20 ప్రశ్నలు–20 మార్కులకు పరీక్ష జరుగుతుంది.
- పరీక్ష పూర్తిగా ఓఎంఆర్ షీట్ విధానంలో పెన్ పేపర్ పద్ధతిలో నిర్వహిస్తారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలోనే ఉంటాయి. పరీక్షకు కేటాయించిన సమయం రెండున్నర గంటలు. పరీక్షను ఇంగ్లిష్/హిందీలో నిర్వహిస్తారు.

రాష్ట్ర స్థాయిలో మెరిట్ జాబితా

యంగ్ అచీవర్స్ టెస్ట్‌లో పొందిన మార్కుల ఆధారంగా రాష్ట్రాల వారీగా.. ఆయా వర్గాలకు నిర్దిష్ట సంఖ్యలో స్కాలర్‌షిప్‌లను మంజూరు చేస్తారు. ప్రతి రాష్ట్రానికి, వర్గానికి సంబంధించి.. వారికి కేటాయించిన సంఖ్య ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ మెరిట్ జాబితాలో నిలిచి స్కాలర్‌షిప్‌నకు అర్హత పొందిన వారికి.. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో స్కాలర్‌షిప్ మొత్తాన్ని జమ చేస్తారు. ఆ తర్వాత.. విద్యార్థులు అకడమిక్‌గా చూపిన ప్రతిభ, పరీక్షల్లో పొందిన మార్కులు, హాజరు శాతం ఆధారంగా కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటారు.

వైఈటీ.. దరఖాస్తు విధానం

ఎన్‌టీఏ నిర్వహించే వైఈటీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తు చేసుకునే సమయంలో.. ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డ్; పుట్టిన తేదీ ధ్రువ పత్రం; ఆధార్ నెంబర్; విద్యార్హతల సర్టిఫికెట్లు;ఫొటోగ్రాఫ్;సంతకం; కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రం; దివ్యాంగ విద్యార్థులు పీడబ్ల్యూడీ సర్టిఫికెట్‌ను కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

మంచి మార్కులు పొందాలంటే

- వైఈటీ పరీక్షలో మంచి మార్కులు సాధించడానికి తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎన్‌సీఈఆర్‌టీ ఏడు, ఎనిమిది తరగతుల పుస్తకాలు; పదకొండో తరగతి విద్యార్థులు ఎన్‌సీఈఆర్‌టీ పదో తరగతి పుస్తకాలు చదవాలి. అన్ని సబ్జెక్ట్‌లలోని ముఖ్యాంశాలను చదవాలి. ముఖ్యంగా సైన్స్, మ్యాథమెటిక్స్‌లో ఆయా సిద్ధాంతాలు, సూత్రాలు, భావనలను చదవాలి.
- నేచురల్ సైన్స్‌కు సంబంధించి వ్యాధులు, బ్యాక్టీరియాలు, మానవ శరీర నిర్మాణం, కణజాలం, కిరణజన్య సంయోగ ప్రక్రియ వంటి కీలకమైన అంశాలను చదవాలి.
- సోషల్ సైన్సెస్ విషయంలో హిస్టరీ, జాగ్రఫీ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- జనరల్ అవేర్‌నెస్, జనరల్ ఎబిలిటీ విభాగంలో రాణించేందుకు..జనరల్ నాలెడ్జ్ అంశాలను తెలుసుకోవాలి. ముఖ్యమైన వ్యక్తులు, నూతన నియామకాలు, సదస్సులు, సమావేశాలు, ముఖ్యమైన ప్రదేశాలు, క్రీడలు–విజేతలు, వ్యక్తులు–అవార్డులు, దేశాలు –రాజధానులు, దేశాలు–కరెన్సీ వంటి అంశాలపై పూర్తి సమాచారం సేకరించుకుని చదవాలి. అదే విధంగాఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో ప్రతి అధ్యాయం చివరలో ఉండే కొశ్చన్స్/ఎక్సర్‌సైజ్‌లను ప్రాక్టీస్ చేయడం మేలు చేస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 10.08.2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** ఆగస్టు 12 – 16,2023
- **ఎన్‌టీఏ–వైఈటీ పరీక్ష తేదీ:** సెప్టెంబర్ 29, 2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి జిల్లా కేంద్రాలు, తెలంగాణలో అన్ని జిల్లా కేంద్రాలు.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://yet.nta.ac.in, www.nta.ac.in, https://socialjustice.gov.in

క్లుప్తంగా...

పలువురు డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగులు

సాక్షి, హైదరాబాద్: ఇటీవలే తహసీల్దార్ల నుంచి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు పొందిన మరో 14 మంది అధికారులకు పోస్టింగులిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా ఇతర ప్రభుత్వ శాఖలకు డిప్యుటేషన్‌పై పంపుతూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మైనార్టీ సంక్షేమ శాఖ, మెప్మా, జీహెచ్‌ఎంసీ, మహిళా శిశు సంక్షేమశాఖలతో పాటు భూసేకరణ విభాగంలో వీరిని నియమిస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ముగ్గురు ఐపీఎస్‌లకు డీజీపీలుగా పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: ముగ్గురు సీనియర్ ఐపీఎస్‌లకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నతి లభించింది. 1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్‌లు రాజీవ్‌రతన్, సీవీ ఆనంద్‌తోపాటు 1992 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ జితేందర్‌కు డీజీపీలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజీవ్‌రతన్ తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, సీవీ ఆనంద్ హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌గా, రాష్ట్ర నార్కోటిక్స్ బ్యూరో అడిషనల్ డైరెక్టర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. జితేందర్ హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా, జైళ్ల శాఖ డీజీగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించనున్నారు. ముగ్గురు అధికారులు డీజీ హోదాలో అదే స్థానాల్లో కొనసాగుతారని సీఎస్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

17 వేల మంది ఇమామ్‌లు, మౌజాన్స్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్‌లు, మౌజాన్స్ సంఖ్య 17 వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో రాష్ట్రంలో 9,995 మంది ఇమామ్‌లు, మౌజాన్స్ ఉండగా.. వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఇమామ్‌లు, మౌజాన్స్ సంఖ్య పెంపునకు రాష్ట్రానికి ప్రతిపాదన పంపారు. దీన్ని పరిశీలించిన ప్రభుత్వం ఇమామ్‌లు, మౌజా న్స్ సంఖ్యను 17 వేలకు పెంచుతూ సోమవా రం రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ ఉత్తర్వులు జారీచేశారు. వీరికి నెలకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం ఇవ్వనున్నారు.

మూడు రోజులు.. 1,770 దరఖాస్తులు

మద్యం దుకాణాలకు మందకొడిగా దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏ4 (వైన్)షాపుల దరఖాస్తు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఈనెల 4 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాగా, ఆదివారం సెలవు రోజు మినహా 3రోజుల్లో కలిపి 1,770 దరఖాస్తులు వచ్చినట్టు ఎక్సైజ్ వర్గాల ద్వారా తెలిసింది. తొలి రోజున 140, తర్వాతి రోజున 459 దరఖాస్తులు రాగా, సోమవారం 1,171 దరఖాస్తులు వచ్చాయని సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 2,620 వైన్‌షాపులకు లాటరీ ద్వారా లైసెన్సులు కేటాయించేందుకు జరుగుతున్న ఈ దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 18 వరకు కొనసాగనుంది. ప్రస్తుతం మందకొడిగానే ఉన్నా రెండు, మూడు రోజుల్లో దరఖాస్తు ప్రక్రియ ఊపందుకుంటుందని, గత రెండేళ్ల కంటే ఎక్కువగానే దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

'బుద్వేల్' వేలం ఆపండి

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్ గ్రామంలో హైకోర్టు అత్యాధునిక భవనం నిర్మాణం కోసం గతంలో గుర్తించిన 100 ఎకరాల భూమిని వేలం పెట్టకుండా హెచ్‌ఎండీఏను, ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు లేఖ రాశారు. హైకోర్టు భవనం కోసం గుర్తించిన సదరు భూమిని వేలం వేయకుండా అడ్డుకోవాలని, హైకోర్టుకు కేటాయించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.



యువ కార్మికులు(ఫైల్)

అమ్మో... భూగర్భ గనులు

సింగరేణిలో ఈ గనుల్లోనే గైర్హాజరీలు ఎక్కువ | కారుణ్య నియామకాల్లో వచ్చిన యువతలో అనాసక్తి

- చిన్నచిన్న అనారోగ్య కారణాలు సాకుగా చూపుతూ విధులకు డుమ్మా
- వీరిలోనూ ఉన్నత విద్యావంతులే అధికం.. ఒక్క వకీల్‌పల్లిగనిలోనే 60 మంది దాకా
- గైర్హాజరుతో ఉద్యోగాలు కోల్పోవద్దంటున్న అధికారులు

ఆర్జీ–1 ఏరియా జీడీకే–11గనిలో ఓ యువ కార్మికుడు 2022 ఏప్రిల్‌లో ఉద్యోగంలో చేరాడు. 15 నెలల్లో 19రోజులు మాత్రమే డ్యూటీ చేశాడు. గైర్హాజర్ కౌన్సెలింగ్‌కు హాజరై తన తల్లిదండ్రుల ఆరోగ్యం బాగోలేక డ్యూటీకి రావడం లేదని కారణంగా చెప్పాడు. దీంతో గైర్హాజర్ కార్మికుల జాబితాలో ఆయన చేరాడు.

జీడీకే–11గనిలో బదిలీ వర్కర్‌గా 2015లో సింగరేణి విధుల్లో చేరాడు. ఐదేళ్ల నుంచి కనీసం వంద మస్టర్లు చేయలేదు. దీంతో ఉద్యోగం నుంచి డిస్మిస్ చేసే పరిస్థితి ఏర్పడింది. కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగోలేకే తాను డ్యూటీకి రావడం లేదని చెబుతున్నాడు.

'ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లిగనిలో పనిచేస్తున్న యువ కార్మికుడు 2015లో కారుణ్య నియామకం ద్వారా సంస్థలో చేరాడు. డిగ్రీ పూర్తి చేసిన యువకుడికి సంబంధించి గడిచిన 8 ఏళ్లలో వంద మస్టర్లు మాత్రమే నమోదయ్యాయి. తల్లి ఆరోగ్యం బాగోలేకపోవడం వల్లే డ్యూటీకి రాలేకపోతున్నానని అంటున్నాడు.

..ఆర్జీ–2 లో వకీల్‌పల్లిగనికి చెందిన ఒకరు 2018లో ఉద్యోగంలో చేరారు. కనీసం అతను 60 డ్యూటీలు కూడా చేయలేదు. దీంతో సింగరేణి యాజమాన్యం గైర్హాజర్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని నోటీసు జారీ చేసింది. ఇటీవల గనిలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు హాజరయ్యాడు.

గోదావరిఖని: సింగరేణి భూగర్భగనుల్లో పనిచేసేందుకు యువత ఎక్కువగా మక్కువ చూపడం లేదు. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన వారే గైర్హాజరు అవుతున్న వారిలో అధికంగా ఉన్నారు. బీటెక్, ఎంటెక్, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ లాంటి ఉన్నత చదువులు చదివి ప్రస్తుతం వచ్చిన ఉద్యోగాన్ని నామోషీగా భావించేవారు కొందరయితే, ఇక్కడ వర్క్ కల్చర్ ఇష్టం లేక, సిగరేణి ఆఫీసుల్లో అవకాశం రాక, లైట్ జాబ్‌ల కోసం పరుగులు తీసేవారు మరికొందరు. మూడు షిఫ్టుల విధానానికి ఇష్టపడినవారు ఇంకొందరు. సింగరేణిలో చేరిన కొద్దిరోజులకే విధులకు డుమ్మా కొట్టేవారి సంఖ్యా క్రమక్రమంగా పెరుగుతోంది. పలువురు కుటుంబసభ్యులు, తల్లిదండ్రుల అనారోగ్య కారణాలు సాకుగా చూపుతూ గైర్హాజరవుతున్నారు. ఒక్క వకీల్‌పల్లిగనిలో గైర్హాజరు అయిన వారు 60 మంది దాకా ఉన్నారు.

కారుణ్య నియామకాలు ఇలా

సింగరేణిలో పనిచేసే కార్మికుడు మెడికల్ ఇన్వాలిడేషన్ (అనారోగ్య కారణం)తో విధుల నుంచి తప్పుకుంటే వారి స్థానంలో కొడుకుకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం ఇస్తున్నారు. తెలంగాణ వచ్చాక 2015 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కాగా, ఇప్పటివరకు 11,541మంది యువత ఉద్యోగాల్లో చేరారు. విధుల్లో చేరిన నాటి నుంచి మూడేళ్ల పాటు పనిచేస్తే వారి ఉద్యోగాలు పర్మనెంట్ అవుతాయి. అయితే సింగరేణిలో 12 ఏరియాల్లో గత మూడేళ్లలో కనీసం 100 మస్టర్లు కూడా చేయని కార్మికులు 1377 మంది ఉన్నారు.

పూర్తిస్థాయి యాంత్రీకరణ ఉన్నా..

పదేళ్ల కిందట అయితే భూగర్భగనిలోకి దిగి పైకి ఎక్కడమే ఎంతో శ్రమగా ఉండేది. తట్టాచెమ్మస్ పూర్తిగా కనుమరుగైపోయింది. సెమీ మెకనైజ్డ్, ప్రస్తుతం పూర్తిస్థాయి యాంత్రీకరణ కొనసాగుతోంది. మ్యాన్‌రైడింగ్, చైర్‌కార్, చైర్ లిఫ్టులాంటి విధానం ద్వారా భూగర్భగనిలోని పనిస్థలాల వద్దకు కార్మికులను తీసుకెళ్లి, తిరిగి తీసుకొస్తున్నారు. దీంతో కార్మికులకు నడక శ్రమ చాలా తగ్గింది. అయినా చాలామంది యువ కార్మికులు ఆఫీస్ కార్యాలయాలు, ఓసీపీలు, గనిపైన ఉన్న లైట్‌జాబ్ కోసం పైరవీలు చేస్తున్నారు.

ఏటా వంద మస్టర్లు తప్పనిసరి

సంస్థలో బదిలీ వర్కర్లుగా ఉద్యోగంలో చేరిన కార్మికులకు ఏటా భూగర్భ గనుల్లో అయితే 190 మస్టర్లు, సర్ఫేజ్‌లో అయితే 240 మస్టర్లు ఉండాలి. అవి ఉంటేనే వారి ఉద్యోగాలు పర్మనెంట్ అవుతాయి. ఏటా వంద మస్టర్ల చొప్పున మూడేళ్ల పాటు 300 మస్టర్లుంటే ఉద్యోగానికి గ్యారెంటీ. లేనిపక్షంలో యాజమాన్యం నిబంధనల ప్రకారం ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తుంది.



కౌన్సెలింగ్‌కు కుటుంబ సమేతంగా హాజరైన యువత



వాస్తవ కారణాలు ఉంటే సంస్థ సహకరిస్తుంది

ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాలకు విపరీతమైన పోటీ ఏర్పడింది. సింగరేణిలో చేరిన యువత చిన్నకారణాలతో విధులకు గైర్హాజరవుతూ ఉద్యోగాలు పోగొట్టుకోవద్దు. ఏవైనా వాస్తవ కారణాలుంటే సంస్థ కూడా సహకరిస్తుంది. సంస్థలో యువకార్మికులు పెరుగుతున్న క్రమంలో సంస్థ మరింత లాభాల బాటలో పయనించాలి. కారణాలేవైనా సంస్థ ఉద్యోగం పోగొట్టుకుని ఉద్యోగితో పాటు కుటుంబం వీధిన పడటం సరికాదు.

–బలరాం, డైరెక్టర్(పా), సింగరేణి

పన్ను రాబడులు 'తగ్గాయ్'!

- గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది తొలి త్రైమాసికంలో తగ్గిన పన్నుల వాటా
- 2022–23లో తొలి మూడు నెలల్లోనే 23 శాతం పన్ను వసూళ్లు
- 2023–24లో వచ్చింది 20.80 శాతమే... రూ. 30 వేల కోట్లు దాటిన పన్నులు
- మూడు నెలల్లో అప్పులతో కలిపి రూ.50 వేల కోట్లు దాటిన బడ్జెట్ పద్దు



సాక్షి, హైదరాబాద్: గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది తొలి త్రైమాసికంలో రాష్ట్ర ప్రభుత్వ పన్ను రాబడుల శాతం తగ్గింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వం ప్రతిపాదించిన బడ్జెట్ అంచనాల్లో 23.07% పన్నులు తొలి మూడు నెలల్లో వసూలవగా 2023–24 ఆర్థిక సంవత్సర తొలి 3 నెలల్లో 20% మాత్రమే వసూలయ్యాయి. అయితే పరిమాణాన్ని బట్టి చూస్తే మాత్రం పన్నులు రూ. 2 వేల కోట్ల మేర పెరిగాయి. గతేడాది తొలి మూడు నెలల్లో పన్నుల రూపేణా రూ. 29,212.41 కోట్లు రాగా 2023–24లో రూ. 31,725.10 కోట్లు వసూలయ్యాయి. సంఖ్యాపరంగా పన్ను వసూళ్లు పెరిగినా శాతం లెక్కన మాత్రం తగ్గాయని కాగ్ గణాంకాలు చెబుతున్నాయి. పన్ను కేటగిరీలోకి వచ్చే అన్ని పద్దుల్లో రాబడుల శాతం గతేడాది కంటే ఈ ఏడాది తగ్గడం గమనార్హం.

పన్నేతర ఆదాయం కూడా...

గతేడాదితో పోలిస్తే పన్ను రాబడులతో పా టు పన్నేతర ఆదాయమూ భారీగా తగ్గింది. తొలి మూడు నెలలకుగాను 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ. 6,874.96 కోట్లు రాగా ఈసారి అతితక్కువగా రూ. 1,811.52 కోట్లు వచ్చింది. పన్నేతర ఆదాయం కింద ఈ ఏడాదిలో మొత్తం రూ. 22,808 కోట్లు వస్తుందని ప్రభుత్వం అంచనా వేయగా తొలి మూడు నెలల్లో అందులో కేవలం 4.39 శాతమే రావడం గమనార్హం. మొత్తంమీద ఈ ఏడాదిలో పన్ను ఆదాయం కింద రూ. 31,725 కోట్లు, పన్నేతర ఆదాయం రూ. 1,811 కోట్లతోపాటు అప్పుల రూపంలో సేకరించిన రూ. 15,876.50 కోట్లు కలిపి తొలి మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ పద్దు రూ. 50,910.11 కోట్లకు చేరింది. ఇది మొత్తం బడ్జెట్ అంచనాల్లో 19.59 శాతం కావడం గమనార్హం.

గత, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 3 నెలల్లో వచ్చిన పన్ను ఆదాయం (రూ.కోట్లలో)

సంవత్సరం	జీఎస్టీ	రిజిస్ట్రేషన్లు	అమ్మకపు పన్ను	ఎక్సైజ్	గ్రాంట్ ఇన్ ఎయిడ్
2022-23	9,645.14	3,815.35	7,479.22	4,158.96	1,425.71
2023-24	11,418.17	3,510.63	7,532.96	4,405.48	1,811.52

(గమనిక: సంఖ్యాపరంగా కొన్ని పన్ను పద్దుల్లో గతేడాది కంటే ఎక్కువ ఆదాయం వచ్చినప్పటికీ బడ్జెట్ మొత్తం అంచనాలతో పోలిస్తే గతేడాది కంటే ఈసారి తక్కువ శాతంలో పన్నులు వసూలయ్యాయి.)



మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ ఎస్.దయానంద్ తదితరులు

10న అర్ధరాత్రి నుంచి ట్రాన్స్‌పోర్ట్ వాహనాల బంద్

రవాణా కార్మికుల జేఏసీ వెల్లడి

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): రవాణారంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ ఈ నెల 10న అర్ధరాత్రి నుంచి 24 గంటల పాటు అన్ని రకాల రవాణా వాహనాల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రవాణా కార్మికుల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) తెలిపింది. సోమవారం జేఏసీ కన్వీనర్ ఎస్.దయానంద్, కో కన్వీనర్ టి.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడితే రవాణా రంగ కార్మికుల బతుకులు మారతాయని ఆశించి ఉద్యమంలో ముందుండి పోరాడిన రవాణారంగ కార్మికులకు నిరాశే మిగిలిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రవాణారంగం నుంచి ఏటా పన్నుల రూపేనా వేలాది కోట్ల ఆదాయం వస్తున్నా రవాణా రంగ కార్మికుల అభివృద్ధికి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంలో విఫలమయ్యాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఓలా, ఉబర్ వచ్చిన తర్వాత డ్రైవర్లపై దాడులు పెరిగిపోయాయని, తక్షణమే వాటిని ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఆటోలకు కొత్త పర్మిట్లనివ్వాలని, లారీలకు సింగిల్ పర్మిట్ విధానం తేవాలని కోరారు.

గజం రూ.1,05,000

- మోకిలా ప్లాట్లకు మూడు రెట్ల ధర
- గజానికి కనీస ధర రూ.25,000గా నిర్ణయం
- 50 ప్లాట్లపై రూ.121.40 కోట్ల ఆదాయం

సాక్షి, హైదరాబాద్: మోకిలాలోని హెచ్‌ఎండీఏ ప్లాట్లకు సోమవారం నిర్వహించిన ఆన్‌లైన్ వేలానికి అనూహ్యమైన స్పందన లభించింది. చదరపు గజం అత్యధికంగా రూ.1,05,000, కనిష్ఠంగా రూ.72,000 చొప్పున ధర పలికింది. సగటున రూ.80,397 చొప్పున ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో విక్రయించినట్టు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. మొత్తం 50 ప్లాట్లపైన హెచ్‌ఎండీఏకు రూ.121.40 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ప్లాట్లకు చదరపు గజానికి రూ.25 వేల చొప్పున కనీసధర నిర్ణయించగా, దానికి మూడురెట్లు వేలంలో డిమాండ్ వచ్చినట్టు అధికారులు తెలిపారు. నార్సింగి–శంకర్‌పల్లి మార్గంలో ఉన్న మోకిలాలో భూములు హాట్‌కేకుల్లా అమ్ముడుపోవడం విశేషం. హెచ్‌ఎండీఏకు ఇక్కడ 165 ఎకరాల భూమి ఉంది. వీటిలో 15,800 చదరపు గజాల్లో విస్తరించి ఉన్న 50 ప్లాట్లకు సోమవారం ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా అధికారులు వేలం నిర్వహించారు. ఒక్కో ప్లాట్ 300 గజాల నుంచి 500 గజాల వరకు ఉంది. ఇటీవల కోకాపేటలో నియోపోలీస్ రెండో దశ భూముల తరహాలోనే మోకిలాలోనూ హెచ్‌ఎండీఏ ప్లాట్లకు భారీ డిమాండ్ రావడం గమనార్హం. ఈ లే అవుట్‌లో త్వరలో రెండోదశ ప్లాట్లకు కూడా ఆన్‌లైన్ వేలం నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

పెద్దపల్లి – నిజామాబాద్ 'డబ్లింగ్'కు పచ్చజెండా

- 178 కి.మీ. ఫైనల్ లొకేషన్ సర్వేకు ఆమోదం
- సర్వేకు నిధులు కూడా విడుదల చేసిన దక్షిణ మధ్య రైల్వే
- డబ్లింగ్ పూర్తయితే ఇతర రాష్ట్రాలతో పెరగనున్న కనెక్టివిటీ



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: పెద్దపల్లి – నిజామాబాద్ రైల్వే మార్గంలో మరో ముందడుగు పడింది. ఇప్పటివరకూ సింగిల్‌లైన్‌గా ఉన్న ఈ మార్గాన్ని ఇకపై ఎలక్ట్రిక్ డబుల్ రైల్వే మార్గం చేయాలని రైల్వేశాఖ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సాధ్యాసాధ్యాలపై ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్‌ఎల్‌ఎస్)కు ఆమోదం తెలిపారు. ఇందుకోసం రూ.3.55 కోట్లు కూడా విడుదల చేస్తూ దక్షిణ మధ్య రైల్వే ఆదేశాలు జారీచేసింది. 178 కి.మీ. దూరం ఉన్న ఈ రెండు నగరాల మధ్య రాకపోకలను మరింత సౌకర్యవంతం చేయాలన్న ఉద్దేశంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.రాష్ట్రంలోని దాదాపు 14 మార్గాల్లో అదనపు రైల్వేలైన్ల కోసం సర్వే చేయాలని నిర్ణయించగా.. మూడు దశాబ్దాల చిరకాల స్వప్నంగా నిలిచిన ఈ మార్గం కూడా జాబితాలో చోటు దక్కించుకోవడంపై ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గణనీయంగా పెరిగిన ఫ్రీక్వెన్సీ..

ఈ మార్గంలో వందేభారత్ వంటి రైళ్లు సైతం నడిచే విధంగా ఇటీవల 100 కి.మీ. వేగం తట్టుకులా ట్రాక్ సామర్థ్యం పెంచారు. గ్రానైట్, బొగ్గు, బాయిల్డ్ బియ్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతికోసం గతంలో ఎన్నడూలేనంతగా గూడ్స్ రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరిగింది. ఫలితంగా దక్షిణమధ్య రైల్వేజోన్‌లో సరుకు రవాణా రైళ్ల ద్వారా అత్యధికంగా ఆదాయం తీసుకువచ్చే మార్గాల్లో పెద్దపల్లి – నిజామాబాద్ లైన్ ఒకటిగా ఆవిర్భవించింది.

ఆశించిన ప్రయాణికుల రైళ్లు లేక..

అయితే ఈ మార్గంలో ప్రయాణికుల రైళ్లు మాత్రం చెప్పుకోదగ్గవి ఏమీలేవు. ఈ మార్గం మీదుగా ఢిల్లీ, కోల్‌కతా, విశాఖపట్నం, వారణాసి, బెంగళూరు, చెన్నై, తిరువనంతపురం నగరాలకు రైళ్లు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మార్గంలో ప్రస్తుతం కేవలం రెండు పుష్‌పుల్ (డెమూ, మెమూ) ఎక్స్‌ప్రెస్ రైళ్లు, కాజీపేట నుంచి దాదర్ ముంబై వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు, తిరుపతి నుంచి కరీంనగర్ బైవీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. ఈ రైల్వే మార్గంలో కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్ లాంటి ఎక్కువ జనాభా కలిగిన పట్టణాలు కూడా ఉన్నాయి. ఈ లైన్‌లోనే కరీంనగర్ నుంచి హసన్‌పర్తి రోడ్డు రైల్వేమార్గం కూడా నిర్మించనున్నారు. ఇది పూర్తయితే షిర్డీ, ముంబై, గుజరాత్‌కు సులువుగా చేరుకోవచ్చని చెపుతున్నారు. ఈ అంశాలన్నీ దృష్టిలో పెట్టుకొని ఈ మార్గాన్ని డబుల్ లైన్‌గా విస్తరించాలని రైల్వే ఉన్నతాధికారులు నిర్ణయించారు.

యాదాద్రిలో శ్రావణమాస ఉత్సవాలకు ఏర్పాట్లు

- ఈ నెల 18, 25, వచ్చేనెల 1,8 తేదీల్లో కుంకుమార్చన
- వచ్చే నెల 8న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని శ్రీమహాలక్ష్మీ, ఆండాళ్ అమ్మవార్లకు కుంకుమార్చన పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో గీతారెడ్డి సోమవారం వెల్లడించారు. మహిళ సౌభాగ్యం యంత్రశక్తి ఉద్దీపనలను అనుసరించి శ్రీమహాలక్ష్మి, ఆండాళమ్మ వార్లకు కుంకుమార్చన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యాదాద్రి కొండపై గల తూర్పు, ఉత్తర ప్రథమ ప్రాకార మండపంలో ఈ నెల 18, 25, వచ్చే నెల 1, 8 తేదీల్లో అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కుంకుమార్చన పూజలను భక్తులచే జరిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ పూజలో భక్తులు పాల్గొనేందుకు ఆర్జిత సేవ టికెట్ ధర రూ.2 వేలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. వచ్చే నెల 8న సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కొండ కింద గల శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం హాల్ 2లో ఉదయం 10 గంటలకు ఈ వరలక్ష్మీ వ్రతం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దీని కోసం భక్తులు వ్రత మండపం కౌంటర్‌లో వివరాలు తెలియజేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

'బ్యాటరీ సైకిళ్లకు' ప్రతిపాదనలు పంపండి

అధికారులకు మంత్రి కొప్పుల ఈశ్వర్



సాక్షి, హైదరాబాద్: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధి క ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు ఇవ్వాలని, ఇందుకోసం జిల్లాల వారీగా ప్రతిపాదనలు రూ పొందించి ప్రభుత్వానికి సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని తన చాంబర్‌లో దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యకలాపాలపై రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, ప్రభుత్వకార్యదర్శి భా రతి హోళికేరి, సంస్థ ఎండీ శైలజ తదితరులతో కలిసి సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ దివ్యాంగులకు ఆత్మగౌరవభవనం, సదరం సర్టిఫికెట్ల జారీ తదితర అంశాల్లో నెలకొన్న అవరోధాలుంటే వివరించాలని సూచించారు.

ఆర్టీసీ బస్సుల్లో సీటు బెల్టులు

కొత్తగా రోడ్డెక్కే ఏసీ ఎలక్ట్రిక్ బస్సుల్లో ఏర్పాటు

- విమానాశ్రయం, ఐటీ కారిడార్ రూట్లలో సేవలు
- తొలి దశలో 50 బస్సులు.. నెలన్నరలో 25 రాక
- మోడల్ బస్సును పరిశీలించిన ఎండీ సజ్జనార్



సాక్షి, హైదరాబాద్: సాధారణంగా కార్లలో సీటు బెల్టులు వాడుతుంటారు. కానీ, తొలిసారి నగరంలో సీట్ బెల్టులుండే సిటీ బస్సులు అందుబాటులోకి రాబోతున్నాయి. విదేశాల్లో బస్సుల్లో కూడా సీటు బెల్టులు తప్పని సరి. వాస్తవానికి మన దగ్గర కూడా బస్సుల్లోనూ సీటు బెల్టులుండాలనే నిబంధన ఉన్నా అది అమలుకావటం లేదు. తొలిసారి ఆర్టీసీ సిటీ సర్వీసుల్లో ఆ తరహా సీట్లను అందుబాటులోకి తెస్తోంది. నగరంలో మరో నెలన్నరలో అందుబాటులోకి రానున్న ఎలక్ట్రిక్ ఏసీ బస్సుల్లో ఇవి కనిపించనున్నాయి. ఆ బస్సులు ఎలా ఉండనున్నాయో అధికారులు పరిశీలించేందుకు వీలుగా నమూనా బస్సును సోమవారం బస్‌భవన్‌కు తీసుకురాగా, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పరిశీలించారు.

➡హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ కారిడార్ మార్గాల్లో తిరిగేందుకు వీలుగా ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను తిప్పాలని ఆర్టీసీ ఇటీవల నిర్ణయించింది. ఇప్పటికే పుష్పక్ పేరుతో 40 ఎలక్ట్రిక్ బస్సులు విమానాశ్రయం మార్గంలో తిరుగుతున్న విషయం తెలిసిందే. అవన్నీ లాభాల్లో ఉండటం, రద్దీకి చాలినన్ని లేకపోవటంతో అదనంగా మరిన్ని బస్సులు తిప్పాలని నిర్ణయించారు. దానితో పాటు ఐటీ కారిడార్‌లో మెట్రో రైలు సేవలు అందుబాటులో లేని రూట్లలో కొన్ని తిప్పనున్నారు. ప్రస్తుతం విమానాశ్రయ మార్గంలో నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సులతో పోలిస్తే ఆధునిక వసతులు అదనంగా ఉన్న ఈ కొత్త బస్సులు ప్రయాణికులకు మెరుగైన రవాణా వసతిని అందించనున్నాయి.

500 బస్సులకు ఆర్డర్

500 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను నగరంలో తిప్పాలని నిర్ణయించిన ఆర్టీసీ, ఇప్పటికే ఆర్డర్ ఇచ్చిన విషయం తెలిసిందే. సిటీ బస్సులుగా తిప్పే సర్వీసులకు సంబంధించి తొలి విడతలో 50 బస్సులు అందుబాటులోకి రానున్నాయి. అందులో 20 శంషాబాద్ విమానాశ్రయానికి, 30 ఐటీ కారిడార్‌లో తిరుగుతాయి. ఇందులో 25 బస్సులు నెలనెలన్నరలో రోడ్డెక్కుతాయని అధికారులు అంటున్నారు. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు పద్ధతిలో వీటిని ఆర్టీసీ అద్దెకు తీసుకుంటోంది. ఇవి కాకుండా మరో 800 ఎలక్ట్రిక్ బస్సులను దశలవారీగా సమకూర్చుకోవాలనేది ఆర్టీసీ ఆలోచన. వాటికి ఇంకా టెండర్లు పిలవలేదు.

ఆకుపచ్చ, తెలుపు రంగుతో..

ఆకుపచ్చ, తెలుపు రంగుతో ఈ బస్సులుంటాయి. రంగుల మేళవింపుపై ఎండీ సంతృప్తి వ్యక్తం చేశారు. బస్సు ముందువైపు ఆర్టీసీ లోగో లేకపోవటాన్ని ప్రశ్నించిన ఆయన, ప్రయాణికులకు కనిపించేలా లోగో ఏర్పాటు చేయాలని సూచించారు. కొన్ని సీట్లకే బెల్టులుండటంతో, అన్ని సీట్లకు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఓఓ రవీందర్, సీఎంఈ రఘునాథరావు, సీఈఐటీ రాజశేఖర్, ఒలెక్ట్రా కంపెనీ ప్రతినిధులు వేణుగోపాలరావు, ఆనంద్, యతీశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

12 మీటర్ల పొడవు..

- ➡ఇప్పుడు కొత్తగా సమకూరే ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు 12 మీటర్ల పొడవుతో ఉంటాయి.
- ➡ఒక్కో బస్సులో 35 సీట్లుంటాయి. ప్రతి సీటు వద్ద మొబైల్ చార్జింగ్ సాకెట్ అందుబాటులో ఉంటుంది.
- ➡బస్సుల్లో మూడు సీసీ టీవీ కెమెరాలు అమర్చి ఉంటాయి. అవి ఒక నెల రికార్డింగ్ బ్యాకప్‌తో ఉంటాయి.
- ➡రివర్స్ చేసేప్పుడు డ్రైవర్‌కు వెనక భాగం కనిపించేలా రివర్స్ పార్కింగ్ అసిస్టెన్స్ కెమెరా ఉంటుంది.
- ➡ప్రయాణికులకు సూచనలు అందజేసేందుకు వీలుగా బస్సులో నాలుగు ఎల్‌ఈడీ డిస్‌ప్లే బోర్డులుంటాయి.
- ➡అగ్నిప్రమాదాలను ముందుగానే గుర్తించేందుకు వీలుగా బస్సులో ఫైర్ డిటెక్షన్ సప్రెషన్ సిస్టం ఉంటుంది. వెహికిల్ ట్రాకింగ్ సిస్టం కూడా ఉంటుంది.
- ➡ఒకసారి ఫుల్ చార్జి అయితే 225 కి.మీ. దూరం వరకు ప్రయాణిస్తాయి. ఫుల్ చార్జింగ్‌కు దాదాపు 3 గంటల సమయం పడుతుంది.

పరిశోధనలపై పరస్పర సహకారం

- ఎంపికైన విద్యార్థులకు సంయుక్తంగా పీహెచ్‌డీ!
- కఠ్మాండు యూనివర్సిటీతో ఐఐటీహెచ్ ఒప్పందం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ హైదరాబాద్ (ఐఐ టీహెచ్), నేపాల్‌లోని కఠ్మాండు యూనివర్సిటీతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. వివిధ రంగాల్లో పరిశోధనలపై పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించాయి. ఈ రెండు విద్యా సంస్థలు సంయుక్తంగా పీహెచ్‌డీ స్థాయిలో జాయింట్ డాక్టోరల్ ప్రోగ్రాం (జేడీపీ)ను అందించాలని నిర్ణయించాయి. ఈ మేరకు జరిగిన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ పరిశోధన ప్రోగ్రాంకు ఎంపికైన విద్యార్థులకు ఈ రెండు విద్యా సంస్థలు సంయుక్తంగా పీహెచ్‌డీని అందించనున్నాయి. కఠ్మాండు యూనివర్సిటీలో జేడీపీ ప్రోగ్రాంలో జాయి న్ అయిన విద్యార్థులు ఐఐటీహెచ్‌లో ఒక సంవత్సరం చదువుకునే అవకా శం లభించనుంది. ఈ సందర్భంగా కఠ్మాండు వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొ ఫెసర్ బోలా థాపా మాట్లాడుతూ ఫ్యాకల్టీ పరస్పరం సహకరించుకోవడం, ఉమ్మడిగా పరిశోదన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఐఐ టీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్. మూర్తి మాట్లాడుతూ జేడీపీ ఒప్పందం నేపాల్ ప్రాంతం మరింత అభివృద్ధికి బాటలు వేస్తుందని అన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.